వీక్షణం


ఆర్థిక, సామాజిక పత్రిక

అక్టోబర్ 2005 51 రూ. 10

- దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితి - ఫోకస్
- సెప్టెంబర్ 17 - తెలంగాణ చరిత్రలో కీలక ఘటన
- ఆదివాసులు - అటవీ చట్టాలు - నిర్వాసితులు
- సమాచార హక్కు చట్టం
- పెట్రేగిపోతున్న హంతక ముఠాలు
- కొత్తదారి చూపుతున్న వెనిజ్యులా

త్వరలో....

సిడిఆర్‌సి ప్రచురణ



2005 మునిసిపల్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని
మునిసిపాలిటీలలో, కార్పొరేషన్‌లలో విస్తృతంగా సర్వే
నిర్వహించి గడించిన అనుభవంతో, విశేష పరిశోధనతో,
విస్తృత సమాచారంతో సెంటర్ ఫర్
డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్
ప్రచురించబోతున్న సమగ్ర సమాచారదర్శిని

వివరాలకు సంప్రదించండి :

మునిసిపల్ సర్వస్వం ప్రాజెక్ట్

సి.డి.ఆర్.సి.

CDRC

3-6-394, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500 029.
ఫోన్ : 5584 3495

విడి ప్రతి: రు. 10
వార్షిక చందా: రు.120

వీక్షణం

ఆర్థిక , సామాజిక పత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

51 అక్టోబర్ 2005

సంపాదకీయం

పురపాలనలో స్వపరిపాలన

స్థానిక స్వపరిపాలనా సంస్థలు ఉండాలని, అవి బలోపేతం కావాలని ఆశించడం ప్రజాస్వామ్యంలో మొట్టమొదటి మెట్టు. ఎవరికయినా స్వయం నిర్ణయాధికారం ఉండాలని, ఒకరిపైన మరొకరి నిర్ణయం చెల్లదని, అందువల్ల ఒక నాగరిక సమూహం తాను ఏమి చేయదలచుకున్నదో నిర్ణయించుకునే అధికారాన్ని ఆ సమూహానికే వదలాలని ప్రకటిస్తూ, ఈ భావాన్ని ప్రజాస్వామిక వికేంద్రీకరణకు మూలసూత్రంగా రాజకీయ భావజాలాలన్నీ అంగీకరిస్తున్నాయి. భారత చరిత్రలో తరతరాలుగా సాగిన గ్రామ రాజ్యాలుగాని, గాంధీ ప్రవచించిన గ్రామ స్వరాజ్యం గాని, 1947 తర్వాత భారత పాలకులందరూ అంగీకరించిన స్థానిక స్వపరిపాలనా సంస్థలుగాని ఈ మూలసూత్రపు వ్యక్తీకరణలే. రాజ్యాంగానికి 73, 74 సవరణల ద్వారా ఈ స్థానిక స్వపరిపాలనా సంస్థల అధికారాలను విస్తరించి వాటిని బలోపేతం చేసే ప్రయత్నం కూడా ముందుకు సాగింది.

ఆదర్శాలకూ, ఆచరణకూ మధ్య అంతరం ఎప్పుడూ ఉన్నట్టుగానే ఒక వైపు స్థానిక స్వపరిపాలనా సంస్థల మెరుగుదల కోసం ఎన్ని ఆదర్శాలను వల్లించడం జరిగినా, మరోవైపు 'స్థానిక' సంస్థల స్థానిక స్వభావాన్ని కొల్లగొట్టడానికి, వాటిని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల రబ్బర్ స్టాంపులుగా మార్చడానికి, వాటిలోని ప్రజాస్వామికతను కత్తిరించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

రాష్ట్రంలో ఈ నెలలో జరిగిన మునిసిపల్ ఎన్నికలు చాలాకాలం తర్వాత జరిగాయని, ఏదో ఒక స్థాయిలో స్థానిక స్వపరిపాలనా సంస్థలు ఎన్నికయ్యాయని ఆనందించవలసిందేగాని, ఈ ఎన్నికలలో ప్రచారసరళి, ప్రజా సమస్యల పరిష్కారంపై కాక ఇతర అంశాలపై దృష్టి, ప్రలోభాల వెల్లువ, హింస, గుత్తగా ఒకే రాజకీయ పక్షం గెలుపు, ఫలితాల సమీక్ష వంటి ఏ అంశంలో చూసినా సంతృప్తికరమైన పరిస్థితి లేదు.

స్థానిక సంస్థల అధికారాలకు లోబడి ఏయే సమస్యలను ఏ రకంగా పరిష్కరించబోతున్నారో చెప్పడానికి ఏ ఒక్క పార్టీ కూడ శ్రద్ధ పెట్టకపోవడం, అన్ని పార్టీలూ రాష్ట్ర సమస్యలను, దేశసమస్యలను స్థానిక ఎజెండాలుగా మార్చడం ఆయా పార్టీలకు కింది స్థాయి ప్రజా సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి లేదని చూపుతున్నాయి.

ఇక ఈ ఎన్నికలలో ప్రవహించిన డబ్బు, మద్యం, ప్రబలిన హింస బహుశా ఏ శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో కూడ చూసి ఉండని స్థాయిలో జరిగాయి. స్థానిక స్వపరిపాలనా సంస్థలకు ప్రతినిధులుగా ఎన్నికయి తమ పాలన తామే సాగించుకోవాలని మన రాజకీయ నాయకులలో వ్యక్తమయిన ఈ అత్యుత్సాహానికి కారణాలేమిటో ఎవరికి వారు ఊహించుకోవలసిన బహిరంగ రహస్యాలే. కొన్ని మునిసిపాలిటీలలో మచ్చుకైనా ఒక్క ప్రతి పక్ష సభ్యుడు లేకపోవడం ప్రజాస్వామిక పాలనకు ఎట్లా దారితీస్తుందో రాజనీతి శాస్త్రంలో కొత్త పాఠాలు చదువుకోవలసిందే.

మొత్తం మీద ఈ ఎన్నికలలో గెలిచింది ప్రజాస్వామ్యం కాదు, ప్రజలు కాదు. ప్రజాసమస్యల పరిష్కార ఆలోచనలు కావు. గెలిచినది ఎవరో కాని నిస్సందేహంగా ఓడిపోయింది మాత్రం ప్రజలే.

లోపలి పేజీల్లో...

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష సామాజిక, ఆర్థిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

వీక్షణం
సమతా పబ్లికేషన్స్
సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్
ఫ్లాట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 025. ఫోన్ : 040 - 55843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్.

ఉత్తరాలు:

'వీక్షణం' సెప్టెంబర్ సంచిక చదివాను. పక్షపత్రిక నుంచి మాసపత్రికగా మారేసరికి మరింత చిక్కదనం, వాడిదనం పెరిగాయనిపిస్తుంది. పుస్తక పరిచయంలో జాన్ పెర్కిన్స్ - కన్‌ఫెషన్స్ ఆఫ్ ఏన్ ఎకనమిక్ హిట్‌మాన్ చదివి ఆ పుస్తకం మొత్తం చదవాలన్న కోర్కె బలపడింది. ఎక్కడ దొరుకుతుంది ? ప్రచురణకర్తలు ఎవరు? ధర ఎంతో తెలుపుతారా? ముఖచిత్రంపై ప్రముఖుల ఫోటోలు లేక సంఘటనల ఫోటోలు వేస్తే బాగుంటుంది. లోపల ఫోటోలు ఎలాగూ వేయడం లేదు.

- మానేపల్లి
ఎలమంచిలి

'వీక్షణం' సెప్టెంబర్ 2005లో 'అగ్రరాజ్యాల కిరాయి గూండాలు' (జాన్ పెర్కిన్స్ రచన - కన్‌ఫెషన్స్ ఆఫ్ ఏన్ ఎకనమిక్ హిట్‌మాన్ ముందుమాట) సామ్రాజ్యవాది అమెరికా ప్రపంచంపై జరిపే మోసాన్ని ఈ పుస్తకం బహిర్గతపరుస్తుంది అనడంలో సందేహంలేదు. ఈ పుస్తకం లభించు స్థలం మాత్రం తెలియచేయలేదు. పుస్తకం ఇంగ్లీషులో రాశారా? తెలుగు అనువాదం జరిగిందా ? ఎచ్చట లభించగలదో వివరించగలరు. పుస్తకం ఇంగ్లీషులో వుంటే తెలుగువారికి అందని మానిపండే కదా ! కావున పుస్తకాన్ని ఇంగ్లీషు నుండి తెలుగులో అనువదించి ప్రచురించవలసిందిగా కోరుతున్నాను. ఈ పుస్తకాన్ని చదివి అమెరికా చేయబూనిన మోసాలతో పాటు మన పాలకుల మోసపూరిత అబద్ధాలు బద్దలు కాగలవు. ప్రజలు చైతన్యవంతులై ప్రపంచీకరణ - గ్లోబలైజేషన్, బహుళజాతి సంస్థలు - అగ్రరాజ్యాలు - బ్యాంకుల అధిపతుల బండారం బయటపడుతుందని ఆశిస్తున్నాను.

- బి. వెంకటరమణ,
చింతలపాలెం

రాంమోహనరావుగారి 'అందరికీ ఆరోగ్యం ఎట్లా సాధ్యం' వ్యాసం (వీక్షణం - ఆగస్ట్ 2005) బాగుంది. చాలా సమాచారం, ఆచరణలో ఎలా వుండాలో తెలియజేశారు. ప్రజాస్వామ్యం అంటే ప్రకృతి సహజ వనరులన్నీ ఉపయోగించుకుని అందరికీ కనీస అవసరాలు తీరేలా చేసుకోవడం. అటువంటి వ్యవస్థ ఏర్పడకపోతే అది ప్రజాస్వామ్యమే కాదు. ఇప్పుడున్నది ప్రజాస్వామ్యం కాదనడానికి ఇదొక కొలమానం కూడా. రాంమోహనరావుగారు ఆరోగ్య సంరక్షణ మూడు అంచెలుగా జరగాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణ జరగాలంటే ప్రతి శిశువుకి జన్మించగానే గుర్తింపు కార్డు, ఆరోగ్య పుస్తకం ఇవ్వాలి. బహుశా ఈ పుస్తకం శిశువు గర్భంలో వున్నప్పుడే తల్లికి ఇవ్వాలి. గర్భం దాల్చినప్పుడు తల్లికి వచ్చిన ఇబ్బందులు కూడా ఇందులో నమోదు చేయాలి. మనిషి పుట్టిన దగ్గర్నుండి, చనిపోయేవరకు ఈ పుస్తకం అతని / ఆమె వెంటే వుంటుంది. కంప్యూటర్ నెట్‌వర్క్‌లో కూడా వీటిని వుంచితే, రిఫరల్ హాస్పిటల్స్‌లో కూడా వీటిని వాడుకోవచ్చు. దీనివలన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లోని డాక్టర్లు అత్యవసర కేసుల్లో రిఫరల్ హాస్పిటల్స్ నుండి సలహా పొందవచ్చు. రాంమోహనరావుగారికి అభినందనలు. ఐఎంఎ ఈ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తుందని ఆశిద్దాం.

- కె. విజయకుమార్
ఖరగ్‌పూర్

మునిసిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజాభిప్రాయ సర్వే

సి.డి.ఆర్.సి. అన్నదే నిజమైంది!



రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధిక శాతం ఛైర్ పర్సన్స్ స్థానాలు అధికార కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందనీ, ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం ఉండబోదని ఎలక్షన్లకు ముందు జరిగిన సి.డి.ఆర్.సి. - తేజాన్యూస్ సంయుక్త సర్వే వెల్లడించింది.

సెప్టెంబర్ 26న విడుదలైన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు సరిగ్గా ఇదే విషయాన్ని ధృవీకరించాయి. కాంగ్రెస్ విజయ ఢంకా మోగించగా ప్రభుత్వ వ్యతిరేకతను నమ్ముకున్న తెలుగుదేశం పార్టీ ఘోరంగా దెబ్బతిన్నది. అదే విధంగా సర్వేలో సూచించినట్లుగానే తెలంగాణ రాష్ట్ర సమితి నామ మాత్రంగా మిగిలిపోయింది.

సామాజిక పరిశోధనా సంస్థగా నెలకొల్పబడ్డ సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్స్ (సి.డి.ఆర్.సి.) తేజ న్యూస్ ఛానల్‌తో కలిసి నిర్వహించిన ఈ మున్సిపల్ ఎన్నికల సర్వే రాష్ట్రంలో సంచలనం కలిగించింది. పకడ్బందీగా ప్రణాళికతో, సుశిక్షితులైన క్షేత్రస్థాయి సిబ్బంది సాయంతో రాష్ట్రంలోని 96 మున్సిపాలిటీలలో ఈ సర్వే జరుపబడింది. ఎలక్షన్లకు నెల రోజుల ముందుగా, ఆగస్టు 24 నుండి 30 తేదీల మధ్య ఒకసారి, మళ్ళీ నామినేషన్ల ప్రక్రియ ముగిసాక సెప్టెంబర్ 13-15 తేదీల మధ్య రెండవసారి ఈ సర్వే నిర్వహించారు.

మొదటి రౌండ్ సర్వేలో ప్రభుత్వ పనితీరుపై ప్రజలేమనుకుంటున్నారు, ఎన్నికల్లో ప్రభావం చూపే స్థానిక సమస్యలేమిటి, పార్టీల స్థానిక బలాబలాలు ఏమిటి, ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి వంటి ప్రశ్నలకు వోటర్లనుండి జవాబులు తెలుసుకోవడానికి ప్రయత్నించడం జరిగింది. రెండవ రౌండ్ సర్వేలో వార్డుల్లో అభ్యర్థుల విజయావకాశాలు బేరీజు వేయడం జరిగింది. ప్రతి మున్సిపాలిటీలో 300-500 వోటర్ల వంతున రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల మంది వోటర్లను కలిసి సేకరించిన సమాచారంతో సర్వే ఫలితాలు విడుదల చేయడం జరిగింది.




సర్వే భాగస్వామి అయిన తేజ న్యూస్ ఛానెల్‌లో ఈ సర్వే ఫలితాలు, వాటిపై సి.డి. ఆర్.సి. సిబ్బంది విశ్లేషణలు కూడా ప్రసారం చేయడం జరిగింది.

పారిశుధ్యమే ప్రధమ సమస్య

మొదటి రౌండ్ సర్వేలో స్థానికంగా ప్రధాన సమస్యలు ఏమిటి అని అడిగినప్పుడు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల మున్సిపాలిటీలలో 'పారిశుధ్యం, మురుగునీటి వ్యవస్థ సరిగా లేకపోవడం' ప్రధాన సమస్యగా తేల్చారు. ఆశ్చర్యకరంగా త్రాగునీటి సమస్య రెండో ప్రధాన సమస్యగా తేలింది. అయితే జోరు వానల్లో ప్రజలు మంచి నీటి సమస్యకన్నా మురుగు నీటి వల్లనే సమస్యలు ఎదుర్కొంటారనీ, ఇదే సర్వే ఎండాకాలం నిర్వహిస్తే ఫలితాలు వేరొక రకంగా ఉండేవని సి.డి.ఆర్.సి. అభిప్రాయపడింది.

ప్రభుత్వ పాలన 'ఫరవాలేదన్న' ప్రజలు

సర్వేలో ప్రభుత్వ పాలన ఎలా ఉందన్న ప్రశ్నకు 7 శాతం వోటర్లు చాలా బాగుందనీ, 23 శాతం బాగుందనీ, 51 శాతం ఫరవాలేదనీ అంటే, 19 శాతం మంది మాత్రం బాగోలేదని అన్నారు.



అధిక శాతం ప్రజలు ప్రస్తుత ప్రభుత్వంపై ఒకింత సంతృప్తితోనే ఉన్నారని, అందుకే ప్రభుత్వ వ్యతిరేక వోటు పెద్దగా ప్రభావం చూపలేదనీ సి.డి.ఆర్.సి. సర్వే చాటింది.

తెలంగాణలో హంగ్‌ను ముందే పసిగట్టిన సర్వే

రెండవ రౌండ్ సర్వేలో అభ్యర్థుల విజయావకాశాలు బేరీజు వేసినప్పుడు తెలంగాణలో ఆసక్తికర పరిణామాలు జరగబోతున్నాయని సి.డి.ఆర్.సి. ముందే పసిగట్టింది. తెలంగాణలో టి.ఆర్.ఎస్. సిద్ధిపేట, సంగారెడ్డి మునిసిపాలిటీలలో మాత్రమే మెజారిటీ సాధించే అవకాశాలు ఉన్నాయనీ, మిగతా మునిసి పాలిటీలలో రెండు మూడు వార్డులతోనే సరిపెట్టుకోవలసి వస్తుందని సర్వేలో వెల్లడైంది. అలాగే వామపక్షాలకు ఖమ్మం మున్సిపాలిటీలో గెలుపు అవకాశాలు ఉన్నాయని సర్వే తేల్చింది.

అన్నిటికన్నా ముఖ్యంగా తెలంగాణలో అనేక చోట్ల బహుముఖపోటీ ఉండటం వల్ల, కాంగ్రెస్, టి.ఆర్.ఎస్., టి.డి.పి., బి.జె.పి. విడివిడిగా పోటీ చేయడం వల్ల అధిక స్థానాలలో 'హంగ్' పరిస్థితి ఏర్పడనుందని సర్వే ముందే వెల్లడించింది. తెలంగాణలోని మొత్తం 31 మున్సిపాలిటీలలో 22 చోట్ల హంగ్ అయ్యే అవకాశం వుందని, ఏ ఒక్క పార్టీకీ సంపూర్ణ మెజారిటీ రాదనీ సర్వే వెల్లడిస్తే ఫలితాలు వెలువడ్డాక దాదాపు 20 స్థానాల్లో 'హంగ్' పరిస్థితి నెలకొనడం సర్వే శాస్త్రీయతను నిరూపించింది.

సంస్మరణ

దిగుమర్తి నరసింహారావు

('వీక్షణం' రచయిత దిగుమర్తి నరసింహారావు సెప్టెంబర్ 14 మరణించారని తెలియజేయడానికి విచారిస్తున్నాము. యురేనియం ప్రాజెక్టు-మంచీ చెడూ, కృష్ణా-నల్లగొండ జల వివాదం- ఒక పరిష్కారం,2004 ఎన్నికలు-ప్రజాస్వామ్యం పరిణతికి నిదర్శనం, వై.ఎస్. చైనా పర్యటన, ఇరాన్-భారత్ గ్యాస్ పైప్‌లైన్, భారత రక్షణ విధానం, కోర్టు తీర్పులు-న్యాయమూర్తుల సైద్ధాంతిక అవగాహన వంటి వైవిధ్యభరితమైన అంశాలపైన ఆయన 'వీక్షణం'కు ఆలోచనాస్ఫోరకమైన వ్యాసాలు రాశారు.)

రచనా నైపుణ్యం, ఒక పరిస్థితిని అర్థం చేసుకునే శక్తి, మంచి జ్ఞాపక శక్తి ఎవరినైనా ఒక మంచి పాత్రికేయుడిగా మార్చవచ్చు. కాని తాను నమ్మిన భావజాలానికి కట్టుబడి ఉండే నిబద్ధత, సాహసం, సత్యం ప్రకటించాలనే తపన, ఎప్పుడూ వృత్తి నిబద్ధతను వదులుకోకపోవడం అనే లక్షణాలు ఒక ఉత్తమ పాత్రికేయుడిని వేరు చేసి చూపుతాయి.

సింహంగా సుప్రసిద్ధుడైన దిగుమర్తి నరసింహారావు అటువంటి ఉత్తమ పాత్రికేయులకోవకు చెందుతారు. పత్రికా రచనను ఏదో ఒక వృత్తిగా కాక ఒక కర్తవ్యంగా ఎంచుకున్న కాలంలో ఆయన ఈ రంగంలో ప్రవేశించారు. ఈ మాధ్యమం వల్ల ఆయనకు చాల సహకరించింది. ఒక విధాన నిర్ణయాన్న, పరిస్థితిని, పరిణామాన్ని విశ్లేషించడం ద్వారా, ప్రత్యామ్నాయ దృక్కోణాన్ని ఇవ్వడంద్వారా పాఠకులకు తెలియజెప్పాలని, చైతన్యవంతులను చేయాలని ఆయన ప్రయత్నించారు. గొంతులేని వారికి గొంతునివ్వడం, ఆ అభిప్రాయాన్ని పాలకుల దగ్గరికి తీసుకుపోవడం తన ధర్మమని ఆయన భావించారు. చివరివరకూ తాను రాస్తూ వచ్చిన శీర్షికలలో ఆయన ఆ పనే చేశారు.

సింహం వామపక్షాల సానుభూతి పరుడనేది జగద్విదితమే అయినప్పటికీ, ఆయన తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించినప్పటికీ, వాటిలో దురుద్దేశ్యాలుండేవి కావు. అందువల్ల ఆయన విమర్శలకు గురయిన రాజకీయ నాయకులు, సంస్థలు కూడ ఆ విమర్శలను సరిగానే స్వీకరించేవి.

రాష్ట్రంలో రాజకీయ పరిణామాలన్నీ ఆయనకు కరతలామలకం, అందువల్ల, ఏ విషయం మీదమైన తన జ్ఞాపకం నుంచే అంకెలు, వివరాలతో సహా క్షణాల్లో ఈ సమగ్రమైన రచన చేయగలిగేవారు. ఆయనను అందువల్లనే చాలామంది 'నడిచే రాజకీయ విజ్ఞాన సర్వస్వం'గా అభివర్ణించేవారు.

బరంపురంలో 1926 ఫిబ్రవరి 1న జన్మించిన నరసింహారావు అర్థ శాస్త్రంలోనూ, ఇంగ్లీషులోనూ పట్టభద్రతలు 1950లలో పత్రికారచనలో విశాలాంధ్ర, నేషనల్ హెరాల్డ్, ఎకనమిక్ టైమ్స్, ఇండియన్ హెరాల్డ్, దక్కన్ క్రానికల్, ఆంధ్రభూమి పత్రికలలో పనిచేశాను. ఆంధ్రభూమి, వార్త, ఆంధ్రప్రభ వంటి ఎన్నో పత్రికలలో వ్యాసాలు రాశారు. శీర్షికలు నిర్వహించారు.

నిజమైన ప్రజాస్వామి వాదిగా, లౌకిక వాదిగా, సామ్యవాదిగా ఆయా స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ విషయాలన్నిటి పట్లా స్పందించారు. విశాలాంధ్రలో సినీంద్రీలు-చిచ్చుబుడ్లు శీర్షికను చివరిదాకా నిర్వహించారు. ఆంధ్రభూమిలో ఆయన రాసిన వారం వారం శీర్షిక అపర చాణక్యం ఎంతోమంది అభిమానాన్ని చూరగొంది.

ఆయన స్మృతి ఎన్నటికీ చెరిగిపోనిది.

- మెల్లీ మైత్రేయి

వ్యవసాయ రంగాన్ని దిగజార్చిన ప్రపంచీకరణ

- డా. అందె సత్యం

నేటికీ దేశంలోని శ్రామిక శక్తిలో 56.7% కి వ్యవసాయ రంగంలో ఉపాధి లభిస్తుంది. జాతీయాదాయంలో వ్యవసాయరంగం వాటా 24.2 శాతంగా ఉంది. ఎగుమతులలో వ్యవసాయం వాటా 14.2% వున్నది. సగం పారిశ్రామిక రంగానికి ముడిసరుకులను అందిస్తుంది. ముఖ్యంగా 108 కోట్ల మందికి తిండి పెట్టడమే కాకుండా గ్రామీణ భారతంలో ప్రజలకు కావలసిన వినియోగ వస్తువులను, తక్కువ ధరలకే అందిస్తుంది. 1960 నుండి 1990 వరకు ప్రభుత్వ ప్రోత్సాహం, విధానాలు అనుకూలంగా వుండడంతో ఉత్పత్తి 4 రెట్లు పెరిగింది. ఆహార ధాన్యాల కొరకు ఇతర దేశాల మీద ఆధారపడవలసిన అవసరం తీరింది. అసమానతలు వున్నప్పటికీ ఆహారభద్రత ఏర్పడింది.

ప్రపంచీకరణలో భాగంగా 1991 నుండి సరళీకృత ఆర్థిక విధానాలు అనుసరించిన తరువాత, సైద్ధాంతికంగా వ్యవసాయరంగంపై వ్యతిరేక అభిప్రాయాలు కల్గిన ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంక్, డబ్ల్యు.టి.ఓ. నిబంధనలు అనుసరించిన తరువాత, వ్యవసాయరంగం తన పాత్రను ఏవిధంగా కోల్పోతుందో రుజువులున్నాయి.

పట్టిక -1

జి.డి.పి. - వ్యవసాయం పెరుగుదల రేటు

సంవత్సరం	జి.డి.పి.	వ్యవసాయ పెరుగుదల రేటు
1992-93	5.1	5.8
1993-94	5.9	4.1
1994-95	7.3	5.0
1995-96	7.8	-0.9
1996-97	7.8	9.6
1997-98	4.8	-2.4
1998-99	6.5	6.2
1999-00	6.1	0.3
2000-01	4.4	-0.4
2001-02	5.6	5.7
2002-03	4.1	-3.1

పట్టిక-1 ఆధారంగా చూస్తే సంస్కరణలు తరువాత కాలం వ్యవసాయ పెరుగుదలలో తీవ్రమైన అస్థిరతలు కొనసాగుతున్నాయి. 1992-93లో 5.8% పెరుగుదల నుండి 1995-96లో 0.9%కి పడిపోయింది. 1996-97లో వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు 9.6% పెరిగి 1997-98లో 2.4% పడిపోయింది. తిరిగి 1999-99లో 6.2% పెరిగి 1999-2000లో 0.3%కి 2000-01లో -0.4కు పడిపోయింది. 2002-2003లో కూడా -3.1 కి దిగజారింది. సంస్కరణల తరువాత ఇంతటి అస్థిరతలు కొనసాగడానికి, ఇంకా వాతావరణం మీద ఆధారపడే తత్వం వుండడానికి కారణం వ్యవసాయ రంగం పటిష్టతకు తోడ్పడకుండా వదిలివేయడమే కారణం.

ఆహారధాన్యాల విషయంలో సంస్కరణలకు ముందు దశాబ్దకాలంలో సాగు ఏరియా పెరుగుదల -0.23 వుండగా తరువాత దశాబ్దంలోను -0.20గా వున్నది. ప్రభుత్వాలు ఎంత ఊదరగొట్టినా అదనంగా సాగులోకి తెచ్చిన ఏరియా తగ్గుతూ వస్తుంది. ఆహారధాన్యాలు సాగు చేసే ఏరియా తగ్గి ఇతర పంటల ఉత్పత్తి మళ్ళించడంలోను కూడా పెరుగుల లేదు. సాగు చేయడం వదులుకోవడమే ప్రధాన కారణం. ఉత్పత్తిలో పెరుగుదల 1980-90 మధ్య 2.85% వుండగా 1991 తరువాత దశాబ్దంలో 1.66% మాత్రమే

విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలలో మార్పులు

	(1980-1990) సంస్కరణలకు ముందు			1991 - 2001 సంస్కరణల తరువాత		
	విస్తీర్ణం	ఉత్పత్తి	ఉత్పాదకత	విస్తీర్ణం	ఉత్పత్తి	ఉత్పాదకత
వరి, గోధుమ	0.43	3.59	3.15	0.84	2.27	1.42
వరి	0.41	3.62	3.19	0.63	1.79	1.16
గోధుమ	0.47	3.57	3.10	1.21	3.04	1.81
పప్పు ధాన్యాలు	-1.34	0.40	1.62	-1.81	0.06	1.62
కాయధాన్యాలు	-0.09	1.52	1.61	-1.02	-0.58	0.27
మొత్తం ఆహారధాన్యాలు	-0.23	2.85	2.74	-0.20	1.66	1.34

పెరిగింది. వ్యవసాయంలో పెరుగుదల రేటు పడిపోవడం గ్రామీణ రంగంలో అనేక అనర్థాలకు కారణం అవు తుంది. ఈ తగ్గుదల ప్రభావం అన్ని రంగాల మీద వెచ్చింపు ప్రభావం వుంటుంది.

ఆహారేతర ఉత్పత్తులు

	సంస్కరణలకు ముందు (1980-1990)			సంస్కరణల తరువాత 1991-2001		
ఆహారేతర ఉత్పత్తులు	విస్తీర్ణం	ఉత్పత్తి	ఉత్పాదకత	విస్తీర్ణం	ఉత్పత్తి	ఉత్పాదకత
ఆహారేతర పంటలు	1.12	3.77	2.31	0.84	1.86	0.59
నూనెగింజలు	-1.51	5.20	2.43	0.44	0.66	0.61
చెరకు	1.44	2.70	1.24	1.72	2.62	0.89
ప్రత్తి	-1.25	2.80	4.10	2.21	1.73	-1.26
మొత్తం	0.10	3.19	2.56	0.08	1.73	1.02

ఆహారేతర పంటల విషయంలో కూడా సంస్కరణల తరువాత పరిస్థితి దిగజారింది. 1991 ముందు సాగు ఏరియా 0.10 చొప్పున పెరగగా ఆ తరువాత 0.08కు తగ్గింది. సంస్కరణలకు ముందు ఉత్పత్తి 3.19 చొప్పున పెరగగా, ఆ తరువాత దశాబ్దంలో 1.73% తగ్గింది. ఉత్పాదకత కూడా 2.56 నుండి 1.02కు తగ్గింది. అన్ని ఉత్పత్తుల విషయంలోను పరిస్థితి దిగజారింది. ఉత్పత్తి, ఉత్పాదకతలను అనేక విషయాలు ప్రభావితం చేస్తాయి. నూతన ఆర్థిక విధానాలు అనుసరించిన తరువాత మద్దతు ధర, ఎఫ్.సి.ఐ. ఇతర సేకరణ ఏజెన్సీలు నిర్వీర్యమయ్యాయి. సబ్సిడీలు తగ్గించారు. వ్యవసాయానికి అనుకూలంగా ప్రభుత్వాలు వ్యవహరించకుండా పెట్టుబడిదారి దేశాల, మరియు అంతర్జాతీయ సంస్థల ఒత్తిళ్ళు పెరిగాయి. డబ్ల్యు.టి.ఓ.కు కట్టుబడడంతో, బాసటగా నిలవాల్సిన ప్రభుత్వాలు వెనకడుగు వేశాయి. అందువలనే సాగు ఏరియా పెరుగుదల కూడా తగ్గిపోయింది.

వ్యవసాయంలో పెట్టుబడి కల్పన

వ్యవసాయరంగంలో పెట్టుబడి కల్పన అభివృద్ధికి మూల కారణం. పెట్టుబడి కల్పన దిగజారడం అంటే వెన్నెముక విరగకొట్టుకోవడం లాంటిదే.

సంస్కరణల తర్వాత పెట్టుబడుల కల్పన (1993-94 ధరలలో)

	మొత్తం ఆర్థిక వ్యవస్థ	వ్యవసాయ రంగం	వ్యవసాయంలో ప్రభుత్వం పెట్టుబడి	ప్రభుత్వ శాతం	జిడిపిలో వ్యవసాయ పెట్టుబడి శాతం
1993-94	181133	13523	4457	33.0	1.6
1994-95	229879	14969	4947	33.0	1.6
1995-96	274557	15690	4849	30.9	1.6
1996-97	248631	16176	4668	28.9	1.5
1997-98	256551	15942	3979	25.0	1.4
1998-99	243697	14895	8679	26.0	1.3
1999-2000	268374	17304	4222	24.4	1.3
2000-01	-	16687	3919	23.5	1.3
2001-02	-	18057	4794	26.5	1.3

అధిక దిగుబడులు సాగు సంవత్సరిక పెరుగుదల 10.5% నుండి 4.4% దిగజారింది. సంస్కర ణల తరువాత వరిలో 2.3% గోధుమలో 1.1% పెరుగుదల తగ్గింది. నీటి పారుదలలో సాగు అయ్యే భూమి సంవత్సరిక పెరుగుదల 3.6% నుండి 2.1% తగ్గింది. మేజర్, మైనర్ ఇరిగేషన్ విస్తరణ పెరుగుదల తగ్గింది. చివరకు ఎరువుల మీద సబ్సిడీ తగ్గించడంతో ఎరువుల వాడకం పెరుగుదల కూడా 9.6% నుండి 3.7% తగ్గింది.

మొత్తంగా వ్యవసాయ రంగాన్ని పరిశీలిస్తే సంస్కరణల తరువాత దేశంలో దాని పాత్రను కుంచింప చేస్తున్నారు. తక్కువ పెట్టుబడి మాత్రమే కాకుండా వున్న నీటి పారుదలకు ప్రభుత్వ పర్యవేక్షణ లేక అస్తవ్యస్తమైంది. గ్రామీణ రంగంలో రోడ్లు, కాలువలు, మెయింటెనెన్స్ లేదు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఛార్జీలు పెరిగి రైతులకు భారం పెరిగింది. ధరల పెరుగుల వలన ఎరువుల వాడకం తగ్గడవే ఎన్.పి.కె. నిష్పత్తిని 4:2:1లో వాడకం సమతౌల్యం దెబ్బతిన్నది. డబ్ల్యు.టి.ఓ. ఒత్తిడితో పరపతి, ధరలు, మార్కెటింగ్ ఎగుమతులలో వచ్చే అనుకూలత దెబ్బతిన్నది. భూసంస్కరణల విఫలం, పేదరికం నిర్మూలనా కార్యక్రమాల వైఫల్యం, వ్యవసాయ వేతనాల పెరుగుదల లేక పోవడం వలన గ్రామీణ రంగంలో కొనుగోలు శక్తి తగ్గి వ్యవసాయం మీద డిమాండ్ వైపు వ్యతిరేకత ప్రభావం కల్గింది. వ్యవసాయ విస్తరణ సేవల నుండి ప్రభుత్వం పూర్తిగా తప్పుకునే స్థితి వచ్చింది.

(మిగతా 9వ పేజీలో)

ఆదివాసులు - అటవీచట్టాలు- నిర్వాసితులు

- ఆత్రం రామారావు

"భూమి దేశ ప్రజల సంపద, భూమి ఆదివాసులకు, రైతులకు, జీవన వారసత్వం" అని రాబర్ట్ ముగాబే అంటారు. భూమి ఆదివాసులకు జీవనాధారం. అడవులు క్రమంగా మైదానప్రాంతాలుగా మారినాయి. భూమి ఆస్తిగా మారకముందు అన్ని మైదాన ప్రాంత ప్రజలకు జీవనాధారంగానే ఉండేది. కానీ భూమి సాగు చేసుకునే క్రమంలో జీవనాధారం నుండి బలమైన పెత్తనశక్తిగా మారటానికి కొన్ని సముదాయశక్తులు వేళ్ళూనుకోవడానికి అటవీ, షెడ్యూల్డ్ ప్రాంతంలో నిర్దిష్టమైన సంబంధాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వాలకు అవసరమైంది. పెద్ద ఎత్తున ఈ ప్రాంతాల్లోకి వలసలు ప్రోత్సహించబడినవి. వనరుల వినియోగం పేరిట, అటవీ ఉత్పత్తుల సేకరణ పేరిట ప్రభుత్వ యంత్రాంగం కుప్పలు తెప్పలుగా విస్తరించింది. అటవీశాఖ, ఎక్సయిజ్ శాఖ, రెవెన్యూ శాఖ, పోలీసు శాఖలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా అధికమైనాయి. బొగ్గుగనులు, పేపర్, సిమెంట్, ఇనుప పరిశ్రమల మూలంగా, వాణిజ్యం, వ్యాపారం వల్ల మైదాన ప్రాంత ప్రజలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లోకి రావడం జరిగింది. దీనిమూలంగా ఆదివాసి భూములపైన మరింత ఒత్తిడి పెరిగింది. మరొకవైపు ప్రపంచీకరణలో భాగంగా బహుళజాతి గుత్త పెట్టుబడిదారీ సంస్థలు ఆదివాసి ప్రాంతాల మీద కన్ను వేశాయి. ప్రపంచీకరణలో భాగంగా దేశంలోకి తీవ్రవేగంతో వస్తున్న నూతన ఆర్థిక సరళీకరణ విధానాలలో భాగంగా అడవులతో సహా సహజ వనరులన్నింటినీ ప్రైవేటీకరించేందుకు పాలకవర్గాలు పూనుకున్నాయి. ఇందుకు ఒక పథకం ప్రకారం పని చేస్తూ అడవులను ప్రైవేటీకరించే దానిలో భాగంగానే ప్రపంచ బ్యాంకు మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో 'సాముదాయక అటవీ యాజమాన్యం పథకం' చేపట్టారు. ప్రపంచబ్యాంకు సహాయంతో వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేసి, అడవులతో సహా సహజ వనరులన్నింటిని ప్రైవేటీకరించేందుకు యు.పి.ఎ. ప్రభుత్వం పూనుకుంటున్నది. అడవులను ప్రైవేటీకరించే దిశలో ఇదొక పెద్ద ముందడుగు.

కేంద్ర ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ట్రైబ్స్ అటవీహక్కులు గుర్తింపు బిల్లు - 2005 ముసాయిదాను తీసుకురావడం జరిగింది. ప్రధానంగా ఈ బిల్లులో ఆదివాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని గురించి, అడవులను జాతీయ ఆస్తిగా మార్చే క్రమంలో ఆదివాసుల హక్కులు గుర్తింపు కోల్పోవుట గురించి ప్రస్తావించారు. అధికార మార్పిడి (1947) తరువాత మొట్టమొదటిసారిగా ప్రభుత్వం ఈ చారిత్రక అన్యాయాన్ని ఒప్పుకోవడం, పరిష్కారం కొరకు హక్కుల గుర్తింపు చట్టం యొక్క అవసరాన్ని గుర్తించడం ఆదివాసి ఉద్యమాల మూలంగానే జరిగింది. ఈ చట్టం తీసుకురావడంలో మరొక కుట్ర కూడా దాగి వుంది. ప్రపంచీకరణలో భాగంగా బహుళజాతి గుత్త సంస్థలు ఆదివాసి ప్రాంతాల మీద కన్ను వేశారు. ఏ రాష్ట్రం, కేంద్ర పాలిత రాష్ట్రం అయినా దానికి సంబంధించి ఈ చట్టం క్రింద అడవులలో నివసించే షెడ్యూల్డ్ తెగలకు సమకూర్చబడ్డ అటవీ హక్కులు ఒక షరతుపై ఆధారపడి వున్నాయి. అదేమంటే 25 అక్టోబర్ 1980 సంవత్సరం ముందుగాని లేక కేంద్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో ప్రకటించే తేదీకి ముందుగా ఆదివాసి తెగలు అటవీభూమిని స్వాధీనంలో వుంచుకొని వుండాలి. ఇక్కడే

(8వ పేజీ తరువాయి)

వివిధ పథకాలలో సాంవత్సరిక వృద్ధిరేటు

	1971-81	1981-91	1991-2001
మొత్తం అధిక దిగుబడి నిచ్చే వంగడాలతో	10.5	4.2	4.4
వరి	12.5	4.1	2.3
గోధుమ	9.5	2.7	1.1
నీటిపారుదల సాగుభూమి	3.6	2.7	2.1
మేజర్ యిరిగేషన్	4.2	3.5	1.2
మైనర్ యిరిగేషన్	4.2	3.5	2.3
ఎరువుల వాడకం	9.6	8.5	3.7

విధానాల పరంగా చూస్తే ప్రపంచబ్యాంకు, డబ్ల్యు. టి.ఓ.కు, వ్యవసాయ రంగం. అనంఘటిత రంగం కావడం వలన, పెట్టుబడులకు తగిన లాభాలు రావు కాబట్టి ఈ సంస్థలకు వ్యవసాయం మీద నమ్మకం లేదు. వీటిని నమ్ముకున్న భారత ప్రభుత్వాలు, ఎగుమతి వ్యవసాయం, కార్పొరేట్ వ్యవసాయానికి అనుగుణంగా నూతన వ్యవసాయ విధానం అనుసరించి గత 15 సంవత్సరాలలో వ్యవసాయాన్ని దిగజార్చారు. వివిధ రాష్ట్రాలలో, కేంద్రంలో ప్రజలు ఎన్నికలలో షాక్‌ట్రీట్‌మెంట్ ఇచ్చిన తరువాత, కొంతమేరకు ఈమధ్య కాలంలో వ్యవసాయరంగం గురించి మాట్లాడుతున్నారు. ఆచరణలో ఏం జరుగుతుందో వేచి చూద్దాం. ❑



వాస్తవమైన వైరుధ్యం ముందుకు వస్తుంది. 25.10.1980 అనే కటాఫ్ తేదీని మర్చిపోవడం లేదు. అంటే ఇంతకు ముందు ఉన్నవారినే గుర్తించి హక్కులు కల్పిస్తామని బిల్లులో పెడుతున్నారు. 1980 తరువాత నుండి సాగు చేస్తున్న అటవీభూముల నుండి ఆదివాసులు బలవంతంగా తరిమివేయబడ్డారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భారతదేశంలో ఈరోజున వన్యప్రాణుల సంరక్షణ గురించి జరుగుతున్నంత చర్చ 'ఆదివాసి ప్రజల అటవీ హక్కుల' గురించి జరగకపోవడం విచారకరం. కొత్తగా అటవీ భూముల ఇవ్వమని ఆదివాసులు అడగడం లేదు. తరతరాలుగా జీవిస్తున్న భూమిపై హక్కులు కావాలని మాత్రమే అడుగుతున్నారు. ఇప్పటికే ఈ చట్టం అవసరం లేదనే వాదన వన్యప్రాణి పర్యావరణ సంరక్షకులు పెద్ద ఎత్తున మీడియా ద్వారా ప్రచారం గావిస్తున్నారు. అందుకనే ఆదివాసులు తమ హక్కుల రక్షణ కొరకు మరింత పట్టుదలతో ఉద్యమించవలసిన అవసరం ఉన్నది. షెడ్యూల్డ్ ట్రైబ్స్ అటవీహక్కుల బిల్లు - 2005లో ఉన్న లొసుగులను ఎండగడుతూ ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలి. "అటవీహక్కుల గుర్తింపు బిల్లు - 2005 ను పార్లమెంటులో ఆమోదించిన తేదీనే కటాఫ్‌తేదీగా" గుర్తించాలని డిమాండ్ చేయాలి.

భారతదేశంలో అటవీశాఖ పరిపాలన వ్యవస్థ ద్వారా ఆదివాసి ప్రజలకు చారిత్రక అన్యాయం జరిగింది. ఆదివాసి ప్రజల హక్కులు గుర్తించే రికార్డులు లేకపోవడంతో బ్రిటిష్ కాలంలో వారి హక్కులు సెటిల్ కాలేదు. ఆదివాసులు తమ హక్కులు, ప్రయోజనాలపై దాడి ప్రారంభమైనప్పటి నుండి తమ హక్కులు రక్షించుకోవడానికి వివిధ రూపాలలో ఉద్యమాలు చేపట్టారు. ప్రతిఘటించారు. 1830 లో నాకో తిరుగుబాటు జరిగింది. 1875లో బిర్సాముండా నాయకత్వంలో తిరుగుబాటు చేశారు. 1802-03లో, 1832 ప్రాంతంలో విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో తిరుగుబాట్లు జరిగాయి. 1922-24 మధ్య అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో మన్యంలో తిరుగుబాటు జరిగింది. ఈ శతాబ్ది తొలిదశలో రాంజీగోండు నాయకత్వంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. 1940 ప్రాంతంలో కొమురం భీం నాయకత్వంలో జోడెన్‌ఘాట్ ప్రాంతంలో నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించారు. వీటిమూలంగా ఆదివాసులకు కొన్ని హక్కులు కల్పించారు. కానీ అధికార మార్పిడి తరువాత కూడా బ్రిటిష్ పాలన యంత్రాంగంలో భాగమైన కోర్టు, రెవెన్యూ, పోలీస్ చట్టాలను ఆదివాసేతరులు తమకు అనుకూలంగా వాడుకొని ఆదివాసిల అమాయకత్వం, నిరక్షరాస్యతను ఆసరా చేసుకొని సులభంగా దోపిడీ చేయడం ప్రారంభించారు.

1864 లో బ్రిటిష్, భారత అటవీ నిర్వహణ కోసం మొట్టమొదటి అటవీచట్టం అడవులను ప్రభుత్వ ఆస్తిగా ఈ చట్టం ద్వారా ప్రకటించారు. దీని ద్వారా సహజ అటవీ వనరుల స్థానంలో వ్యాపార విలువలు కలిగిన చెట్లను పెంచడం ప్రధాన ఉద్దేశ్యంగా వుండేది. చెట్లతో కూడిన అన్ని రకాల భూములను ప్రభుత్వ అడవులుగా గుర్తించారు. 1878లో మొదటి అటవీ చట్టాన్ని సవరించారు. వ్యాపార విలువలు కలిగిన అడవిని కొట్టి వేయడంలో ప్రజల హక్కులు ప్రభుత్వ యంత్రాంగానికి అడ్డం వస్తున్నాయనే ఉద్దేశ్యంతో చట్టాల్ని మార్చడం జరిగింది. అడవిలో నివసించే ప్రజల సాంప్రదాయ హక్కులను గుర్తించారు. ఈ రెండు కలిపి 1894లో జాతీయ అటవీ విధానానికి పునాదులు వేసింది. ఆర్థిక లాభమే ప్రధాన ధ్యేయంగా, సంరక్షణ పేరుతో ప్రజల సాంప్రదాయ హక్కులను కాలరాసేలా రూపొందించబడింది. వీటన్నింటికీ పూర్తి రూపాన్ని ఏర్పరుస్తూ 1927లో భారత అటవీచట్టాన్ని ప్రభుత్వం రూపొందించింది. కొన్ని చేర్పులు, మార్పులకు లోబడి ఈ చట్టం దాదాపు అన్ని రాష్ట్రాల్లో అమలులో వుంది. 1927 భారత అటవీ చట్టం స్వభావంలో ఒక ముఖ్యమైన మలుపు వుంది. రెవెన్యూ (రాబడి)గా మారింది. అటవీ ఉత్పత్తులపై, కలపపై సుంకాన్ని విధించడం వంటి అంశాలను ఈ చట్టం నొక్కి చెప్పింది. మొత్తం అటవీప్రాంతాన్ని రిజర్వుడు అడవులు, రక్షిత అడవులు, గ్రామ అడవులుగా ఈ చట్టం వర్గీకరించింది. 1935 బ్రిటిష్ భారత ప్రభుత్వ చట్టం ప్రాంతీయ ప్రభుత్వాల ఏర్పాటును పొందు పర్చడంతో అడవుల యాజమాన్యం ఆయా ప్రభుత్వాల పరిధిలో ఏర్పాటు చేయబడింది. అధికార మార్పిడి అనంతరం రాజ్యాంగంలో ఏర్పరచిన రాష్ట్రాధికార జాబితాలో 7వ షెడ్యూల్ల్ 19వ అంశంగా అడవుల యాజమాన్య బాధ్యత ప్రభుత్వానికి అప్పగించబడింది. 1952 వ సంవత్సరంలో ఆమోదించబడిన జాతీయ అటవీ విధానంలో ఈ క్రింది కీలక అంశాలు ఉన్నాయి.

1. దేశంలో ఉన్న అటవీ భూభాగానికి, సేద్యపు అవసరాలకు మధ్య సమతుల్యత సాధించడం.
2. క్షీణిస్తున్న అడవుల స్థానంలో మరిన్ని అత్యధిక స్థాయిలో మొక్కలను పెంచడం.
3. గృహ, వ్యవసాయ, కలప అవసరాలను గుర్తించడం, వాటికి పరిధులను నిర్ణయించడం.
4. జాతీయ అవసరాల మేరకు క్షీణిస్తున్న అడవుల శాతాన్ని అదుపు చేయడం. ఇదే కాలంలో జరిగిన మరొక ముఖ్య పరిణామం ఏమిటంటే అటవీప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసులకు గతంలో "వుండే హక్కులన్నీ" క్రమేపీ ప్రభుత్వం ఇచ్చే రాయితీలుగా లేదా 'మినహాయింపులు'గా మారినాయి.

అయితే 1952 అటవీ విధానం ఆచరణలో అడవుల సంరక్షణలో విఫలమవ్వడమే గాక, ఆదివాసులకు మైదాన ప్రజలకు మధ్య సమస్యలను పెంచింది. అటవీ యాజమాన్య విధానాలకు -ప్రజా అవసరాలకు మధ్య వైరుధ్యాలు పెరిగినాయి. తీవ్రమ వుతున్న ఈ స్థితిని సమగ్రంగా పరిశీలించడానికి 1961లో భారత దేశంలో అటవీ ప్రాంతాల పాలనపైన, ఆదివాసుల స్థితిగతులపైన దేబర్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ చేసిన కొన్ని ప్రధానమైన సూచనలు :

1. అటవీ వనరులపై ఆదివాసీ తెగల నిర్వహణ, నియంత్రణను సమష్టిగా నెలకొల్పడం.
2. ఆదివాసీ గ్రామాలన్నింటికీ త్రాగునీటి బావులు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు కల్పించబడం.
3. గ్రామ అడవుల నుంచి వచ్చే రెవెన్యూలను గ్రామ పంచాయతీ స్వాధీనంలోనే వుంచడం.
4. అడవులలో లభ్యమయ్యే చిన్న, చిన్న అటవీ ఉత్పత్తుల సేకరణ, వాటిని వినియోగపరచుకునే యంత్రాంగం స్థానిక స్థాయిల్లో ఏర్పరచడం.
5. మూల అటవీ ఉత్పత్తుల వినియోగంలో ఆదివాసులకు సహకార సంఘాలలో పాత్రను కల్పించాలని ఈ కమిటీ అభిప్రాయపడింది.

వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లో వచ్చింది. ఈ శాసనం అటవీసంరక్షణ చట్టానికి భిన్నంగా వుంది. వన్యప్రాణులు తిరిగే ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసి ప్రజలను బలవంతంగా తరిమివేసే అధికారాలు ఇచ్చారు. వారికి ఏవిధమైన రీసెటిల్‌మెంట్ చేయకుండా సంరక్షణ పేరుతో ప్రజలను తరిమివేసేందుకు చట్టం రూపొందించారు. దీనిద్వారా రెండు విధాలైన రక్షిత అడవులను సృష్టించారు. 1. జాతీయ పార్కులు 2. అభయారణ్యాలు. ఈ ప్రాంతంలో మానవ సంచారంగాని, పనులు గాని జరుగకుండా కాపాడడం దాని ముఖ్య ఉద్దేశ్యం. అయితే టూరిజంను మాత్రం అనుమతించారు. అడవులే ఆధారంగా చేసుకొని బ్రతుకుతున్న ప్రజలకు ఇది శాపంలా తయారైంది. ప్రజలు క్రమంగా ఈ ప్రాంతం నుండి దూరం చేయబడ్డారు. దీనిద్వారా రక్షిత ప్రాంత అధికార యంత్రాంగానికి, స్థానిక ప్రజలకు మధ్య అనేక సంఘర్షణలు జరుగుతూ వస్తున్నాయి. దీనిద్వారా అర్థమవుతున్నదేమిటంటే వేల కుటుంబాలు అటవీ వనరుల నుండి దూరం కావడం. ఇంకో పక్క పారిశ్రామిక అవసరాలకు, వ్యాపార అవసరాలకు అడవులను నరకకుండా ఆపలేకపోయారు.

1947లో అధికార మార్పిడి జరిగిన తరువాత రిజర్వు ఫారెస్ట్‌గా వర్గీకరించేటప్పుడు ఆదివాసుల భూముల్ని ఉమ్మడి భూముల్ని, హక్కుల్ని నిర్ధారించకుండానే, సెటిల్ చేయకుండానే అడవులుగా

ప్రకటించారు. ఆదివాసి ప్రజల సెటిల్‌మెంట్ హక్కుల గురించి పట్టించుకోలేదు. 1952 నాటి జాతీయ అటవీ విధానం భారత ప్రభుత్వం 1980లో సవరించింది. దీనిని తిరిగి 1988 డిసెంబర్‌లో కొన్ని సవరణలు ప్రతిపాదించి 1990లో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ కొన్ని సర్క్యులర్స్ తీసుకువచ్చింది.

సర్క్యులర్ నెం. 13-1/90 (ఎఫ్.పి.) - 1,2,3,5లో ఈ వివాదాలని, సమస్యలని చర్చించి, వాటి పరిష్కారాలను ఏవిధంగా జరగాలో సూచించింది.

1. అటవీ భూముల ఆక్రమణలని సమీక్షించాలి
2. అటవీ సెటిల్‌మెంట్ వల్ల తలెత్తిన వివాదాలని సమీక్షించాలి.
3. అటవీ భూములలో పట్టాలు / కౌలు / ఈనాములకు సంబంధించిన వివరాలు.
4. అటవీ గ్రామాలు రెవెన్యూ గ్రామాలుగా మార్చటం. ఇతర పాత నివాసప్రాంతాలను సెటిల్‌చేయడం.

1990లో కేంద్రప్రభుత్వం జారీ చేసిన గైడ్‌లైన్స్ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. ప్రభుత్వ అధికార్ల వైఫల్యంతో ఈనాడు ఆదివాసులను వారి నివాసాల నుంచి తొలగించే ప్రమాదం ఏర్పడింది. దీనిమూలంగా ఆదివాసి ప్రజలు నిరంతరం నిర్వాసితులు అవుతూనే వున్నారు.

నిర్వాసితులు:

ఒరిస్సా రాష్ట్రంలోని వెనకబడిన జిల్లా అయిన జాజ్‌పూర్ ప్రాంతంలో గాడ్‌పూర్ ఆదివాసి గ్రామంలో మహారాష్ట్ర స్టేన్‌లెస్ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికై 9 మే 2005న యజమానులు భూమి పూజను తలపెట్టారు. గాడ్‌పూర్‌తో పాటు, కాలమిట్టియా, ఖురుంటి మొదలగు మూడు గ్రామాలకు సంబంధించి సుమారు వేయిఎకరాల వైశాల్యం గల ఆదివాసీల పట్టా, సారవంతమైన పంట భూములను ఈ ఫ్యాక్టరీ యజమానులు నవీన్ సర్కార్ ఆశీస్సులతో బలవంతంగా ఆక్రమించారు. చివరికి ఫ్యాక్టరీ స్థాపన వలన నిర్వాసిత, బాధిత ఆదివాసీ కుటుంబాలకు మార్కెట్ రేటును ప్రక్కన పెట్టి కనీస నష్టపరిహారాన్ని కూడా చెల్లించకుండానే అక్రమంగా భూమి పూజకు పూనుకున్న వైనాన్ని అడ్డగిస్తున్న ఆదివాసీలు నిస్తాపన విరుధీ జనమంచ్ పేరిట సంఘటిత పడ్డారు. "మా భూములు మాకే, మా ఊర్లు మాకే, మా శవాలపైనే మీ పనిని కానివ్వండి" అంటూ నిర్వాసితులు 1500 మంది తిరగబడి భూమి పూజను అడ్డుకున్నారు. కాని ప్రజా వ్యతిరేక, ఆదివాసి వ్యతిరేకమైన దేశీయ, అంతర్జాతీయ ద్రవ్య తిమింగలాల సేవకులు అయిన నవీన్‌సర్కార్ ఆదివాసి ప్రదర్శనలపై లాఠీ, టియర్ గ్యాస్ ప్రతాపం చూపించారు. లాఠీలతో రక్తసిక్తమై ప్రజలు సహజంగానే చేతికందిన రాళ్ళు, రప్పలతో ప్రతిఘటనకు దిగారు. దీనితో పోలీసులు ప్రజల మీద కాల్పులు చేశారు. ఇందులో 50 మంది ఆదివాసీ స్త్రీ, పురుషులు గాయపడ్డారు.

ఆంధ్రప్రదేశ్‌లోని సింగరేణి ప్రాంతంలోని ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో ఓపెన్‌కాస్టులు చేస్తున్నారు. దీనిక్రింద వేలాది ఎకరాల భూములను కోల్పోతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని శ్రీరాంపూర్, కాసిపేట, కైరీగూడ, డోర్లి ప్రాంతాలలో, కరీంనగర్ జిల్లాలోని మంథని అడవి ప్రాంతంలో, వరంగల్ జిల్లా భూపాలపల్లి ప్రాంతంలో బలవంతంగా ఓపెన్‌కాస్టులు వేయడానికి సింగరేణి యాజమాన్యం పూనుకుంటుంది. ఆదిలాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలం ఉల్లిపిట్ల, డోర్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన కోలాం ఆదివాసులు ఓపెన్‌కాస్టు గని ఏర్పాటు చేసేందుకు సింగరేణి యాజమాన్యం తమతో ఇప్పటి వరకు ఎలాంటి ఒప్పందం చేసుకోనప్పటికీ, తమకు ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇండ్ల నిర్మాణాన్ని నిలిపివేసి వేధించడాన్ని నిరసిస్తూ సింగరేణి కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేస్తూ, తమకి జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ సింగరేణి ప్రాజెక్టు అధికారికి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. తిర్యాణి మండలంలోని డోర్లి గ్రామంలో ఓపెన్‌కాస్టు బొగ్గు గనుల మూలంగా 10వేల ఎకరాల భూములను సింగరేణి యాజమాన్యం స్వాధీనం చేసుకుంది. అయితే తమకు ముందస్తు పునరావాసం, నష్టపరిహారం చెల్లించనిదే తాము సింగరేణి యాజమాన్యానికి తమ భూములను అప్పజెప్పేది లేదని అక్కడి ఆదివాసులు తెలియచేశారు. ఈ నేపథ్యంలో ఆదివాసులను బలవంతంగానైనా అక్కడినుండి తొలగించేందుకు ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కుట్రలు పన్నుతున్నారని ఆ గ్రామ సర్పంచ్ ఆత్రం లక్ష్మణ్ ప్రకటించారు.

ఆదివాసులను వారి నివాస ప్రాంతాల నుంచి, జీవనోపాధుల నుండి వెళ్ళగొట్టడానికి ప్రభుత్వం వారిని 3 విధాలుగా విభజిస్తున్నారు. అవి 1. అర్హత కలవారుగా అంటే సెటిల్‌మెంట్ జరిగినవారు 2. అర్హత లేనివారుగా అనగా సెటిల్‌మెంట్ చేయటానికి తగని వారు. 3. లెక్కల్లో కనిపించనివారుగా అంటే ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా కనిపించని వారు. అడవుల్లో వుండే వారు చాలామంది లెక్కల్లో లేకపోవడం వారికి పట్టాలు లేకపోవటం. భూమి నివాసాలకు సంబంధించిన ప్రభుత్వ రికార్డులు అన్నీ దౌర్భాగ్యస్థితిలో ఉండటం. ఈ చట్టాల వల్ల ఆదివాసుల ఉనికి చట్టబద్ధం కాకపోవడం. అన్నీ కలిసి ఇవ్వాల్టి అన్యాయ పరిస్థితిని సృష్టించాయి.

'నిర్వాసితం' అనేది ఆదివాసుల జీవితంలో ఒక భాగమై పోయింది. అధికార మార్పిడికి ముందు ఎంతమంది ఆదివాసులు

నిర్వాసితులయ్యారు ? అనే లెక్కలు స్పష్టంగా లేకున్నా, అధికార మార్పిడి తరువాత ఆదివాసులు అనేక ప్రాజెక్టులు, గనులు, అభివృద్ధి పథకాల ద్వారా పెద్ద ఎత్తున నిర్వాసితులయ్యారు. భారతదేశంలో పెద్ద ప్రాజెక్టుల మూలంగా అభయారణ్యాలు, జాతీయ పార్కుల మూలంగా 8 లక్షల 50 వేల మంది ఆదివాసులు 1990 వరకు నిర్వాసితులయ్యారు. దేశంలో నూతన ఆర్థిక విధానాల మూలంగా ఆదివాసులు, లక్షలాది ప్రజలు నిర్వాసితులు కావటం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్, మహారాష్ట్ర, కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ పరిణామాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతాలపై బహుళజాతి గుత్త సంస్థలు, ప్రపంచబ్యాంకు కన్ను వేశాయి. అందుకని ఆదివాసి ప్రాంతాల ప్రజలు పొట్ట చేత పట్టుకొని లోతట్టు ప్రాంతాలకు వెళ్ళుతున్నారు.

అటవీ వనరులపై ప్రభుత్వ గుత్తాధిపత్యం ఖరారు అయిపోయింది. 59 సంవత్సరాల భారతదేశంలో ఆదివాసి ప్రజలు నిర్వాసితులు కావటం, నిర్ణయాధికారం లేకపోవటం, తొలగింపుకు గురి కావటం జరుగుతూ వస్తున్నది. 1/70 చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. ఈ చట్టాన్ని అమలు చేయకపోవడం చేత ఆదివాసుల భూములు వేల ఎకరాలు పరాయీకరణ చెందుతున్నాయి. ఆదివాసుల జీవనస్థితి గురించి పట్టించుకునే స్వభావం ఏనాడు లేదు.

1/70 చట్టం ప్రకారం:

1. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసుల భూమిని (షెడ్యూల్డ్ ఏరియా) గిరిజనేతరులకు బదలాయించడం చెల్లదు.

2. గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న స్థిరాస్తి ఆదివాసుల నుంచి అక్రమంగా సంక్రమించిందే అని ఈ చట్టం రుజువు చేస్తుంది. అలా కాదని రుజువు చేసుకోవలసిన బాధ్యత గిరిజనేతరులదే.

3. ఏజన్సీ ప్రాంతాల్లో స్థిరాస్తిని ఆదివాసులకు తప్ప వేరొకరికి అమ్మడానికి వీలులేదు. ఒకవేళ ఆదివాసులు కొనడానికి సిద్ధంగా లేకపోతే అట్టి స్థిరాస్తిని ప్రభుత్వానికి అప్పగించాలి. ఈవిధంగా అప్పగించిన భూమికి ప్రభుత్వం విధిగా తగు నష్టపరిహారం చెల్లించాలి.

ఇటువంటి అంశాలతో స్పష్టంగా వున్న ఆదివాసి (ఏజెన్సీ ప్రాంత) గిరిజన హక్కుల రక్షణ 1/70 చట్టాన్ని గతంలో చంద్రబాబు ప్రభుత్వం కూడా సవరించడానికి ప్రయత్నం చేసింది. ప్రస్తుతం వున్న ప్రభుత్వం కూడా ప్రపంచ బ్యాంకు షరతులలో భాగంగా సవరించడానికి ప్రయత్నాలు కొనసాగిస్తుంది. ఉదా : పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ఖమ్మం, అదిలాబాద్, వరంగల్ జిల్లాలలో ఆదివాసి ప్రజలకు, ఆదివాసేతరులకు భూముల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. 1/70 నుంచి అటవీ సంరక్షణ కీలకమైన సమస్యగా పెద్ద ఎత్తున ముందుకు వచ్చింది. బ్రిటిష్ కాలంలో అడవులు చాలా మటుకు నశించి పోవడం జరిగింది. శాస్త్రీయ అడవుల పెంపకం పేరుతో సహజంగా పెరిగిన చెట్లను వివిధ పథకాల ద్వారా నరకటం, ప్లాంటేషన్స్ చేయటం, కార్యక్రమం ఆచరణలో విఫలం కావడం జరిగింది. కాఫీ, టీ రబ్బరు తోటల కొరకు ఆర్థికంగా, రాజకీయంగా బలపడిన పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున చొరబడడం జరిగింది. 1980లో భారత అటవీసంరక్షణ చట్టం ద్వారా అడవి హక్కులపై భారత ప్రభుత్వానికి పూర్తి ఆధిపత్యం వచ్చింది. ఎవరైతే వ్యాపారపరంగా దోచుకున్నారో, ఆ వర్గాల నుంచి వచ్చిన వారే అడవి రక్షకులుగా మారారు. మానవ సంచారం లేకుండా ఉండే అటవీ ప్రాంతాలుగా అడవిని పున:నిర్మించడం జరిగింది. చట్టబద్ధంగా పొందవలసిన అటవీప్రాంత ప్రజల హక్కులను పూర్తిగా కాలరాసారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రజల సాంప్రదాయక హక్కులను పూర్తిగా కాలరాయటంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆదివాసి ప్రజలను ఆక్రమణ దారులుగా గుర్తించారు. అడవిలో జీవించడం, జీవనాధారాన్ని పొందటం నేరపూరితమైన చర్యగా మారింది. అభద్రత, మానసిక ఆందోళన, తొలగింపు అనేవి ఆదివాసి ప్రజల జీవన విధానంగా మారినవి. అటవీ ప్రాంతాల్లో ఈవిధంగా జరుగుతుండడంతో పోషకాహార లోపంతో, ఆకలి చావులతో ఆదివాసులు చనిపోవడం నిత్యకృత్యం అయింది. ఉదా : 1999-2000 సంవత్సరాలలో అదిలాబాద్ జిల్లాలో కలరా, మలేరియాలతోటి 2000 మంది ఆదివాసులు మరణించారు. 2005 సంవత్సరంలో విశాఖపట్టణం జిల్లాలో 2200 మంది ఆదివాసులు కలరా, మలేరియా, ఆంత్రాక్స్ వ్యాధుల తోటి చనిపోయారంటే పాలకవర్గాలకు ఆదివాసులపై ఏవిధమైన ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు!

భారత రాజ్యాంగంలో 5వ, 6వ షెడ్యూళ్ళ ద్వారా ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించబడింది. 5వ షెడ్యూల్ ప్రకారం ఆదివాసి సలహా కమిటీ ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ చట్టాలు ఆదివాసులకు అదనపు బాధ్యతను, హక్కును కల్పిస్తాయి ఆదివాసుల ప్రత్యేక జీవన విధానాన్ని కాపాడడమే వీటి ప్రధాన లక్ష్యం. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన శాసనాలను ఆయా ఆదివాసీ ప్రాంతాలకు జిల్లా కౌన్సిల్ ఆమోదం లేకుండా అన్వయించే వీలు లేదు. ఆదివాసీ ప్రాంతాలలో జిల్లా కౌన్సిల్స్ అనుమతి లేకుండా ఆయా శాసనాల అన్వయింపును పొడిగించడం కూడా సాధ్యం కాదు. వాస్తవంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో 5వ, 6వ షెడ్యూల్స్‌ను అమలు చేయడం లేదు. భారత రాజ్యాంగంలో భాగంగా షెడ్యూల్డ్ ఏరియాలకు పంచాయతీ రాజ్ చట్టం 1996 వచ్చింది. సెక్షన్ 4 (డి) ప్రకారం ఉమ్మడి వనరుల యాజమాన్యానికి అధికారాలను

ఆదివాసి ప్రజలకు కల్పించింది. సెక్షన్ 4 (యం) గ్రామ సభకు అటవీఫలసాయంపై అధికారాలు, యాజమాన్యపు హక్కులు కల్పించింది. ఈ చట్టం ఆచరణలో అమలుకు నోచుకోనేలేదు. సుప్రీంకోర్టు సూచన ప్రకారమే భారత అటవీశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ అన్ని రాష్ట్రాలకు సూచనలు చేస్తున్నామని చెప్పారు. పకడ్బందీ ప్లాన్‌తో సెప్టెంబర్ 30, 2002 కల్లా ఆక్రమణ దారులను అడవినుంచి తొలగించాలని ఆర్డర్ చేసారు. కేంద్ర అటవీశాఖ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం అనేక రాష్ట్రాలలో తొలగింపు కార్యక్రమం మొదలైంది. సుమారు 15 లక్షల ఆదివాసి కుటుంబాలు తొలగింపుకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. కొన్ని చోట్ల ఏనుగులతో ఆదివాసి ఇళ్ళను కూల్చివేశారు. ఒక్క విశాఖపట్టణం జిల్లాలోనే 37,000 హెక్టార్ల భూమి ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ గర్వంగా ప్రకటించింది. ఈ భూమి అంతా కూడా ప్రపంచ బ్యాంకు అధ్వర్యంలో జరుగుతున్న ఉమ్మడి అటవీ యాజమాన్య పథకం క్రింద ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూముల నుంచి వెళ్ళగొట్టడం ద్వారా సంపాదించినదే. అదిలాబాద్ జిల్లాలో గత 3 సంవత్సరాలో ధర్మాజిపేట, మిద్దెచింత, లొద్దిగూడ గ్రామాలను కాలబెట్టి బలవంతంగా భూముల నుండి వెళ్ళగొట్టడం చేసారు. రెబ్బన మండలం కైరిగూడ గ్రామంలో బలవంతంగా 500 ఎకరాలలో నుండి తరిమివేసి ఫారెస్టు అధికారులు మొక్కలను నాటారు. కాశిపేట్ మండలం సోనాపూర్ గ్రామంలో 20 ఎకరాలలో సాగు చేసుకుంటున్న భూములలో వి.ఎస్.ఎస్. సభ్యులు, ఫారెస్టు అధికారులు కలిసి మొక్కలను పెట్టారు. నేరడికొండ మండలం యాపల్‌గూడ ఆదివాసులు 20 ఎకరాలలో సాగు చేస్తుండగా పక్కనే ఉన్న గుతుపాల గ్రామ ఆదివాసులను ఫారెస్టు అధికార్లు రెచ్చగొట్టి భూమి మీ గ్రామ శివారులో ఉన్న రీత్యా వారిని చేసు కోనివ్వద్దు అని పంట చేలను దున్నారు. ఈవిధంగా రెండు గ్రామాల మధ్య ఫారెస్టు అధికార్లు గొడవ సృష్టించి, చివరికి ఎవరూ కూడా భూములను సాగు చేయవద్దు అని ఆ భూమిలో ఎర్ర జెండాలు పాతి వి.ఎస్.ఎస్. ద్వారా ఆ భూములలో మొక్కలను నాటినారు. ఈవిధంగా ఆదివాసుల మధ్య ఫారెస్టు అధికార్లు గొడవలు సృష్టించి భూములలో మొక్కలను నాటడానికి తీవ్రప్రయత్నం చేస్తున్నారు. వరంగల్ జిల్లా మంగం పేట మండలంలోని తక్కల్లపాడు గ్రామంలో, గూడూరు మండలం గోవిందపురం గ్రామంలో కూడా వి.ఎస్.ఎస్. ద్వారా ఫారెస్టు అధికార్లు పంట చేలలో మొక్కలను నాటారు. గ్రామ ఆదివాసులు అడ్డుకొని మొక్కలను పీకివేసి తిరిగి భూములను సాగు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని మారేడుమిల్లి, వై.రామవరం మండలంలోని టైగర్ క్యాంపు, ఉప్పరిగోతులు, జామానువీధి, చింతలపూడి, చింతవలన, మొదలగు కొన్ని గ్రామాలను టైగర్ క్యాంపు పేరుతో అడవి నుండి వెళ్ళగొట్టడానికి ఫారెస్టు డిపార్టుమెంట్ వారు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అడవిగా గుర్తించిన ప్రాంతంలో ఈరోజున దాదాపు 295,383 హెక్టార్ల భూమి ఆక్రమణదారుల చేతుల్లో ఉందని ఫారెస్టు డిపార్టుమెంట్ లెక్కలు చెబుతున్నాయి. భారతదేశంలో మన ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో వున్నది. ఆదిలాబాద్ సర్కిల్ - 94,055 హెక్టార్లు, ఖమ్మం సర్కిల్ - 74,929.27 హెక్టార్లు, విశాఖపట్టణం సర్కిల్ - 38,153.67 హెక్టార్లు, వరంగల్ సర్కిల్ - 15,789.56 , శ్రీశైలం సర్కిల్ - 13,783.81 హెక్టార్లు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్.టి.లుగా గుర్తించినవారి జనాభా - 50.24 లక్షలు (2001 లెక్కల ప్రకారం) ఇందులో దాదాపు 60% ఎస్.టి జనాభా, తూర్పు కనుమలు, గోదావరి తీర ప్రాంతాలు, నల్లమల ప్రాంతాలలో నివసిస్తున్నారు. అటవీప్రాంతం - 63 లక్షల 80వేల హెక్టార్లు. మొత్తం బౌండరీ లైన్లు 79,311 కి.మీ రిజర్వు ఫారెస్టు - 50,47,000 హెక్టార్లు, ప్రొటెక్టడ్ ఫారెస్ట్ - 12,36,000 హెక్టార్లు, అన్ క్లాసిఫైడ్ ఫారెస్ట్ - 9,71,000 హెక్టార్లు,జాతీయ పార్కులు - 4 (ఏరియా 3.3 లక్షల హెక్టార్లు), అభయారణ్యాలు - 21 (ఏరియా 12.5 లక్షల హెక్టార్లు) దాదాపు 60% పైగా షెడ్యూల్డ్ ప్రాంత భూములు అటవీశాఖ అధీనంలో ఉన్నవి. వ్యవసాయ జీవనాధారానికి కొద్ది భూభాగం మాత్రమే ఆదివాసులకు దక్కిందని లెక్కలు తెలియచేస్తున్నాయి. నీటి వసతులు గల సాగుభూములు దాదాపు 7% కన్నా ఎక్కువ లేవు. 65% పైగా కుటుంబాలకు 5 ఎకరాల కన్నా ఎక్కువ భూమి లేదు. 30% పైగా ఆదివాసి భూములు ఆదివాసియేతర్ల చేతుల్లో వున్నాయి. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఈనాడు దాదాపు 37% పైగా ఆదివాసీయేతర్లు నివసిస్తున్నారు. బౌండరీ వివాదాలు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి. 1980కు ముందు సాగు చేసుకుంటున్న వారి భూముల గుర్తింపు క్రమబద్ధీకరణ ప్రక్రియ మొదలు కానేలేదు. అడవిని నోటిఫై చేస్తూ సెటిల్‌మెంట్ జరిగిన ప్రక్రియ అత్యంత వివాదాస్పదంగా ఉన్నది. అన్నిచోట్ల ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే సెటిల్‌మెంట్ ప్రక్రియ జరిగింది. దీనిమూలంగా ఆ భూముల్లో సేద్యం చేసుకుంటున్న, నివాసముంటున్న ప్రజలు ఆక్రమణదారులైపోయారు. ఆదిలాబాద్ జిల్లాలో అడవిపై హక్కుల కొరకు 1940లో కొమురం భీం నాయకత్వంలో జోడేన్‌ఘాట్ ప్రాంతంలో పోరాటం నడిచింది. భూముల కొరకు ఇంద్రవెల్లి గ్రామానికి పోయిన ఆదివాసి ప్రజల మీద కాంగ్రెస్ ప్రభుత్వం కాల్పులు చేస్తే 60 మందిఆదివాసులు మరణించారు. 1981 ఏప్రిల్ 20 నాడు ఇంద్రవెల్లి మారణకాండ జరిగింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో సాగు చేస్తున్నారు. నేడు అడవి భూములను రక్షించుకోవడానికి, ఆంధ్రప్రదేశ్‌లో వున్న వివిధ ఆదివాసి సంఘాలు పోరాడుతున్నాయి. నేషనల్ పార్కు నుండి ఆదివాసులను ఖాళీ

చేయించేందుకు ఫిబ్రవరి 19, 2003 నాడు కేరళ పోలీసు బలగాలు ప్రవేశించి సృష్టించిన బీభత్సం, ఉన్మాద చర్యల స్వైరవిహారాన్ని మరిపించింది వైనాడు మానవహక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు జోసెఫ్ తౌరకం 35 మంది మహిళలు, 31 మంది పిల్లలు అదృశ్యమయ్యారని చెప్పారు.

విశాఖపట్టణం జిల్లాలో సెటిల్‌మెంట్ ప్రక్రియ ప్రజలకు వ్యతిరేకంగా జరిగింది. అనేక గ్రామాలు అన్‌సర్వేడ్ గ్రామాలుగా ఉండిపోయినవి. వీరికి ఓటు హక్కు ఉన్నా, రెవెన్యూ రికార్డుల్లో వీరికి గుర్తింపు లేదు. అదిలాబాద్ జిల్లాలోని 1500 గ్రామాలను ఖాళీ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అడవి ఒడిలో వెలసిన గ్రామాలను తొలగించి అటవీభూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందామని భారీస్థాయి కుట్ర జరుగుతుందని ఆదివాసి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అటవీప్రాంతంలో 'అటవీగ్రామం' లేనే లేదు అని డిపార్ట్‌మెంట్ చెబుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 697 గ్రామాల్లో సెటిల్‌మెంట్ సర్వే నిర్వహించలేదు. ఇవి అన్‌సర్వే గ్రామాలుగా ఉండిపోయినవి. అటవీభూముల్లో వ్యవసాయం చేసుకోవడమే పోడుగా ప్రచారం జరుగుతున్నది. ఇది వాస్తవం కాదు. ఆదివాసులు ఎక్కువగా స్థిర వ్యవసాయమే కొనసాగిస్తున్నారు. విశాఖపట్టణం, తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతంలో కొన్నిచోట్ల మాత్రమే కొండపోడు సాంప్రదాయక పద్ధతి కొనసాగుతున్నది. దీన్ని సాంప్రదాయక హక్కుగా, వ్యవసాయ జీవనాధారంగా గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలమైనాయి. సోషల్ ఫారెస్ట్రీ, ఐపాడ్ హార్టికల్చర్ ప్లాంటేషన్స్, కాఫీ ప్లాంటేషన్లు (ఎ.పి.ఎఫ్.డి.సి. - కాఫీ బోర్డు ద్వారా), రబ్బరు ప్లాంటేషన్లు గత 30 సంవత్సరాలుగా ప్రజలు సాగు చేసుకుంటున్న భూముల్లోనే వేయటం జరుగుతూ వస్తున్నది. వ్యవసాయ భూములను తిరిగి అటవీభూములుగా మార్చటం జరుగుతున్నది. అయితే ప్రజలకు వీటిపై పూర్తి హక్కులు ఉంటాయా అనేది పెద్ద ప్రశ్న. అటవీ సంరక్షణ చట్టం 1980 ప్రకారం వివిధ రకాలుగా వర్గీకరించిన అటవీభూములపై పూర్తి అధికారం ఫారెస్టు డిపార్టుమెంట్‌దే.

భారతదేశం అడవుల్లో నివసించే ఆదివాసుల ఏకైక జీవిత వనరు. అడవులే వారి బ్రతుకు దెరువు. చేపల్ని నీటి నుంచి వేరు చేస్తే ఎట్లా బ్రతకలేవో అట్లాగే ఆదివాసుల్ని అడవి నుంచి వేరు చేస్తే బ్రతకలేరు. ఆదివాసులకు ఆహారాన్ని, ఆశ్రయాన్ని ఇచ్చేవి అడవులే. శతాబ్దాలుగా వాళ్ళు అడవుల్ని వాడుకునే స్వేచ్ఛను, జంతువుల్ని వేటాడే స్వేచ్ఛను అనుభవించడం వాళ్ళ సాంస్కృతిక జీవితాన్ని అతి దగ్గరగా పరిశీలిస్తే తప్ప, అడవితో వాళ్ళు పెనవేసుకున్న జీవితానుబంధం ఎంత బలీయమైందో అర్థం కాదు.

చరిత్రలో అడవుల్ని దోచుకోవాలనుకున్న ప్రతీవాడు తాను చేసే ప్రతి చర్య ఆదివాసి అభివృద్ధి అని చెప్పాడు ప్రపంచానికి. అయితే ఇవ్వాళ ఆదివాసి అభివృద్ధి అంటే ఆదివాసుల్ని అడవి నుండి వేరు చేయడమేనా? వాళ్ళ హక్కులు కాలరాసి, స్వేచ్ఛను మంట గలిపి అడవి సంపదల్ని ఆటవికంగా దోచుకునే నాగరికుల దోపిడి విష రక్కసుల కుట్రగానే భావించాలి.

నూతన అటవీహక్కుల బిల్లు - 2005:

గ్రామసభ అధ్వర్యంలో ఆదివాసి హక్కులు గుర్తింపు ప్రక్రియ పటిష్ఠంగా జరిగేలా ఈ చట్టం ప్రస్తావించాలి. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామసభ అధికారాల గురించి చట్టం పటిష్టంగా రూపొందించాలి. అటవీహక్కుల గుర్తింపు విషయంలో చారిత్రక అన్యాయం జరిగిందని ప్రభుత్వం ఒప్పుకుంది. కనుక ఈ చట్టం ఏవిధంగా ఆదివాసుల హక్కులను గుర్తిస్తుందనేది ప్రధానంగా వుండాలి. చారిత్రక తప్పిదాల పరిష్కార మార్గాలకు ఈ చట్టం ఆయుధంగా ఉపయోగపడాలి. సర్వే కాని గ్రామాల తరవున వివాదాస్పద భూముల్లో చిక్కుకున్న ఆదివాసుల తరవున నిలబడి ప్రజా సంఘాలు, సంస్థలు గ్రామసభలో తీర్మానాలు చేయాలి. ప్రజల హక్కులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలి. సాంప్రదాయ హక్కుల చట్టంలో సాంప్రదాయ హక్కులను గుర్తించాలి. కాబట్టి ఈ బిల్లులో సాంప్రదాయ హక్కుల చట్టంలో సాంప్రదాయ హక్కులను గుర్తించాలి. ప్రజల హక్కులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలి. ఇప్పటికే అటవీ సంరక్షణకు, వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి అనేక చట్టాలున్నాయి. కనుక హక్కుల గుర్తింపు చట్టంలో పెనాల్టీస్ (శిక్షలు) గురించి ప్రస్తావించడం సరిగ్గా లేదు. ఈ చట్టంలో పేర్కొన్న శిక్షలకు, ఇతర అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాలకు గల తేడా ఏమిటో స్పష్టంగా వివరించాలి.

❑

సమాచార హక్కు చట్టం - 2005

కేంద్ర ప్రభుత్వం 2005 మే నెలలో సమాచార హక్కు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించిన మీదట జూన్ 15వ తేదీన రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. 2005 మే 21వ తేదీన కేంద్ర ప్రభుత్వం నూతనచట్టాన్ని గెజిట్‌లో ప్రచురించింది. ప్రతి ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం ప్రజలకు సమాచారాన్ని అందుబాటులో వుంచే హక్కును వారికి కల్పించడం ఈ చట్టం లక్ష్యం. 2005 అక్టోబర్ 12వ తేదీ నుంచి సమాచార హక్కు చట్టం అమలులోకి వస్తుంది. సుపరిపాలన దిశగా భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలలో ఈ చట్టానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది.

వర్తింపు:

ఈ చట్టం జమ్ము-కాశ్మీర్ రాష్ట్రం మినహా మొత్తం భారతదేశానికి, యూనియన్, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు.

1. రాజ్యాంగబద్ధంగా లేదా దానికింద ఏర్పడిన అన్ని సంస్థలకు,
2 పార్లమెంటు చేసిన చట్టాల ద్వారా ఏర్పడిన అన్ని సంస్థలకు,
3. రాష్ట్ర శాసనసభ చేసిన చట్టాల ద్వారా ఏర్పడిన అన్ని సంస్థలకు,
4. ఆయా ప్రభుత్వాల నోటిఫికేషన్ల ద్వారా, ఉత్తర్వుల ద్వారా ఏర్పడిన అన్ని సంస్థలకు,
5. ఆయా ప్రభుత్వాల నుండి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని నిధులను పొందిన సంస్థలకు,

❖ ప్రభుత్వ యాజమాన్యంలోని లేదా అజమాయిషీలోని లేదా నిధులు పొందిన ఇతర సంస్థలకు.

❖ గణనీయంగా ప్రభుత్వ నిధులు పొందిన అన్ని ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలకు వర్తిస్తుంది.

మినహాయించబడిన సంస్థలు:

❖ ఈ చట్టం రెండవ షెడ్యూలులో ప్రకటించిన ఇంటిలిజెన్స్ ఏజెన్సీలు, సెక్యూరిటీ ఏజెన్సీలు

❖ ఈ సంస్థలు ఆయా ప్రభుత్వాలకు అందించే సమాచారం.

❖ ఈ సంస్థలపై అవినీతి ఆరోపణలు - మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారానికి ఈ మినహాయింపు వర్తించదు.

సమాచారం అంటే ఏమిటి?

❖ ప్రతి ప్రభుత్వ శాఖకు, పబ్లిక్ సంస్థకు సంబంధించిన రికార్డులు, డాక్యుమెంట్లు, మెమోలు, ఇ-మెయిల్స్, అభిప్రాయాలు, సలహాలు, పత్రికా ప్రకటనలు, సర్క్యులర్లు, ఉత్తర్వులు, లాగ్ పుస్తకాలు, కాంట్రాక్టులు, రిపోర్టులు, పత్రాలు, శాంపిల్స్, నమూనాలు, ఏ తరహా ఎలక్ట్రానిక్ రూపంలోనైనా వున్న డేటా మెటీరియల్స్‌తో సహా ఏ తరహాదైనా, ఏ రూపంలోనైనా వున్న మొత్తం సమాచారం.

❖ ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థ ఏదైనా చట్టం ద్వారా ఒక ప్రయివేటు సంస్థ నుండి పొందగలిగిన సమాచారం.

రికార్డు అంటే?

❖ డాక్యుమెంటు, రాతప్రతులు, ఫైళ్ళు

❖ మైక్రోఫిల్మ్, మైక్రో ఫిఛె, డాక్యుమెంట్ల ఫ్లాపీ లేదా మెయిల్ కాపీలు

❖ పునరుత్పత్తి చేసిన చిత్రాలు, మైక్రో ఫిల్మ్‌లో వున్న చిత్రాలు

❖ కంప్యూటర్ లేదా ఇతర సాధనాలు అందించే మెటీరియల్

సమాచార హక్కు అంటే ఏమిటి?

❖ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు హక్కుగా అందించవలసిన సమాచారం

❖ ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థ కలిగి వున్న లేదా దాని ఆధీనంలో వున్న సమాచారం

❖ ఆ సమాచారంతో పాటు ప్రజల హక్కుగా పొందే అవకాశాలు

1. డాక్యుమెంట్లను, రికార్డులను, పనులను పరిశీలించడం.
2. డాక్యుమెంట్లు, రికార్డుల నుండి నోట్సు తీసుకోవడానికి, వాటి సర్టిఫైడ్ కాపీలను లేదా కొన్ని భాగాల కాపీలను పొందటం
3. మెటీరియల్‌కు సంబంధించి సర్టిఫైడ్ నమూనాలు పొందడం.
4. డిస్కెట్లు, ఫ్లాపీలు, టేపులు, వీడియో కేసెట్లు లేదా ఏ ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతిలో వున్న సమాచారాన్ని కంప్యూటర్లలో

ఇతర ఎలక్ట్రానిక్ రూపంలో నిక్షిప్తమైన సమాచారాన్ని ప్రింట్ కాపీలను పొందటం.

కోర్టుల పరిధి:

1. ఈ చట్టం క్రింద సంబంధిత అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఎలాంటి దావాలను, పిటీషన్లను కోర్టులు స్వీకరించరాదు
2. చట్ట ప్రకారం మినహాయించబడిన సమాచారం తప్ప మిగిలిన సమాచారం విషయంలో 1928 నాటి అధికార రహస్యాల చట్టం లేదా అటువంటి ఏ ఇతర చట్టాలు దీనికి వర్తించవు.

(మిగతా 46వ పేజీలో)

దళితుల హక్కులే మానవ హక్కులు

- జి.వి. రత్నాకర్
సాక్షి మానవహక్కుల నిఘా (ఎ.పి.)

స్వతంత్ర భారత దేశంలో దళితులకు కనీస అవసరాలు తీరని పరిస్థితి నేడు మనకి కనిపిస్తుంది. కనీస జీవన అవసరాలు నిరాకరించబడుతున్నచోట హక్కులు అందులోనూ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కుల గురించి మాట్లాడటం అంటే అది అర్థరహితంగా కనిపిస్తుంది. భూమిపైన, శ్రమపైన జీవనాధార వనరులపైన విద్య, ఉపాధి, రిజర్వేషన్లు, జీవనభద్రత, రక్షణ, దళితస్త్రీలకు అన్ని రంగాల్లో సమానావకాశాలు మొదలైన అన్ని అంశాలతో ప్రభుత్వ ప్రకటనలకు, పౌరసమాజపు శుష్క వాగ్దానాలకు మాత్రమే పరిమితమౌతున్న నేపథ్యం నేడు మనకు కనిపిస్తుంది. భారతదేశానికి వెన్నుముకగా ఉన్న వ్యవసాయరంగం దళితులు లేకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. స్వాతంత్రం వచ్చిన ఈ 58 సంవత్సరాలలో దళితుల అభ్యున్నతి కోసం, విద్య, ఆర్థిక అభివృద్ధికోసం, దళితుల రక్షణకోసం, ప్రభుత్వం చేపడ్తున్న చర్యలు ఏవీ దళితుల జీవితాల్ని మెరుగు పరచక పోవడంలేదు సరికదా మరింత దళితుల జీవితాన్నీ అధః పాతాళానికి నెట్టి వేస్తున్నాయి.

సోషల్ డాక్యుమెంట్ అయిన రాజ్యాంగం అనేక అంశాలను తనలో దాచుకుంది. ఆ అంశాలు భారత ప్రజల ఆకాంక్షలని ప్రతిఫలింపజేసాయి. తరాలుగా అసమానతలకు, అణచివేతలకు గురైన దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు స్త్రీలు, పిల్లలు మొదలైన వారికోసం రాజ్యాంగం అనేక వాగ్దానాలు చేసింది... భారత ప్రజలమైన మేము ఈ దేశాన్ని సార్వభౌమాధికార, సమధర్మ, లౌకిక, గణతంత్ర రాజ్యాంగం నిర్మించటానికి నిశ్చయించుకున్నాము. ఈ దేశ పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని వాక్ స్వతంత్రాన్ని, ఇష్టమొచ్చిన మతాన్ని అవలంబించే స్వేచ్ఛని, అవకాశాలలోనూ, హోదాలోనూ సమానత్వాన్ని, ప్రతివ్యక్తికి గౌరవాన్ని, దేశ సమగ్రతకు ఐక్యతకు దోహదపడే సౌభ్రాతృత్వాన్ని ఈ దేశ పౌరులు కలిగి ఉంటారు అనే మాటలతో మొదలైన మన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి అర్థశతాబ్దం గడిచి ఓ అర్థ దశాబ్దం కూడా నిండుతుంది. ఇన్నాళ్ళుగా ఈ మాటలు అణగారిన దళిత ప్రజానీకానికి ఎంత ఓదార్పును, ఆశను కలిగించాయోగానీ అవి మాత్రం ఆ పుటల్లో అలా మిగిలి పోయాయి. రాజ్యాంగంలో పొందు పరిచిన అనేక అధికరణాలు దుర్మార్గమైన నిర్లక్ష్యానికి గురైనాయి. గతంలో కనీసం వేల సంఖ్యలోనైనా దళితులు విద్యావంతులై ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఉండింది. గతంలో భూపరిమితి చట్టాలు, కనీసవేతన చట్టాలు, ఉపాధి హామి పథకాలు ఉన్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థవుంది. ఇప్పుడు అవన్నీ గాలికి కొట్టుకుపోతున్నాయి. రిజర్వేషన్ల అమలుకు అవకాశం ఉన్న ప్రభుత్వ రంగం మూసుకుపోతోంది. సేవల రంగానికి ప్రాధాన్యం పెరిగి దళితులు అందుకోనంత దూరాన అది కేంద్రీకృతమైంది. ఇంగ్లీషుకూ, కంప్యూటర్లకూ విపరీతమైన, అనవసరమైన ప్రాధాన్యత పెరిగి పోయింది. ఆ రెండూ లేని వాళ్ళు ఉద్యోగ ప్రయత్నాలే చేయలేని పరిస్థితి నేడు నెలకొంది. విద్యా సంస్థల్లో దళితులకు అనుకూలమైన కోర్సులన్నీ పోతున్నాయి. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న దళితులు దినదిన గండంగా బతుకు లీడుస్తున్నారు.

ఈ రోజు పల్లెల్లో ప్రతిచోట దళిత వ్యతిరేక విధానాలే కనిపిస్తున్నాయి. వ్యవసాయాన్ని తీర్చిదిద్ది దేశానికి వెన్నెముకగా మలిచిన దళితుల చేతుల్ని ఏ నైపుణ్యతా లేని మొరటు చేతులుగా కొట్టిపడేస్తున్నారు. విపరీతమైన యాంత్రీకరణ వ్యవసాయంలోనూ, యితర గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలలోనూ చొచ్చుకు వచ్చింది. ఒక్క ప్రొక్లెయిన్ దెబ్బకి గంటకు 600 మంది దళిత, ఆదివాసి పేదకూలీలు నిరాశ్రయులవుతున్నారు. కనీసవేతనం మాట సరే కనీసపు పనిదినాలే కరువైపోయాయి. దేశానికి అన్నంపెట్టిన చేతులు నగరానికి వలస వచ్చి యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, కూకట్‌పల్లి, నల్లకుంట లాంటి నాలుగు రోడ్ల కూడల్లలో అడుక్కుంటున్నారు. అన్ని అవకాశాలనూ కోల్పోయి వట్టి చేతులతో నిలబడ్డ దళిత సమాజంపైన దాడులు, అత్యాచారాలు పెచ్చరిల్లుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగానికీ, దళితుల, యితర అణగారిన వర్గాల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం జవాబుదారీ కావాలి.

1991 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని మొత్తం దళిత ప్రధాన పనిశక్తి ప్రాథమిక రంగంలో 81.89 శాతం ఉంది. జాతీయ సగటు ఈ విషయంలో 77 శాతం మాత్రమే ఉంది. దళితులకు దళితేతరులకు మధ్య ఉన్న అసమానత కూడా పై నాలుగు రాష్ట్రాల్లో 22.23 శాతంగా (జాతీయ సగటు 14.83) ఉంది. వృత్తి విషయంలో దక్షిణాది దళితుల పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. ప్రతి వంద మంది దళితుల్లో

62.23 శాతం మంది భూమిలేని వ్యవసాయ కూలీలే. ఇది జాతీయ స్థాయిలో 49.06 శాతంగా ఉంది.

గత రెండు దశాబ్దాల్లో ఈ నాలుగు రాష్ట్రాల్లోని దళితుల ప్రధాన పనిశక్తిలో 62.66 శాతం మంది (జాతీయ సగటు 45.32 శాతం భూమిలేని వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. దక్షిణాదిలో మొత్తం దళిత ప్రధాన్యత పని శక్తిలో 14.92 శాతం మంది మాత్రమే వ్యవసాయదారులుగా ఉంటే ఇదే జాతీయస్థాయిలో 25.44 శాతం మంది వ్యవసాయదారులుగా ఉన్నారు.

విద్యారంగాన్ని పరిశీలిస్తే దేశంలోని వివిధ యూనివర్శిటీల్లో రిజర్వుడు కేటగిరిల్లో 75 వేల టీచింగ్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలుస్తుంది. ఢిల్లీ యూనివర్సిటీలో 1400 ఖాళీలున్నట్లు ఫోరం ఆఫ్ అకడమిక్స్ ఫర్ సోషల్ జస్టిస్ తాజాగా విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. దేశంలో 256 యూనివర్సిటీలు 11 వేల 115 కాలేజీలున్నట్లు తెలుస్తుంది. ప్రతిసంవత్సరం 8 లక్షల మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకుంటుండగా వారికి బోధన కోసం 3 లక్షల 42 వేల మందిని నియమిస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని 79 కాలేజీల్లో 7000 అధ్యాపక పోస్టులున్నాయి. రిజర్వేషన్ల ప్రకారం ఇందులో 22.5 శాతం అనగా 1500 పోస్తులు ఎస్సీ, ఎస్టీలకు చెందాలి. 1998లో వివిధ విభాగాల్లో 11 మంది లెక్చరర్లు, ఇద్దరు రీడర్లు, ముగ్గురు ప్రొఫెసర్లు వివిధ కాలేజీల్లో 50 మంది లెక్చరర్ల నియామకం మాత్రమే జరిగింది. జె.ఎన్.యులో 189 ప్రొఫెసర్, 125 రీడర్, 67 లెక్చరర్ పోస్టులున్నాయి. 89 రిజర్వుడు పోస్టుల్లో 3 ప్రొపెసర్లు, 6 రీడర్లు, 11మంది లెక్చరర్లని భర్తీచేశారు. సెంట్రల్ యునివర్శిటీల్లో హైదరాబాద్ యునివర్సిటీలో 43 రిజర్వుడు పోస్టుల్లో 16 స్థానాలు భర్తీ చేశారు. మిగిలిన వాటిని బట్టి చూస్తే ఇది కాస్త మెరుగ్గాఉంది. పశ్చిమ బెంగాల్‌లోని విశ్వభారతి శాంతి నికేతన్‌లో 97 రిజర్వుడు పోస్టులకుగాను కేవలం 19 పోస్టులను మాత్రమే భర్తీ చేశారు.

డాక్టర్ అంబేద్కర్ దీక్ష, పోరాట ఫలితంగా రాజ్యాంగంలో దళితులకు ప్రత్యేక హక్కులను కల్పించారు. సమానత్వం (చట్ట ముందు అందరూ సమానులే 14వ అధికరణం) జీవించే హక్కు (ప్రాణ రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ, పాలన హక్కు 2 అధికరణం) అంటరాని తన నిర్మూలన (అధికరణం-17) దళితుల సామాజిక, ఆర్థిక పురోగతికోసం, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు, రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కోసం రాజకీయ రిజర్వేషన్లు (అధికరణం 243) రాజ్యాంగంలో కల్పించిన రక్షణలలో ముఖ్యమైనవి. 1995లో తీసుకు వచ్చిన పి.సి.ఆర్ యాక్ట్‌లో ప్రధానంగా అంటరానితనానికి సంబంధించిన నేరాలను నిరోధించే నిబంధనలు ఉన్నాయి. ఈ చట్టం అంటరానితనాన్ని నిషేదించింది. కానీ దాని రూపాలను వాటికి సంబంధించిన శిక్షలను వాటి అమలును స్పష్టంగా పేర్కొనలేదు. దాని వలన తరతరాలుగా దళితులపై జరుగుతున్న దాడులను అత్యాచారాలను నిరోధించడానికి పునరావాస కార్యక్రమాల అమలుకు వీలు కలుగలేదు. ఎమర్జెన్సీ తరువాత జరిగిన బెల్చి, కీలవేన్మణి, కారంచేడు దురంతాలు చట్టంలోని లొసుగులను బహిర్గతపరిచాయి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా సాగిన దళిత, ఇతర ప్రజాస్వామ్య ఉద్యమాల కారణంగా 1989లో ఎస్సీ, ఎస్టీ అత్యచారాల నిరోధక చట్టం వెలుగుచూసింది.

అర్థ శతాబ్దం తర్వాత కూడా షెడ్యూల్డు కులాలు, తెగలపైన సాగుతున్న అత్యాచారాలు, నేరాలు సమసిపోలేదు. దీనికి 1995 లో నియమాలను రూపొందించి మరింత శక్తివంతం చేశారు. ఇది ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అత్యాచారాలను, నేరాలను విచారించడానికి ప్రత్యేక కోర్టుల నదుపాయాలను కలుగజేయడానికి బాధితులకు తగిన పరిహారాన్ని చెల్లించడానికి ఈ చట్టం కారణంగా మొట్ట మొదటిసారిగా అత్యాచారం అనే పదాన్ని నిర్వచించారు. ఆత్మగౌరవంతో కూడిన స్వతంత్రమైన జీవితం గడిపే అవకాశాలను సృష్టించడం కూడా ఈ చట్టం లక్ష్యం. దానికోసం ఈ చట్టంలో కఠినమైన శిక్షలు, పునరావాసం, పరిహారం చెల్లించే ఏర్పాటు ముందుగానే గుర్తించి నిరోధించే చర్యలను రూపకల్పన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ చట్టం అమలు కోసం సాక్షి మానవ హక్కుల నిఘా, దళిత బహుజన శ్రామిక యూనియన్ , దళిత బహుజన ఫ్రంట్ అదే విదంగా దేశవ్యాప్తంగా నేషనల్ కాంపెన్ ఆన్ దళిత హ్యూమన్ రైట్స్ మరికొన్ని సంస్థలు పనిచేస్తునాయి. మన రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి కూడా పనిచేస్తుంది. వీటన్నింటి కారణంగానే జస్టిస్ పున్నయ్య కమీషన్ కూడా ఆవిర్భవించింది.

దళితులకు సామాజిక ఆర్థిక రంగాలలో న్యాయం కల్పించేందుకు అనేక చట్టాలు చేయడం జరిగింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ (15-17) పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955, ఎస్సీ, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం 1989, నిబంధనలు 1995 దేశవ్యాప్తంగా దళితుల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వాలను పరిరక్షించడానికి అమలులో ఉన్నాయి. అనేక అంతర్జాతీయ ఒప్పందాలలో భారతదేశం సంతకం చేసింది కూడా. కానీ దళితులపై అత్యాచారాలు పెరుగుతూనే ఉన్నాయి.

పెరుగుతున్న అత్యాచారాలు

1999 - 2000	226
2000 - 2001	452
2001 - 2002	474
2002 - 2003	268
2003 - 2004	311
2004 - 2005 (ఆగస్టు)	274

(ఆధారం : సాక్షి మోనిటర్ 2003)

పట్టిక ఆధారంగా దళితులపై జరుగుతున్న అత్యాచారాలు పెరుగుతూనే ఉన్నాయని అర్థమవుతుంది. వెలుగులోకి రానివి ఇంకెన్నో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అనేక రకాల దళిత మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి.

దళితులపై జరుగుతున్న నేరాలకు సంబంధించి దాదాపు 24 శాతం కేసులను పోలీసులు నివేదించడంలేదు. పార్లమెంటుకు, రాష్ట్ర శాసన సభలకు పోలీసులు అందిస్తున్న సమాచారం అంతా తప్పుడు సమాచారమే అని తేలింది. పోలీసుల రికార్డుల ప్రకారమే సాధారణ నేరాల శాతం 90 శాతం పెరిగాయి. దళితులపైన జరిగే నేరాలలో 19 శాతం స్వభావరీత్యా ప్రమాద భరితమైనది. పోలీసుల్లో 82శాతం దళితులు, 23 శాతం దళితేతరుల పైన అత్యాచారాలు జరుగుతున్నాయని అవి పెరుగుతున్నాయని నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి.

దేశంలో దళితులు, ఆదివాసీలు అనే పేరుతో పిలువబడే మనుషులు లక్షలాది మందికి స్వతంత్రం అన్న మాటే ఇంకా స్ఫృహ లోకి రాలేదు. నిత్య దరిద్రం, ఆకలి, అవమానాలు నిరంతరం అత్యాచారాలతో బతుకులీడుస్తున్నారు. పనులులేక పనులుంటే సరైన వేతనాలు లేక పస్తులతో బతుకుతున్నారు. అంటరానితనం వేయి రూపాల జడల దయ్యమై హింసిస్తోంటే కులం సంకెళ్ళతో బానిస బతుకులు బతుకుతున్నారు. అభివృద్ధి అన్న మాటే ఇన్నేళ్ళుగా వాళ్ళ దరిచేరలేదు. అభివృద్ధి పేరుతో, సంస్కరణల పేరుతో జరుగుతోన్న తతంగమంతా దళితులను, ఆదివాసీలను నిర్వాసితులనే చేసింది. ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న ప్రయత్నాలన్నీ దళితుల జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. సమాచార విప్లవానికి కేంద్రస్థానమని చెప్పుకుంటున్న హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల పరిధిలోని రంగారెడ్డి, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వందలాది మంది మనుషులను మంత్రగాళ్ళనే నెపంతో సజీవంగా దహనంచేసే దుర్మార్గపు మూఢ విశ్వాసాలు తాండవమాడుతున్నాయి. ఈ అమానవీయ అత్యాచారాలకి బలౌతున్న వారంతా దళిత ఆదివాసీ ప్రజలే.

దళిత ఆదివాసీలు నిల్చున్నచోట నేలే మాయమైపోతుంది. సకల అవకాశాలూ కరిగిపోతోంటే వలన వక్కులై గాలికి కొట్టుకుపోతున్నాయి దళిత జీవితాలు. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు ఆంక్షలు దళిత జీవితాలపైన ప్రభావాన్ని చూపిస్తాయి. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఉమ్మడిగా స్థిరీకరణ, వ్యవస్థాగత సర్దుబాటు అనే పథకాన్ని రచించి బడుగుదేశాల ముందుంచాయి. స్థిరీకరణ కోసం కరెన్సీ విలువను చూడక విలువకు అనుగుణంగా తగ్గించడం, దిగుమతులపైన ఆంక్షల్ని తొలగించడం చెల్లింపులు, లోటుకు మధ్యనున్న వ్యత్యాసాన్ని తొలగించడం ధరలు మారక వడ్డీరేట్లపైన అదుపును తొలగించటం, అన్ని రకాల సబ్సిడీలను తొలగించటం ఆర్థిక సంస్థల నిర్మాణాన్ని సంస్కరించి విదేశీ సంస్థలకు స్వేచ్ఛా ప్రవేశాన్ని కల్పించటం స్వతంత్ర ద్రవ్యనిధి విధానాన్ని అవలంబించడానికి కేంద్ర బ్యాంకుకు పూర్తి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడం వంటి నిర్దేశక సూత్రాలను అవి రూపొందించాయి. అదుపులేని పోటి, సమతుల్యత లేని అభివృద్ధి వలన యిప్పటికే సామాజిక అసమానతలు తీవ్రతరమయ్యాయి. దేశంలోని అత్యధిక జనాభా అయిన దళిత ఆదివాసీ ప్రజలు ఆహార భద్రతలేక ఉపాధి అవకాశాలను కోల్పోయి దిక్కులేని వారవుతున్నారు. సామాజికంగా వివక్షకు గురవుతున్న కులాలకు చెందిన వారుగా దళితులు అంటరాని తనాన్ని, ఆకలినీ, హింసను, వివక్షనీ వేల యేళ్ళుగా ఎదుర్కొంటూనే ఉన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత రాజ్యాంగం దళితుల కోసం ఎన్నో అవకాశాలను రక్షణలను కల్పించింది. దాని అమలులో ఎన్నో అవకతవకలు, నిర్లక్ష్యం ఉన్నప్పటికీ ఎంతో కొంత మేలు కూడా జరిగింది.

భవిష్యత్‌లో దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల ప్రజల మానవ హక్కులను అనుభవించడానికి, పరిరక్షించడానికి అంతిమంగా సమన్వయంతో కూడిన సమాజాన్ని సాధించుకోవడానికి మరింత శక్తితో, అవగాహనతో ఉద్యమాలు నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. దళిత హక్కుల ఉద్యమ పోరాటానికి స్ఫూర్తి బౌద్ధమతంలో ఉంది. మనుషులంతా సమానమేనని అందరికీ సమాన హక్కులు, బాధ్యతలు ఉండాలని పేర్కొన్న తొలి తత్వవేత్త గౌతమ బుద్ధుడు. గౌతమ బుద్ధుని ఆలోచనలకు అనాటి సాంఘీక పరిస్థితులే ప్రధాన ప్రేరణగా నిలిచాయి. "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అన్న నినాదం నుండి నేటి "దళిత హక్కులే మానవ హక్కులు" అనే నినాదం వరకు పిడికిళ్ళు బిగించిన దళిత ఆదివాసీ సమూహాలను మనం చూస్తున్నాం. అణగారిన ఈ మనుషుల ఐక్యతా నినాదాన్ని మనం ఆవాహనం చేసుకోవాలి. కానీ ఇక్కడ కులం గీతలు గీస్తుంది. దోపిడీ కులాలకీ - దోపిడీకి గురయ్యే కులాల మధ్యన కూడా విభజన రేఖని గీస్తుంది. కులవ్యవస్థ శ్రమ విభజన కాదు, శ్రామికుల విభజన కూడా అన్న అంబేడ్కర్ మాటలు మనం జ్ఞప్తికి ఉంచుకోవాలి. ఉమ్మడి సమస్యలపైన ఐక్యపోరాటం సాగించి హక్కుల్ని సాధించుకోగలగాలి. విభేదాలను గుర్తిస్తూ ఐక్యంగా ఉండడానికి ఐక్య నినాదాలివ్వడానికి అస్థిత్వ ఉద్యమాలు, వివిధ సంఘాలు అలవాటుపడాలి. ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న పరిణామాలు, రాజకీయాల కాషాయీకరణ, ప్రభుత్వాల దళిత వ్యతిరేకత విధానాలు, వీటన్నింటినీ దృష్టిలో వుంచుకొని దళిత కులాలు ఐక్యపోరాటాల ద్వారా ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులు సాధించుకోవాలి. అందుకోసం అధ్యయనం, ఆలోచన, ఆచరణ అంబేడ్కరిజపు వెలుగులో కొనసాగాలని ఆకాంక్షిద్దాం. ❑

సంస్కరణల నేపథ్యంలో మృగ్యమైపోతున్న దళిత సంక్షేమం!

- విద్యాభూషణ్

'సాంఘిక సంక్షేమం' అనేసరికి, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారు, మైనారిటీలు, వికలాంగులు, వృద్ధులు, జోగినులు, యాచకులు తదితర వర్గాలన్నీ వస్తాయి. జనాభారీత్యా చూస్తే వీరి శాతమే అత్యధికం. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వాలు మెజారిటీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలన్న మౌలిక నియమాన్ని మననం చేసుకుంటే, నేటి పాలకవర్గాలు సాంఘిక సంక్షేమానికే కట్టుబడి వుండాలి. కానీ సంస్కరణల పేరుతో అభివృద్ధి చెందుతున్న దేశాల సహజ వనరులను కొల్లగొట్టుకు పోవాలనుకున్న సామ్రాజ్యవాదులకు 'సామాజిక న్యాయం' అవగతమవుతుందా? కాదు. అందుకే సత్వర సామాజికాభివృద్ధికి, సంక్షేమానికి నీళ్ళొదులు కోవాలని ఆదేశిస్తారు. వారి విదిలింపులకు ఆశపడ్డ మన పాలకులు అదే ఆదేశాలకు 'నిబద్ధత'ను ప్రకటిస్తారు-ఆచరిస్తారు. కానీ దేశ రాజ్యాంగాన్నే ప్రామాణికంగా తీసుకుంటే, యావత్ ప్రజానీకానికి సమానత్వాన్ని అందివ్వాలని పేర్కొంది. వర్గసమాజంలో ఈ సమానత్వం సాధ్యంకాదు కనుక, అగ్రవర్ణాల బారి నుండి నిమ్నవర్గాలను రక్షించేందుకై 'రిజర్వేషన్ల'ను ప్రవేశపెట్టారు. అయితే ఈ రిజర్వేషన్లు ఎంతవరకు? ఎంతకాలం? అన్న ప్రశ్నకు, లక్ష్యం నెరవేరే వరకూ అన్నదే సరైన సమాధానం. ఎందుకు అంటే ప్రామాణికంగా తీసుకున్న మన రాజ్యాంగం "అందరూ ఒక్కటే. అందరికీ ఒకటే విలువ" అన్న ఉన్నతాశయాన్ని వక్కాణిస్తుంది కనుక. ఈ ఉన్నతాశయానికే తూట్లు పొడిచే పక్షంలో వివక్షతకు గురవుతున్న పీడితవర్గమంతా ప్రజాస్వామ్య పునాదుల్నే కూల్చివేస్తారని, దాదాసాహెబ్ అంబేద్కర్ ఇదివరకే హెచ్చరించాడు. నిచ్చెనను పోలివున్న మన కుల వ్యవస్థలో 'రిజర్వేషన్లు' అనివార్యం. నిమ్నవర్గాల వారి వెసులుబాటు కోసం వీటినో ప్రత్యేక అవసరంగానే చూడాలి. అంతకుమించి మరో మార్గం లేదు. రిజర్వేషన్లను ఉపేక్షిస్తే, అది అసమానతల మధ్య సమానమైన పోటీయే అవుతుంది. ఇది తగునా?

సుమారుగా ఇదే విషయాన్ని న్యాయమూర్తి చిన్నపరెడ్డి కర్నాటక మూడో వెనుకబడిన తరగతుల కమిషన్ రిపోర్టులో ఇలా పేర్కొన్నారు: "పేదరికం, నిరక్షరాస్యత, అనాగరిక వాతావరణంలో పెరుగుతున్న పేదవర్గాల వారి పిల్లలు, ప్రాథమిక సౌకర్యాలు లేని పాఠశాలల్లో చదువుకుంటూ వుంటారు. నిరక్షరాస్యులైన వీరి తల్లిదండ్రులు సరైన మార్గదర్శకత్వాన్ని అందివ్వలేరు. మరి అగ్రవర్ణాల బాలలు ప్రత్యేక శిక్షణలతో అధిక శాతం మార్కులను సాధిస్తారు. ఈ తారతమ్యాల నేపథ్యంలో 'మెరిట్'ను ఎలా ప్రమాణించగలమ"ని ప్రశ్నించారు. విద్యారంగ పరిమితుల్లోనే మెరిట్, రిజర్వేషన్లు ఓ వివాదంగా విస్తరిస్తుంటే (ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో) వదోన్నతుల లోనూ, ప్రయివేట్ రంగంలోనూ, రిజర్వేషన్లను అమలుపరుస్తామని 'రాజకీయం' మభ్య పెట్ట యోచిస్తుంది. మరోవైపుగా ఆచరణ రీత్యా సంస్కరణల లక్ష్యంగా, సంకీర్ణమవుతున్న రాజకీయ పక్షాలు ప్రభుత్వ రంగాలను ప్రయివేటీకరించేందుకై పడరాని పాట్లు పడుతుంటే, ఇందుకు సైదోడుగా వామపక్షాలు నూతన భాష్యాలకు సాహసిస్తున్నాయి. "అసలు ప్రభుత్వ బాధ్యతలనే కుదింపచేసే దిశగా ప్రభుత్వ సర్వీసులే ప్రైవేటు వరం అవుతున్నప్పుడు రిజర్వేషన్లకు స్థానమెక్కడుంటుంది? అందుకే పోటీ ప్రపంచంలో నిరవధిక రిజర్వేషన్లు సాధ్యపడవు" వంటి అవకాశవాద సూత్రీకరణలకు పాలకులు పాల్పడుతున్నారు.

సాంఘిక సంక్షేమంలోకి అనేక వర్గాల ప్రజలు వచ్చేస్తున్నా ప్రభుత్వ ఖాతాలు మాత్రం దళితులు, గిరిజనులకే పరిమిత మయ్యాయి. పీడిత ప్రజా సంక్షేమానికే కట్టుబడివున్నామని చెప్పుకొస్తున్న పాలక పార్టీల పాలనలో 'సంక్షేమం' నానాటికీ దిగజారిపోవడం కాదనలేని వాస్తవం. అందుకే అత్యంత ప్రజాస్వామిక డిమాండయిన 'జనాభా దామాషా మేరకు బడ్జెట్ కేటాయింపులు జరపాలన్నది' ఉనికిలోకి వచ్చింది. అయినా కేటాయింపులు ప్రతీ సంవత్సరానికీ క్రమానుగతంగా తగ్గిపోతూ వస్తున్నాయి. ఒక్కోసారి సంఖ్యారీత్యా కేటాయింపులు పెరిగినట్టనిపించినా, బడ్జెట్ మొత్తం రీత్యా 'నిష్పత్తి'ని చూస్తే తగ్గుదలే నమోదవుతుంది.

దళిత వర్గాల సంక్షేమం:

రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15(4), 16 (4) లు హామీనిస్తున్న ప్రతీ మనిషికీ ఒకే విలువ... ఆచరణలో అపహాస్యం పాలవుతున్న వైనం, అధునిక సమాజంలో సర్వసామాన్యమైపోతుంది. మన రాష్ట్రంలోనే అనేక పల్లెల్లో రెండు గ్లాసుల పద్ధతులు, దేవాలయాల్లోకి దళితులు ప్రవేశించారనో, అమ్మవార్లకు పూజలుచేశారనో సంఘ బహిష్కరణలు, జరిమానాలు విధించే ఫ్యూడల్ ఆటవిక న్యాయం కొనసాగుతూనే వుంది. ఇందుకు అటు హైటెక్ - ఇటు సంక్షేమ రాజ్య ప్రతినిధులూ ఆత్మవిమర్శ

చేసుకోవాల్సి వుంది. గత కాలం నుండి కొనసాగుతున్నాయి కనుక.

ప్రభుత్వ ఆధీనంలోని శాఖలన్నీ తమకు కేటాయించిన నిధుల్లో 15 శాతం ఎస్సీల అభివృద్ధికి కేటాయించాలన్నది ప్రభుత్వ ఆదేశం. కానీ గత పదేళ్లను పరిగణనలోకి తీసుకుంటే, ప్రభుత్వ శాఖలు దళిత సంక్షేమం కోసం ఖర్చు చేసింది గరిష్టంగా పది శాతానికి మించి లేదు. 1998-99 సంవత్సరంలో అయితే ఎన్నికల దృష్ట్యా ఎస్సీల సంక్షేమానికి 11.38 శాతం వెచ్చించినా, తరువాత సంవత్సరంలో 3.46 శాతానికి కోతపెట్టి, వాతలెయ్యడం జరిగింది సంక్షేమానికి. ఈ కేటాయింపుల్లో కేంద్రం అందించిన ప్రత్యేక కాంపొనెంట్ ప్రణాళికా మొత్తాలను మినహాయిస్తే, ఈ కేటాయింపులు మరింత చిక్కిపోతాయి. దళితులు ఆర్థికంగా స్వతంత్ర జీవనం గడపాలనే పాలకులు కోరుకున్న పక్షంలో, ఉచిత విద్య, వైద్య సదుపాయాలతో పాటు శ్రమించేందుకు అనువుగా భూవసతిని కల్పించాలన్న సూచనను నోబుల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్ పలుసార్లు పేర్కొన్నారు. కానీ గత పంచవర్ష ప్రణాళికలన్నీ ఈ భూసంస్కరణలమలుకు ఆమడదూరంలోనే వున్నాయి. ఇటీవల వ్యవసాయ సంక్షేమానికి కారణాలను పరిశోధించేందుకై మన రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జయతీఘోష్ నివేదిక సైతం ఈ భూసంస్కరణల అమలు విషయాన్ని ప్రస్తావించలేక పోయింది. దళితుల ఆర్థికాభివృద్ధి అంటే ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు, సామాజిక రంగంలో రేషన్ కార్డుల పంపిణీకే... ఆయా సంక్షేమ సంఘాలు పరిమితం కావడం శోచనీయం. ఇందుకు వామపక్షాలతో పాటు, విప్లవ పార్టీలు సైతం వంత పాడటం కాకతాళీయం అయితే కాదు. అమర్త్యసేన్ సూచనను ఓ డిమాండుగా చేస్తూ భూసంస్కరణల అమలుకై ఆయా కుల సంఘాలన్నీ ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అలా కానంతవరకూ, ఈ బూటకపు భూ పంపిణీ సమారాధనలు, ఉపాధి కల్పన పథకాలతో 'జో' కొట్టే ప్రయత్నాలు చోటు చేసుకుంటూనే వుంటాయి.

ఇక ఈ పాలక వర్గాల హయాంలో ఏర్పడ్డ దళిత అభివృద్ధి కార్పొరేషన్లు, మిగులు భూముల అభివృద్ధి, ఇళ్ళస్థలాలు, తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం, వారి భూములకు (ఉన్నవారికి) నీటి వసతి కల్పించుకునేందుకు ఆర్థిక సహకారం వంటి పథకాలకే పరిమితం అవుతున్నాయి. పైగా ఈ తరహా పథకాలు కేవలం ఓటు బ్యాంకును కైవసం చేసుకునేందుకే ఉపయోగపడుతున్నాయి. ఎందుకంటే ఎన్నికల ముందు ప్రకటించిన పథకాలు, హామీలు ఎన్నికలనంతరం మటుమాయం కావడం మన ముందున్న సాధారణ అనుభవం. ఇలా మాయమైపోయిన పథకాలు... చేతివృత్తుల పథకం, రిక్షా తొక్కేవారి పథకం, తోలుపనివారి పథకం, పట్టు పరుగుల పరిశ్రమ, యువత ఆర్థిక పథకం ఇలా ఎన్నో.... ఎన్నెన్నో....

ఇదే క్రమంలో దళితుల ఆర్థికాభివృద్ధికై ఏర్పర్చిన ఎస్సీ కార్పొరేషన్ అమలు సైతం. ఈ సంస్థ చేపడుతున్న అతి కొద్ది పథకాల్లో సైతం లబ్ధిదార్ల సంఖ్యను కుదించే యత్నాలు సాగుతున్నాయి. ఉదాహరణకు 1999-2000 సంవత్సరంలో భూమి కొనుగోలు పథకం కింద 16 వేలమంది లబ్ధిదార్లను నమోదు చేసి, 2002-2003 నాటికి 5,100కు కుదించారు. నిధుల కేటాయింపు 64 కోట్ల రూపాయల నుండి రూ 20 కోట్లకు దిగింది. అదేవిధంగా చిన్న నీటిపారుదల సహాయపథకం కింద 2001-02లో సుమారుగా 8వేలుగా వున్న లబ్ధిదార్లు 2002-03 నాటికి 1151 మందయ్యారు. మరోవైపు లబ్ధిదార్ల సంఖ్యను అధికంగా చూపించి ఇంతమంది లబ్ధిదార్లను ప్రోత్సహిస్తున్నామంటూ... కేటాయింపులను కుదించేసిన వైనాలూ వున్నాయి. భూ అభివృద్ధి పథకం కింద 2001-02లో 7,761 మంది లబ్ధిదార్లకూ రు.7.8 కోట్లు విడుదల చేశారు. అదే 2002-03లో ఇదే పథకం లబ్ధిదార్లను 7,946 మందిగా చూపిస్తూ కేటాయింపును రు.3.97 కోట్లకే పరిమితం చేశారు. ఇదీ దళిత సంక్షేమం పట్ల పాలకుల చిత్తశుద్ధి. ఇలాగే ఎస్సీ కార్పొరేషన్‌కు 1999-2000లో రు.210 కోట్లు కేటాయించి రు.93 కోట్లే విడుదల చేశారు. 2000-'01 సంవత్సరంలో రు.102 కోట్లు కేటాయించి రు.91 కోట్లే విడుదల. 2001-02లో రు.163 కోట్ల కేటాయింపులో రు.149 కోట్లే విడుదల. 2002-03లో కేటాయింపు రు.180 కోట్లయినా, రాష్ట్ర ప్రభుత్వ వాటాను రు.36 కోట్లకే కుదించేశారు. ఇందులో ఎన్ఎస్ఎఫ్‌సి రుణసహాయం, ఎస్‌జివిఎస్, ప్రపంచబ్యాంకు రుణం ఇలా అర్థం కాని వాటాలు... ఇదంతా లబ్ధిదార్లకు చేరని అంకెల మతలబులే తప్ప మరొకటి కాదు. ఇక కార్పొరేషన్ లబ్ధిదార్లలో నిర్దేశితుల కంటే బినామీ లబ్ధిదార్లే అధికం. అధికారం, పలుకుబడి వున్న నాయకుల కుటుంబ సభ్యులకే అనేక విడతలుగా రుణాలను కేటాయించుకున్న వైనాలు ఎన్నో వెలుగు చూశాయి.

దళిత వర్గాల విద్యా వికాసానికై ప్రభుత్వం చేస్తున్న కృషి:

ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల నిర్మాణానికే అత్యంత ప్రాముఖ్యం ఇస్తుంది. పోతే సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని సంక్షేమ హాస్టళ్ళ నిర్వహణలో మార్పు లేదు. యధావిధిగానే కొనసాగుతున్నాయి. నిర్వహణతీరును మెరుగుపర్చని ప్రభుత్వం స్వంత భవనాల ఏర్పాటు పట్ల శ్రద్ధ కనపర్చడం సంస్కరణలలోని ఓ ఎత్తుగడ గానే అనిపిస్తుంది.

ప్రభుత్వ తాత్సారానికి గురవుతున్న సంక్షేమ పథకాలు : 1, 2 తరగతుల ఉపకార వేతనలు ఐఐటి విద్యార్థుల తాత్కాలిక భృతి, పాఠ్యపుస్తకాల పంపిణీ, వసతి గృహవాసులకు బట్టల పంపిణీ వంటివి పునరుద్ధరించాల్సి వుంది. ఇవన్నీ గత హైటెక్ ప్రభుత్వ హయాంలో నిలిపివేయబడినవే. సంక్షేమశాఖ నిబంధనల్లో పేర్కొన్న తీరున భోజన వసతులనూ కల్పించడం లేదు. ఇటీవల ఈ

మెస్‌ఛార్జీల పెంపుదలకై పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే.

షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిటీ నివేదిక :

చర్వితచర్వణంగా గత అనేక కమిటీలు చెప్పిన అంశాలనే జాతీయకమీషన్ వల్లె వేసింది (2001, డిసెంబర్ 78 తేదీల్లో న్యూఢిల్లీలో జాతీయకమీషన్ సమావేశం జరిగింది). బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించింది. ఫలితం శూన్యం. పైగా ఖాళీలను తెలపడంలో విద్యాశాఖ అనుసరించిన ధోరణి పట్ల కమిటీ అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఖాళీలను వివరిస్తూ జాబితాను రూపొందించమని కమిషన్ కోరితే మన రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను రద్దు చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ ఓ సామాజిక సంస్థ కోర్టును ఆశ్రయించడం సైతం జరిగింది. ఉపాధి కల్పనా బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలగాలన్న సంస్కరణల ఆదేశంకు సానుకూలంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరే యిదంతా. ఉద్యోగుల వేతనాలకై వెచ్చిస్తున్న వ్యయం అనుత్పాదిత వ్యయంగా సంస్కరణల నియమావళి పేర్కొంటుంది. అనుత్పాదిత వ్యయ కుదింపు సంస్కరణల ప్రాథమిక నియమం. ఇందుకనువుగానే పాలకవర్గాల ఆచరణ.

బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే 2001-01లో 'సామాజిక సంక్షేమ' వ్యయం రూ.511 కోట్ల రూపాయలు. ఇది మొత్తం బడ్జెట్‌లో 2.4 శాతం. అదే 2001-02 నాటికి రు.645 కోట్ల కేటాయింపు చూపించినా, మొత్తం బడ్జెట్ మొత్తంతో పోల్చి చూస్తే 1.4 శాతం. పోనీ ఈ కేటాయించిన పూర్తి మొత్తాన్నయినా వినియోగించారా అంటే అదీ లేదు. అందులో మళ్ళీ మిగులు రు.31 కోట్లు. దారిద్ర్యరేఖ దిగువన వున్న కుటుంబాల ప్రమాద భీమా పథకానికై రు.12 కోట్లు కేటాయించి వ్యయం చేయనేలేదు. దళిత వర్గాల గృహ నిర్మాణ పథకానికై రు.5.7 కోట్లు కేటాయించి, సుమారు 25 శాతం మిగులు. దళితవాడల్లో కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం, కులాంతర వివాహాల ప్రోత్సాహానికి రు.50 లక్షలు కేటాయించి వ్యయం చేయనేలేదు. ఎస్సీ సహకార ఆర్థిక సంస్థకు రు.16.64 కోట్లు కుడిచేత్తో కేటాయించి, ఎడమ చేత్తో తీసేసుకున్నారు. ఈ తరహాలో 'సంక్షేమం' మూడు పువ్వులు - ఆరుకాయలుగా విలసిల్లుతూనే వుంది.

దళిత వర్గ జనాభా 50 శాతంపై చిలుకు దారిద్ర్య రేఖకు దిగువన జీవనం సాగిస్తున్నవారే. వీరిలో సుమారు 20 శాతం నిరక్షరాస్యులు. 70 శాతం భూవసతి లేనివారు. వ్యవసాయ కార్మికుల్లో 40 శాతం దళితులే. ఇవన్నీ పాలకులకు తెలియని విషయాలైతే కాదు. కానీ పైనున్న ప్రపంచ బ్యాంకు షరతుల్లో 'సంక్షేమం' వృధా వ్యయం కనుక 'నిర్వీర్యం' చేస్తున్న తీరే ఇది.

గిరిజన సంక్షేమం :

గిరిజన సంక్షేమానికి ప్రతీ శాఖా తమ కేటాయింపుల్లో ఆరుశాతం వెచ్చించాల్సి వుంది. కానీ పాపం గత పదేళ్ళ బడ్జెట్‌లను తిరగేస్తే, ఒక్కనాడు కూడా ఆమేరకు కేటాయింపులే జరగలేదన్నది వ్యక్తం అవుతుంది. అంతేకాదు ఏమరపాటున కేటాయించిన మొత్తాలు సైతం సక్రమనిర్వహణకు నోచుకోని దాఖలాలు వ్యక్తం అవుతాయి. ఈ కేటాయింపులు కాలక్రమేణా చిక్కిపోతున్న పయనం బహిర్గతమవుతుంది. 2000-'01 సంవత్సరంలో రు.506 కోట్ల రూపాయల కేటాయింపు 2001-'02 సంవత్సరానికి రు.333 కోట్లయింది. అంతేకాకుండా కేంద్రం గిరిజన అభివృద్ధికి వెచ్చించిన గ్రాంటులు సైతం సక్రమ వినియోగానికి నోచుకోలేదు. ఈ కారణం చేతనే 1999-2000 నుండి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు కేంద్రం నిధులను నిలిపివేసింది. ఇక గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలను అధికార్లే కైంకర్యం చేసేసిన ఘటనలు కోకొల్లలు. గిరిజన విద్యావ్యాప్తి మాటెలావున్నా... విద్యాసంస్థల ఏర్పాటుకు మాత్రం కేటాయింపులు విచిత్రం. ఏంటంటే కేటాయింపు రు.104 కోట్ల రూపాయలే అయినా వ్యయం మాత్రం రు.131 కోట్లకు చేరుకుంది. ఇదే తరహాలో గురుకుల పాఠశాలల ఏర్పాటు కేటాయింపులను మించిపోయింది. కాంట్రాక్టుల వ్యవహారం కదా! అదే గిరిజనుల ఆరోగ్య పరిరక్షణో చిన్న-మధ్య తరహా నీటి వసతి ఏర్పాటో అయితే ఇంతటి శ్రద్ధ కానరాదు. నేటికీ గిరిజనుల ఆరోగ్య పరిరక్షణ, మూలికవైద్యం - సంప్రదాయ మంత్ర తంత్రాలకే పరిమితమై వుందంటే గిరిజన సంక్షేమం పట్ల పాలకుల శ్రద్ధ వ్యక్తమైపోతుంది. ఏటా తొలకరి తొలినాళ్ళలో సంప్రదాయ విషజ్వరాలకు వేలాదిమంది బలవుతున్నా ప్రభుత్వాలు కదలి పని చేసి వైనాలు లేనేలేవు.

పైగా గిరిజనులకు చెందిన భూములను గిరిజనేతరులకు అంటగట్టేందుకు ప్రభుత్వం చేయాల్సిందంతా చేసింది. తప్పుడు అగ్రిమెంట్లను సృష్టించి వేలాది ఎకరాలను ధారాదత్తం చేసిన దాఖలాలూ వున్నాయి. తమ హక్కులకై పోరాడుతున్న వారిపై అక్రమ కేసులను బనాయించి భయభ్రాంతులను చేస్తున్నారు. నక్సలైట్లు గిరిజనులను చైతన్యవంతులను చేస్తున్నందుకు గిరిజనులను వారికి వ్యతిరేకంగా మలిచేందుకు ఉపాధి కల్పన ముసుగులో 'గిరిజన బెటాలియన్' ఏర్పాటుకు యోచిస్తుందీ ప్రభుత్వం. 1/70 చట్టాన్ని విధిగా అమలు పర్చాలని ఆదివాసీలు ఉద్యమిస్తున్నారు. మరోవైపు కమ్యూనిటీ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ పేరిట గిరిజన భూములను ప్రభుత్వం కైవసం చేసుకోచూస్తుంది.

ఈ భూములను ప్రైవేటు వ్యక్తుల కప్పగించి ఫలవృక్షాల పెంపకాన్ని చేపడుతుంది. అయితే ఈ ఫలవృక్షాల ఆదాయంలో గిరిజనులకు వాటాలను ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేస్తుంది. ఇది అమలయ్యే మాటేనా ?

గిరిజనుల పోడు వ్యయసాయంతో వాతావరణం కలుషితమై పోతుందన్న సాకుతో పోడు వ్యవసాయాన్ని నియంత్రించాలని ప్రభుత్వం యోచిస్తుంది. అనేక పనికి వచ్చే వృక్షాలను గిరిజనులు నరికేస్తున్నారని ప్రభుత్వం ఆరోపిస్తుంది. ప్రకృతి మాత బిడ్డలైన వీరు సంప్రదాయ పరంగానే, వారి జీవనోపాధికి దోహదపడుతున్న పలుచెట్లను నరకరు. తేనె పట్టులు పెరిగేందుకు అనువైనవి, వారి నిత్యావసరాలకు అనువైన ఫల వృక్షాలను, కల్లు తయారీకి అనువైన జీలుగు-ఇప్ప వంటి చెట్లను విస్తారంగా పెంచే కృషి చేస్తారు. అయితే గిరిజనులను ఊరి జనాలుగా తరలించేసి, గిరిజన ప్రాంతాల్లో వున్న అపార ఖనిజ సంపదను విదేశీ సంస్థలకు అప్పగించేసే యోచనలో ప్రభుత్వం వుంది. ఈ ప్రయత్నం సానుకూలం కావాలంటే ఏదో ఓ మిషతో గిరిజనులను తరలించెయ్యాలి. అందుకే ఆదివాసీ బిల్లు - 2005 ను రూపొందించి, విద్య - ఆరోగ్యం, ఉపాధి వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి పోకుండా అరచేతిలో స్వర్గం చూపించింది ఇందుకోసమేనన్నది గుర్తెరగాల్సి వుంది.

గిరిజన సంక్షేమ బడ్జెట్లూ అంతే. గిరిజనులకు కేటాయిస్తున్న మొత్తం, మొత్తం బడ్జెట్ కేటాయింపులో 0.73 శాతం. అంటే పూర్తిగా ఒక శాతం కూడా కాదన్న మాట. 2000-01 సంవత్సరంలో వీరి సంక్షేమానికి కేటాయించిన మొత్తాల్లో 68 కోట్ల రూపాయలను ఎలా వెచ్చించాలో తెలియక సరెండర్ చేసేసిన వైనం వుంది. అదే 2001-02లో రు.15 కోట్ల పెట్టుబడి ఖాతాలో రు.10కోట్ల వ్యయం చేశారు. రుణాల పంపిణీ పేరిట రు.1535 లక్షలను కేటాయించి రు.20179 లక్షలను వ్యయం... అదే .... ఆర్థికాభివృద్ధికి వచ్చేసరికి 3806 లక్షల కేటాయింపులో రు.1348 లక్షల కోత. ఆశ్రమ పాఠశాలలకై రు.10 కోట్లు కేటాయించి రు.3 కోట్లు కోత... మిగతా రు.7 కోట్లలో రు.1 కోటి మిగులు... వెరసి రు.10 కోట్లకు రు.6 కోట్ల వ్యయం. ఇలా తికమక వ్యవహారంగా వుంటుంది గిరిజన సంక్షేమం.

ఎన్ని విధాలుగా మనం పరిశీలించినా 'సంక్షేమ వ్యయం' అనుత్పాదిత వ్యయంగా ప్రపంచ బ్యాంకు తేల్చినందున సంక్షేమ వ్యయభారాన్ని కుదించే దిశగా ఈ పాలకులు వర్తిస్తారన్నది అనుభవ సారాంశం. తమ హక్కులను రక్షించుకునే లక్ష్య దిశగా పీడితులు కదిలిన పక్షాన వారి హక్కులతో పాటు సంక్షేమం నిలుస్తుంది. బతికి బట్ట కట్టగలుగుతుంది. ❑

సంస్మరణ
ఆలిస్ థార్నర్

భారత సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థను అధ్యయనం చేసే విద్యార్థులెవరయినా విస్మరించడానికి వీలులేని పేరు ఆలిస్ థార్నర్. ప్రత్యేకించి భారత దేశంలో భూసంస్కరణల గురించి, మారుతున్న వ్యవసాయ సంబంధాల గురించి ఆమె, ఆమె సహచరుడు డానియెల్ థార్నర్ చేసిన పరిశోధనలు, విశ్లేషణలు కనీసం రెండు తరాల రాజకీయార్థశాస్త్ర విద్యార్థులకు మార్గదర్శకాలుగా పనిచేశాయి. భారత రైల్వేల మీద 1939లో డానియెల్ పరిశోధన ప్రారంభించినప్పుడు ఆలిస్‌కు కూడ భారత సామాజిక పరిణామాల మీద ఆసక్తి ప్రారంభమైంది. అమెరికాలో కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదం చెలరేగుతున్నప్పుడు, డానియెల్‌ను విచారణకు పిలవడంతో వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించి దంపతులిద్దరూ 1952లో భారతదేశం వచ్చారు. మొదటి రెండు పంచవర్ష ప్రణాళికలను, భూ సంస్కరణలను అధ్యయనం చేయడం ప్రారంభించారు. 1962లో లాండ్ అండ్ లేబర్ ఇన్ ఇండియా అనే సుప్రసిద్ధ గ్రంథం రచించారు. ఆ తర్వాత వారు పారిస్‌లో జీవితాన్ని కొనసాగించినప్పటికీ భారత దేశం గురించి రాస్తూ, ఆలోచిస్తూ, చర్చిస్తూ వచ్చారు. భారతదేశంలో ఉత్పత్తి విధానం ఏమిటనే విషయంలో 1960ల చివర ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో జరిగిన చర్చలో ఇద్దరూ ప్రధాన భాగస్వామ్యం వహించారు. డానియెల్ 1974లో మరణించగా, ఆలిస్ ఆ కృషిని కొనసాగించారు. 'అర్ధ భూస్వామ్యమా? పెట్టుబడిదారీ విధానమా?' అనే శీర్షికతో ఆలిస్ 1982లో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఆ చర్చనంతా ఒక సుదీర్ఘ వ్యాసంలో మూడు సంచికల పాటు పునరావలోకనం చేశారు. ఆరు దశాబ్దాల పాటు నిరంతరాయంగా భారత రాజకీయార్థిక వ్యవస్థను అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ వచ్చిన భారత ప్రజల మిత్రురాలు ఆలిస్ థార్నర్ తన ఎనభై ఏడవ ఏట 2005 ఆగస్టు 24న పారిస్‌లో మరణించారు. ఆమె అధ్యయన స్ఫూర్తికి, ఆమె స్మృతికి **'వీక్షణం'** వినమ్రంగా జోహార్లు తెలుపుతోంది.

ఈ భూములను ప్రైవేటు వ్యక్తుల కప్పగించి ఫలవృక్షాల పెంపకాన్ని చేపడుతుంది. అయితే ఈ ఫలవృక్షాల ఆదాయంలో గిరిజనులకు వాటాలను ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేస్తుంది. ఇది అమలయ్యే మాటేనా ?

గిరిజనుల పోడు వ్యయసాయంతో వాతావరణం కలుషితమై పోతుందన్న సాకుతో పోడు వ్యవసాయాన్ని నియంత్రించాలని ప్రభుత్వం యోచిస్తుంది. అనేక పనికి వచ్చే వృక్షాలను గిరిజనులు నరికేస్తున్నారని ప్రభుత్వం ఆరోపిస్తుంది. ప్రకృతి మాత బిడ్డలైన వీరు సంప్రదాయ పరంగానే, వారి జీవనోపాధికి దోహదపడుతున్న పలుచెట్లను నరకరు. తేనె పట్టులు పెరిగేందుకు అనువైనవి, వారి నిత్యావసరాలకు అనువైన ఫల వృక్షాలను, కల్లు తయారీకి అనువైన జీలుగు-ఇప్ప వంటి చెట్లను విస్తారంగా పెంచే కృషి చేస్తారు. అయితే గిరిజనులను ఊరి జనాలుగా తరలించేసి, గిరిజన ప్రాంతాల్లో వున్న అపార ఖనిజ సంపదను విదేశీ సంస్థలకు అప్పగించేసే యోచనలో ప్రభుత్వం వుంది. ఈ ప్రయత్నం సానుకూలం కావాలంటే ఏదో ఓ మిషతో గిరిజనులను తరలించెయ్యాలి. అందుకే ఆదివాసీ బిల్లు - 2005 ను రూపొందించి, విద్య - ఆరోగ్యం, ఉపాధి వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి పోకుండా అరచేతిలో స్వర్గం చూపించింది ఇందుకోసమేనన్నది గుర్తెరగాల్సి వుంది.

గిరిజన సంక్షేమ బడ్జెట్లూ అంతే. గిరిజనులకు కేటాయిస్తున్న మొత్తం, మొత్తం బడ్జెట్ కేటాయింపులో 0.73 శాతం. అంటే పూర్తిగా ఒక శాతం కూడా కాదన్న మాట. 2000-01 సంవత్సరంలో వీరి సంక్షేమానికి కేటాయించిన మొత్తాల్లో 68 కోట్ల రూపాయలను ఎలా వెచ్చించాలో తెలియక సరెండర్ చేసేసిన వైనం వుంది. అదే 2001-02లో రు.15 కోట్ల పెట్టుబడి ఖాతాలో రు.10కోట్ల వ్యయం చేశారు. రుణాల పంపిణీ పేరిట రు.1535 లక్షలను కేటాయించి రు.20179 లక్షలను వ్యయం... అదే .... ఆర్థికాభివృద్ధికి వచ్చేసరికి 3806 లక్షల కేటాయింపులో రు.1348 లక్షల కోత. ఆశ్రమ పాఠశాలలకై రు.10 కోట్లు కేటాయించి రు.3 కోట్లు కోత... మిగతా రు.7 కోట్లలో రు.1 కోటి మిగులు... వెరసి రు.10 కోట్లకు రు.6 కోట్ల వ్యయం. ఇలా తికమక వ్యవహారంగా వుంటుంది గిరిజన సంక్షేమం.

ఎన్ని విధాలుగా మనం పరిశీలించినా 'సంక్షేమ వ్యయం' అనుత్పాదిత వ్యయంగా ప్రపంచ బ్యాంకు తేల్చినందున సంక్షేమ వ్యయభారాన్ని కుదించే దిశగా ఈ పాలకులు వర్తిస్తారన్నది అనుభవ సారాంశం. తమ హక్కులను రక్షించుకునే లక్ష్య దిశగా పీడితులు కదిలిన పక్షాన వారి హక్కులతో పాటు సంక్షేమం నిలుస్తుంది. బతికి బట్ట కట్టగలుగుతుంది.

❑

సంస్మరణ ఆలిస్ థార్నర్

భారత సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థను అధ్యయనం చేసే విద్యార్థులెవరయినా విస్మరించడానికి వీలులేని పేరు ఆలిస్ థార్నర్. ప్రత్యేకించి భారత దేశంలో భూసంస్కరణల గురించి, మారుతున్న వ్యవసాయ సంబంధాల గురించి ఆమె, ఆమె సహచరుడు డానియెల్ థార్నర్ చేసిన పరిశోధనలు, విశ్లేషణలు కనీసం రెండు తరాల రాజకీయార్థశాస్త్ర విద్యార్థులకు మార్గదర్శకాలుగా పనిచేశాయి. భారత రైల్వేల మీద 1939లో డానియెల్ పరిశోధన ప్రారంభించినప్పుడు ఆలిస్‌కు కూడ భారత సామాజిక పరిణామాల మీద ఆసక్తి ప్రారంభమైంది. అమెరికాలో కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదం చెలరేగుతున్నప్పుడు, డానియెల్‌ను విచారణకు పిలవడంతో వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించి దంపతులిద్దరూ 1952లో భారతదేశం వచ్చారు. మొదటి రెండు పంచవర్ష ప్రణాళికలను, భూ సంస్కరణలను అధ్యయనం చేయడం ప్రారంభించారు. 1962లో లాండ్ అండ్ లేబర్ ఇన్ ఇండియా అనే సుప్రసిద్ధ గ్రంథం రచించారు. ఆ తర్వాత వారు పారిస్‌లో జీవితాన్ని కొనసాగించినప్పటికీ భారత దేశం గురించి రాస్తూ, ఆలోచిస్తూ, చర్చిస్తూ వచ్చారు. భారతదేశంలో ఉత్పత్తి విధానం ఏమిటనే విషయంలో 1960ల చివర ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో జరిగిన చర్చలో ఇద్దరూ ప్రధాన భాగస్వామ్యం వహించారు. డానియెల్ 1974లో మరణించగా, ఆలిస్ ఆ కృషిని కొనసాగించారు. 'అర్థ భూస్వామ్యమా? పెట్టుబడిదారీ విధానమా?' అనే శీర్షికతో ఆలిస్ 1982లో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఆ చర్చనంతా ఒక సుదీర్ఘ వ్యాసంలో మూడు సంచికల పాటు పునరావలోకనం చేశారు. ఆరు దశాబ్దాల పాటు నిరంతరాయంగా భారత రాజకీయార్థిక వ్యవస్థను అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ వచ్చిన భారత ప్రజల మిత్రురాలు ఆలిస్ థార్నర్ తన ఎనభై ఏడవ ఏట 2005 ఆగస్టు 24న పారిస్‌లో మరణించారు. ఆమె అధ్యయన స్ఫూర్తికి, ఆమె స్మృతికి **'వీక్షణం'** వినమ్రంగా జోహార్లు తెలుపుతోంది.

ఒరిస్సా నీటి వనరులపై బహుళజాతి సంస్థల పెత్తనం

- రాజేంద్ర సారంగి

(జలంధర్‌లో సెప్టెంబర్‌లో ఈనెల 9-11 తేదీలలో జరిగిన రెండవ అఖిల భారత రైతు కూలీ సంఘం సమావేశంలో ఒరిస్సాలో లోక పాక్యా అనే ప్రజా సేవా సంస్థ నాయకుడు రాజేంద్ర సారంగి 'భారతదేశ నీరు - విత్తనాలపై సామ్రాజ్యవాదుల కుట్ర' అనే పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో కూడా ఇటువంటి పరిణామాలకు ఘంటికలు వినపడుతున్న దృష్ట్యా ఒరిస్సా రాష్ట్ర అనుభవాలను, ఆందోళనలను తెలియచేసే ఈ పత్రాన్ని సంక్షిప్తంగా పాఠకులకు అందచేస్తున్నాం. - సం.)

పంట పొలాలకు నీరు లభించక, తాగడానికి నీరు దొరకక రైతులు, ప్రజలు తల్లడిల్లిపోతుంటే దేశంలో ఇంకా 60% పొలాలకు నీరే అందకుండా వుండగా, కేంద్ర ప్రభుత్వం నీటి వనరులన్నింటినీ మార్కెట్‌లో పెట్టి అమ్మజూపుతోంది. నీటి వినియోగదారుల సమాఖ్యల నేర్పాటు చేసి అన్ని నీటి వనరుల యాజమాన్యాన్నీ, నీటితీరువా వసూళ్ళను ఆ సమాఖ్యలకు అప్పజెప్పి ప్రభుత్వం చేతులు కడిగేసుకోజూస్తుంది. భారీ ప్రాజెక్టులను కార్పొరేట్ రంగానికి ధారాదత్తం చేయటానికి ప్రణాళికలు రచిస్తోంది. 1998లోనే ప్రపంచ బ్యాంక్ నీటి విధాన పత్రాన్నొకదానిని రూపొందించి దానిని అమలు చేయాలని ఆదేశించిన ఫలితంగా ఈ మార్పు చోటు చేసుకుంది. ప్రజల బ్రతుకులు, వ్యవసాయ భవిష్యత్తు అంతా కార్పొరేట్ రంగం దయాదాక్షిణ్యాలకు వదిలేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కొనుక్కోగలిగిన వాళ్ళకే నీరు. బీదాబిక్కీ జనానికి ఇంతే సంగతులు.

ప్రపంచ బ్యాంకు నీటి విధాన పత్రాన్ని రూపొందించి భారత ప్రభుత్వానికి అందజేయడమే కాక అమలుపరచడంలో ఏ పని వెంటనే చేయాలో కూడా నిర్దేశించింది. నీటి వినియోగదారుల సంఘాల ఏర్పాటు, రైతు-ప్రభుత్వ ఉమ్మడి ఏర్పాటు, స్వల్పకాలంలో ఏర్పాటు చేయాలట. వెంటనే కానీ, స్వల్పకాలంలో గానీ నీటి తీరువా రేట్లు పెంచాలని విద్యున్మండళ్ళను మూడు ముక్కలు చేసినట్లు , నీటి పారుదల శాఖను, డిజైన్, నిర్మాణం, పర్యవేక్షణ, నిధుల సేకరణ విభాగాలుగా విడగొట్టడం, ప్రయివేట్ రంగాన్ని ఆహ్వానించడం, రుణసౌకర్యం ఏర్పాటు చేయడం, మధ్యంతర కాలంలో పూర్తి చేయాలట. ప్రాంతాలవారీగా నీటి సేవా సంఘాలను ఏర్పాటు చేసి, ఆ ప్రాంతంలో నీటి యాజమాన్య బాధ్యతలనంతా ఆ సంఘాలకు అప్పజెప్పాలట. ఈ కార్యక్రమం అంతా ఆచరణలో ఎలా జరుగుతుందో ఒరిస్సా రాష్ట్రాన్ని తీసుకొని చూద్దాం. నీటి వినియోగదారుల సంఘాలకు ఒరిస్సాలో 'పానీ పంచాయతీ' అని నామకరణం చేశారు. గ్రామ స్థాయిలో కాలువ నిర్వహణ, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల బాధ్యత 'పానీ పంచాయతీ'లకు అప్పజెప్పడం జరుగుతుంది. ప్రభుత్వ వ్యూహరచన ఇలా వుంటుంది:

1. మొదట కాల్వల నిర్వహణ, నీటి పంపకం, గ్రామస్థాయిలో వచ్చే సమస్యల పరిష్కారం బాధ్యత అప్పగింత.
2. రైతులు తమ సమస్యలతో ప్రభుత్వాన్ని వేధించకుండా 'పానీ పంచాయతీ'లను బఫర్‌గా వినియోగించడం.
3. నీటి తీరువా పెంపుదలకు రైతులకు ఒప్పించడం.
4. నీటి తీరువా వసూలు.
5. ప్రభుత్వ నీటిపారుదల వ్యవస్థను ఉపసంహరించడం.

ఈ నిర్మాణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో కొన్ని అనుభవాలు ఎదురయ్యాయి.

1. వంచాయతీ అధ్యక్ష కార్యదర్శులుగా గ్రామాల్లోని కాంట్రాక్టర్లు, మధ్య దళారీలు స్థానాలు ఆక్రమించారు. చేయాల్సిన పనులను తామే కాంట్రాక్టులు చేసుకొని జేబులు నింపుకున్నారు. ప్రభుత్వం ఈ పనులు చేయడానికి హెక్టారుకు రూ. 100 చొప్పున పంచాయతీలకు నిధులను అందజేస్తుంది. కాల్వలు బాగా వున్నప్పుడు, నీరు మామూలుగా పారుతున్నప్పుడు రైతులు నీరడిగితే అధ్యక్ష కార్యదర్శులు, స్థానిక నీటిపారుదల శాఖాధికారులతో కుమ్మక్కై ఎక్కడో గండి పడిందని అబద్ధమాడి నీటి సరఫరాను నిలిపివేయడం జరుగుతుంది.

2. ఎత్తిపోతల పథకాలను నడిపించడంలో ఎప్పుడైనా మోటర్లు చెడిపోతే ఏం చేయాలో పంచాయతీలకు తెలియదు. ఏం చేయాలో కలెక్టర్లు మాకు చెప్పలేదని జవాబు. ఎక్కడ రిపేర్లు చేయించుకోవాలి అన్న విషయం కూడా వారికి తెలియదు. పూర్తిగా చెడిపోతే రు.50000 ఖర్చు చేసి రైతు మోటరు కొనుక్కోగలడా అంటే జవాబు లేదు. అధ్యక్ష, కార్యదర్శులు రైతుల విశ్వాసాన్ని పొందలేక పోతున్నారు.

3. పాలకులు ఈ 'పానీ పంచాయతీ' ల విషయంలో ఎంత మొండి పట్టుదలతో వున్నారంటే, ప్రపంచ బ్యాంకు షరతులనంగీకరించిన తర్వాత తప్పుతుందా మరి! వాటిని వెంటనే ఏర్పాటు చేయకపోతే వ్యవసాయానికి ప్రభుత్వం ఇచ్చే సహాయాన్ని బంద్ చేస్తామని హెచ్చరించేవరకు పోయింది.

4. 'పానీ పంచాయతీ' భవనాలు నిర్మించుకోవడానికి రూ. 50000 సహాయం చేస్తామని ఎర వేసి ఈ పంచాయతీలు త్వరగా ఏర్పాటు కావడానికి ప్రభుత్వం సిద్ధపడింది.

మొత్తం మీద ప్రభుత్వానికి 'పానీ పంచాయతీ'ల పిచ్చి పట్టింది. ఎంత త్వరగా వాటి ఏర్పాటు చేద్దామా, ఎలా ఈ బాధ్యతను

వదిలించుకుందామా అనే ధ్యాస తప్ప మరొకటి లేదు. ఈ కార్యక్రమం అంతటిలో విశేషమైన విషయం ఏమంటే భూమి లేని పేదలకు నీరు అడిగే హక్కు లేదు. నీరు కావాలంటే నంపన్నులు ఏమి, ఎంత నిర్ణయిస్తే అంత చెల్లించి నీరు కొనుక్కోవాలి. అది కొనుక్కొనే వస్తువు అయిపోయింది కాబట్టి నీరు అవసరమైన పరిశ్రమలు, అవసరమైతే వ్యవసాయానికి కూడా నీరందకుండా హెచ్చు మొత్తం చెల్లించి నీటిపైన యాజమాన్యాన్ని పొందవచ్చు. ప్రభుత్వ ఉద్దేశ్యం స్పష్టం. కాల్వలో నీటిపై పూర్తి యాజమాన్యం 'పానీ పంచాయతీ'లది కాబోలు. ఆ కాల్వకు నీరు పారించే ప్రాజెక్టులు, డ్యామ్‌లు, రిజర్వాయర్లు అన్నీ ప్రయివేటీకరించబడతాయి. వాళ్ళ దగ్గరనుంచి బహుళ జాతి సంస్థలు యాజమాన్య హక్కును కొనేస్తాయి. ఆ సంస్థలు నీటి ఛార్జీలు ఎంత మేరకైనా పెంచుకోవచ్చు. ఎందుచేతనంటే నీరు వాళ్ళ ఆస్తి. ఎవరు ఎక్కువ ఛార్జీలు చెల్లిస్తే వాళ్ళకే నీరు వెళ్ళుతుంది. ఉదాహరణకు సంబల్‌పూర్‌లో హీరాకుడ్ డ్యామ్ వద్ద స్థాపించుకున్న స్పాంజ ఐరన్ కర్మాగారానికి రోజుకు 350 క్యూసెక్కుల నీటిని ఒరిస్సా ప్రభుత్వం కేటాయించింది. ఒక క్యూసెక్ నీటితో 200 ఎకరాల భూమిని సాగుచేయవచ్చు. అంటే 70000 ఎకరాలు సాగయ్యే నీటిని ఒకే ఒక్క స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీకి సరఫరా చేస్తారన్నమాట. మరో 48 అలాంటి ఫ్యాక్టరీలు ఆ ప్రాంతంలోనే నిర్మాణం జరగనున్నాయి. ఒరిస్సాలో నిర్మించబోయే 'పోస్‌కో' ఉక్కు కర్మాగారానికి మొత్తం మహానది డెల్టా ప్రాంతంలో సగం ప్రాంతానికి, అలాగే కటక్ నగరానికి ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు అవసరమవుతుంది. అంటే డ్యామ్‌లు, రిజర్వాయర్ల నీరు ఈ కర్మాగారాలకు తరలిస్తే రైతు చేసుకునే వ్యవసాయానికి నీరెక్కడ లభిస్తుంది?

2100 కిలోవాట్ల విద్యుదుత్పత్తి చేసే మినీ జలవిద్యుత్ ప్రాజెక్టులను ప్రయివేట్ సంస్థలకు అమ్మివేయడానికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాటిని కొనుక్కున్న వారు వాటిని ఇతరులకు (అంటే బహుళజాతి సంస్థలేనని వేరే చెప్పనవసరం లేదు) అమ్ముకునే హక్కునిచ్చింది. అలా చేతులు మారి బహుళ జాతి సంస్థల ఆధీనంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టులకు నీరందించే డ్యామ్‌లు, ఆ డ్యామ్‌లలో నీటి మీద అధికారం కావాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం కాదనలేదు. అంటే కాల్వలు కూడా వారి యాజమాన్యంలోకి వెళ్ళిపోతాయి. రైతుల గతేం కాను? ఇది చాలదన్నట్లు 25 మధ్యతరహా నీటి ప్రాజెక్టుల యాజమాన్యాన్ని ప్రయివేట్ రంగానికి ఇచ్చి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రపంచంలో ఏ దేశంలో అయితే ప్రపంచంలోకెల్లా అతి పెద్ద నీటి కంపెనీలు వున్నాయో ఆ ఫ్రాన్స్ దేశం ఒరిస్సా ప్రభుత్వంతో నదీ పరీవాహక యాజమాన్యంలో సహకరించడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందుకవసరమైన నిధులను అందజేయడానికి ప్రపంచ బ్యాంక్ సంసిద్ధతను ప్రకటించింది.

ప్రపంచ బ్యాంక్ షరతులను పొందుపరచే విధంగా ఒక నీటి విధాన పత్రాన్ని ఒరిస్సా ప్రభుత్వం రూపొందిస్తుంది. దాని చిత్తు ప్రతి అప్పుడే తయారైంది. దాని ప్రకారం 'పానీ పంచాయతీ'లు, కార్పొరేషన్లు (అంటే ప్రయివేట్ కంపెనీలు) కొన్ని ప్రభుత్వ సంస్థలు కలసి నీటి యాజమాన్య బాధ్యతలను నెరవేరుస్తాయి. అభివృద్ధికి తోడ్పడే ఆర్థిక కార్యకలాపాలకు అవసరమయ్యే నీటిని సరఫరా చేయడం, నీటి విధాన లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వం చెప్తుంది. ఆర్థికాభివృద్ధి అంటే ప్రస్తుత ప్రభుత్వ దృష్టిలో భారీ పరిశ్రమలు, ఖనిజాధార పరిశ్రమల ఏర్పాటు. గ్రామాలలో నివసించే లక్షలాది సాధారణ ప్రజలకు పనికి వచ్చే ఆర్థిక కార్యకలాపాలు, గ్రామీణ పరిశ్రమలు కాదు. ఇలాంటి విధానంలో నీరు పల్లమెరుగు అన్నట్లు నీరు పరిశ్రమలకే పట్టణాలకే ప్రవహింపచేస్తుంది. మొత్తం రాష్ట్రాభివృద్ధి అని కాకుండా అత్యధిక ప్రజానీకం ఆర్థికాభివృద్ధి అనేది ఫోకస్‌గా వుండాలి. నీటి విధానం ప్రయివేట్ రంగానికి లాభాలు సంపాదించి పెట్టేదిగా వుండరాదు. కానీ కార్పొరేట్లకు భారీ ప్రాజెక్టుల యాజమాన్య బాధ్యతలిస్తే అదే జరుగుతుంది. నీటిని సమర్థంగా ఉపయోగించాలి అని విధాన పత్రం అనటంలో ఉద్దేశ్యం ఏంటి అని చూస్తే నీటి మీద పెత్తనం చెలాయించబోయే కార్పొరేట్ల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడమే అవుతుంది. ప్రభుత్వ ప్రయివేట్ రంగ దృష్టిలో వ్యవసాయానికి నీరు అంటే సమర్థవంతంగా ఉపయోగించడం కాదు. నీటి పంపకం విషయంలో ఏఏ కార్యకలాపాలకు ముందస్తు ప్రాధాన్యత ఇవ్వాలో అనే విషయాన్ని విధాన పత్రం ప్రస్తావిస్తూ 1. తాగునీరు 2. వ్యవసాయానికి నీటి పారుదల 3. జలవిద్యుత్ ఉత్పత్తి 4. పర్యావరణం 5. వ్యవసాయాధారిత, వ్యవసాయేతర పరిశ్రమలు, 6. జల రవాణా మార్గం. ఇవే ప్రాధాన్యతలోని ఒకపక్క చెబుతూ రెండోపక్క, తాగునీటికి తప్ప మిగతా వాటి ప్రాధాన్యతలను సవరించవచ్చునని చెప్పుతుంది. తాగునీటికి ప్రాధాన్యత ఎట్టి పరిస్థితులలోను మార్చబోమని చెప్పటం బాగానే వుంది కానీ, తాగునీటిని కొనుక్కోవలసిన నిర్ణయంలో ఆ బాగు వోగయిపోతుంది. ఎరువులు, పురుగు మందులు వాడే వ్యవసాయ విధానంలో అలాగే పట్టణాల మురుగునీటితో జల కాలుష్యం అవుతుంటే నీటి స్వచ్ఛత, నాణ్యత ఎలా సాధ్యం? ప్రాంతీయ నీటి కార్పొరేషన్లకు బహుళజాతి సంస్థల ప్రతినిధులే యాజమాన్య బాధ్యత వహిస్తారు కాబట్టి ఒరిస్సా పౌరులు ఈ సంస్థల పరిపాలన క్రిందకు వస్తారు. కానీ రాష్ట్రప్రభుత్వానికి కాదు. మొత్తం మీద చూస్తే ఈవిధానంలో నీటికి పూర్తి యూజర్ ఛార్జీలు చెల్లించాలి. నీటికి ఒక మార్కెట్ తయారవుతుంది. నీటిమీద ప్రయివేట్ రంగానికిచ్చే హక్కుకు చట్టపరమైన రక్షణ వుంటుంది. ఈ విధానం ఒరిస్సా ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకం. ప్రజలు దాన్ని తిరస్కరించాలి.

(సంక్షిప్త, స్వేచ్ఛానువాదం: వి.హనుమంతరావు) ❑

సెప్టెంబర్ 17 - తెలంగాణ చరిత్రలో కీలక ఘట్టం

- ఎం. కోదండరామ్

హైదరాబాద్‌ను భారత సైన్యం 1948 సెప్టెంబర్ 17 నాడు భారతదేశంలో విలీనం చేసింది. నిరంకుశమైన నిజాం పాలన అంతం కావాలని కోరుకున్నారు కనుక ఆ దినాన్ని ప్రజలు పండుగగానే జరుపుకున్నారు. విముక్తి దినంగా తెలంగాణా చరిత్రలో అత్యంత కీలకమైన దినంగాను పరిగణిస్తున్నారు. అయితే విముక్తిదినంగా అధికారికంగా ప్రభుత్వం ఏనాడూ నిర్వహించలేదు.

సెప్టెంబర్ 17ను విముక్తిదినంగా కనుక జరుపుకోగలిగితే ఈ ప్రాంత చరిత్ర సక్రమంగా గ్రంథస్తమయ్యేది. వెలుగులోకి వచ్చేది. తెలంగాణా కోస్తాంధ్ర మాదిరిగా ఏనాడూ పరాయి పాలనలో లేదు. బ్రిటిష్ పాలకుల అధీనంలో లేదు. నిజాం రాజు ఈ ప్రాంతాన్ని స్వతంత్రంగానే పాలించాడు. ఈవిధంగా బ్రిటిష్ పాలనలో లేని ప్రాంతాలు హైదరాబాద్ గాక మరెన్నో వున్నాయి. అనాడు దేశంలో మొత్తం మీద అయిదింట రెండు భాగాలు సంస్థానాధీశుల అధీనంలో వున్నాయి.

ఈ రాష్ట్రాలలో జాతీయోద్యమాన్ని విస్తరించకూడదని నాగపూర్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తీర్మానించింది. అయితే 1920లో చెలరేగిన సహాయ నిరాకరణోద్యమంతో ఉత్తేజితులైన సంస్థానాల ప్రజలు కాంగ్రెస్‌తో సంబంధం లేకుండానే ఈ ప్రాంతాలలో ఉద్యమాలను పెంపొందించారు. 1935 తర్వాత సంస్థానాలలో ఉద్యమం ఊపందుకుంది. ఎందుకంటే భారతప్రభుత్వ చట్టం (1935) ప్రకారం బ్రిటిష్ పాలిత ప్రాంతాలలో ఎన్నికలకు అవకాశం వచ్చింది. బ్రిటిష్ పాలిత ప్రాంతంలోని రాష్ట్రాలన్నింటిలో 1936లో ఎన్నికలు జరిగాయి. ప్రాతినిధ్య ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినాయి. ఆ పరిణామాలను చూసిన సంస్థానాల ప్రజలు తమ సంస్థానాలలోను ఎన్నికలు జరిపి ప్రాతినిధ్య ప్రభుత్వాలను నెలకొల్పాలని ఉద్యమాలను తీవ్రతరం చేశారు. అయితే సంస్థానాలలో రాజకీయ స్వేచ్ఛ లేకపోవడం వలన ఈ ఉద్యమాలు కొనసాగడం కష్టమయింది. తీవ్రమైన నిర్బంధాన్ని చవిచూశాయి. అయినా కాంగ్రెస్ పార్టీ ఆనాటి సంస్థానాలలోని ఉద్యమాలకు చేయూత నివ్వలేకపోయింది.

తెలంగాణాలో 1921లో ఏర్పడిన ఆంధ్ర జనసంఘంలోని రాజకీయ కార్యకలాపాలు మొదలయ్యాయి. అదే తరువాత ఆంధ్ర మహాసభ అయింది. 1946 దాకా అన్ని రాజకీయ కార్యకలాపాలను ఈ సంస్థ ద్వారానే నిర్వహించారు. అయితే ఈలోగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడింది. 1938లో ఏర్పడిన హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జన్మ పొందకమునుపే నిషేధానికి లోనయింది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పాటుకు పిలువబడిన సదస్సు జరుగకమునుపే ఆ పార్టీని ప్రభుత్వం నిషేధించింది. ఆ పరిస్థితులలో కొద్దిమంది సభ్యులు పార్టీ ఏర్పాటైనట్లుగా ప్రకటించారు. నిషేధాన్ని ఎత్తివేయాలని సత్యాగ్రహాన్ని చేశారు. అయితే ప్రభుత్వం వాళ్ళను వెంటనే అరెస్ట్ చేసింది. ఆవిధంగా నెలరోజుల పాటు రోజుకు ఒక బ్యాచ్ చొప్పున సత్యాగ్రహం చేశారు. ఏరోజు బ్యాచ్‌ని ప్రభుత్వం ఆరోజే అరెస్ట్ చేసింది. నెల తరువాత ఆ సత్యాగ్రహాన్ని జాతీయ నాయకుల సలహా మేరకు ఉపసంహరించుకున్నారు. నిషేధం వలన, అరెస్టుల వలన పార్టీ నిర్మాణం జరగనేలేదు. కాంగ్రెస్ కొంతమంది వ్యక్తుల పార్టీగానే మిగిలిపోయింది. 1946లో ప్రభుత్వ పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసేవరకు ఆ పార్టీ ఎటువంటి కార్యక్రమాలను తీసుకోలేకపోయింది. ఒకరిద్దరు వ్యక్తులు ప్రధానంగా స్వామి రామానందతీర్థ వంటి వారు అప్పుడప్పుడు ప్రకటనలు ఇవ్వడం మినహాయించి ఇంక ఎటువంటి కార్యక్రమాలు జరుగలేదు. పైన చెప్పినట్లు ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు సాగినవి. తదనంతరం కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు కావడం, ఆ పార్టీ సాయుధ పోరాటానికి పూనుకోవడం అందరికీ తెలిసిన విషయమే. ఈ మొత్తం క్రమంలో జాతీయ కాంగ్రెస్ పార్టీకి హైదరాబాద్ రాష్ట్ర రాజకీయాలతో ఎటువంటి ప్రమేయం లేదు.

జాతీయ కాంగ్రెస్ సంస్థానాలలోని ప్రజా ఉద్యమాల సమాఖ్యగా 1927లో రూపొందిన అఖిల భారత సంస్థానాల ప్రజా వేదిక (అల్ ఇండియా స్టేట్ పీపుల్స్ కాన్ఫరెన్స్) తో మాత్రమే 1946 వరకు పరిమితమైన సంబంధాలను పెట్టుకున్నది. కానీ ఆ ప్రాంతాల ఉద్యమాలతో మమేకం కాలేదని గ్రహించాలి. 1946లో క్యాబినెట్ భారత స్వాతంత్ర్యానికి సంబంధించిన ప్రతిపాదనను ప్రకటించిన తరువాతే జాతీయ కాంగ్రెస్ సంస్థానాల పట్ల దృష్టిని సారించింది. సంస్థానాలలో ప్రాతినిధ్య ప్రభుత్వాలను నెలకొల్పాలన్న ఆలోచన

తెలంగాణాలో తలెత్తిన ఉద్యమాల స్వభావం వేరు. లక్ష్యం వేరు. పోరాట రూపానికి వస్తే ఇక్కడ అన్ని పార్టీలు ఏదో ఒక స్థాయిలో సాయుధ పోరాట మార్గాన్ని అనుసరించాయి. ఇక లక్ష్యాల విషయంలో తెలంగాణాలోని ఉద్యమాలు సామాజిక జీవితంలో సమానత్వాన్ని, రాజకీయ వ్యవస్థల్లో భాగస్వామ్యాన్ని ఆకాంక్షించాయి. ప్రధానంగా కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలే ఈ ఆకాంక్షను వ్యక్తీకరించాయి.

ఉన్నా, అంతకుమించి పటిష్టమైన భారతదేశ నిర్మాణమే ఆరోజుకు కాంగ్రెస్ పార్టీకి ప్రధానంగా ఉంది.

స్వాతంత్ర్యం రానున్నదని తేలిపోవడంతో ఇటు సంస్థానాల ప్రజలు కూడా పటిష్టమైన ప్రజాస్వామిక వ్యవస్థల నిర్మాణం జరగాలని, భారతదేశంలో విలీనం కావాలని తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉధృతంగా ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళనల వత్తిడికి లొంగి సంస్థానాలు 1946లో ఏర్పడిన తాత్కాలిక కాంగ్రెస్ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుని విలీనమయ్యాయి. ఆగస్టు 15, 1947 నాటికి కాశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ మాత్రమే విలీనం కాకుండా మిగిలాయి. కాని విలీనం చేసుకునే క్రమంలో సంస్థానాల ప్రజల అభీష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించలేదు. ఆ రాష్ట్రాలను బ్రిటిష్ పాలిత రాష్ట్రాల స్థాయికి అభివృద్ధి చేసే బాధ్యతను కేంద్రం పైనే ఉంచింది. ప్రజలకు చేయూతనిచ్చి స్వయంకృషితో ఎదగడానికి దోహదపడేది పోయి తనకు తానుగా అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకున్నది. అందుకే ప్రజల అవసరాలను స్థానిక పరిస్థితులకు తగినట్టుగా విధానాలను రూపొందించలేకపోయింది.

హైదరాబాద్ పరిస్థితి వేరు. నిజాం బ్రిటిష్ మద్దతుతో స్వతంత్ర రాజ్యంగా మనుగడ సాగించవచ్చునని అనుకున్నారు. బ్రిటిష్ పాలకులకు ఎల్లప్పుడూ అండదండగా ఉండి ఉన్నందున వారి నుండి మద్దతు లభిస్తుందని నిజాం పాలకులు ఆశించారు. బ్రిటిష్ పాలకులు హైదరాబాద్ పట్ల ప్రత్యేకమైన విధానాన్ని పాటించలేదు. సంస్థానాలన్నింటికి ఒకేరకమైన విధానాన్ని రూపొందించారు. స్వాతంత్ర్యం తరువాత సంస్థానాలపైన తాము చెలాయించిన అధికారం రద్దవుతుందని, ఆ తరువాత అవి తమ భవిష్యత్తును తామే తేల్చుకోవచ్చునని బ్రిటిష్ పాలకులు ప్రకటించారు. భారతదేశంలో విలీనం కావడమా లేదా అన్న విషయాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛ సంస్థానాల కుంటుందని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల బలాన్ని చూసి అన్ని సంస్థానాలు భారతదేశంలో విలీనమైనా హైదరాబాదు విస్తీర్ణం వలన, ఆర్థిక బలం వలన, రజాకార్ల అండదండలతో స్వతంత్రంగా నిలబడగలనని భావించింది. కానీ హైదరాబాద్ పాలకులకు ప్రజల్లో మద్దతు లేదు. కేవలం ఫ్యూడల్ ప్రభువుల అండదండలతో ప్రభుత్వం కొనసాగుతుండేది. అంతంతమాత్రంగా ఉన్న మద్దతు కూడా కమ్యూనిస్టు, సోషలిస్టు, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో తలెత్తిన ఉద్యమాల ఫలితంగా అంతమైంది.

తెలంగాణాలో తలెత్తిన ఉద్యమాల స్వభావం వేరు. లక్ష్యం వేరు. పోరాట రూపానికి వస్తే ఇక్కడ అన్ని పార్టీలు ఏదో ఒక స్థాయిలో సాయుధ పోరాట మార్గాన్ని అనుసరించాయి. ఇక లక్ష్యాల విషయంలో తెలంగాణాలోని ఉద్యమాలు సామాజిక జీవితంలో సమానత్వాన్ని, రాజకీయ వ్యవస్థల్లో భాగస్వామ్యాన్ని ఆకాంక్షించాయి. ప్రధానంగా కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలే ఈ ఆకాంక్షను వ్యక్తీకరించాయి.

నిజాం ప్రభుత్వం ఉద్యమాలపైన దాడిచేయడమే కాక మతతత్వ శక్తులైన రజాకార్లు కూడా ప్రజలపైన దాడికి పూనుకున్నారు. విలీనం జరిగితే ఈ దాడుల నుండి రక్షణ, సామాజిక - రాజకీయ జీవితంలో ప్రజలు, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న పోరాటకారులు కూడా ఆశించారు. భాగస్వామ్యం లభిస్తుందని ఆశించారు.

అటు భారత ప్రభుత్వం కూడా ఈ ఆకాంక్షలను గుర్తించింది. దానితోపాటు దేశంలోని విభిన్న ప్రాంతాల మధ్య పెంపొందిన ఆర్థిక సంబంధాలు కొనసాగాలంటే, ఒకే రాజకీయ అధికారం కింద అన్ని ప్రాంతాలు ఐక్యం కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం వాదించింది. కనుక నిరంకుశ వ్యవస్థలకు, ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు మధ్యనున్న వైరుధ్యాన్నే కాదు, భారతదేశ రక్షణ అవసరాలకు, స్వతంత్ర దేశాలుగా కొనసాగడానికి సంస్థానాలు చేస్తున్న ప్రయత్నాలకు మధ్య నున్న వైరుధ్యాన్ని కూడా పరిష్కరించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నం చేసింది.

1947 అక్టోబర్ నెలలో భారత ప్రభుత్వం హైదరాబాద్ ప్రభుత్వం రెండి మధ్యనున్న బ్రిటిష్ పాలకులన్నంతవరకు నెలకొన్న సంబంధాలను యథాతథంగా కొనసాగించడానికి నిర్ణయించాయి. తద్వారా తన స్వాతంత్ర్యానికి రక్షణ లభించిందని, నిజాం ప్రభుత్వం భావించగా, భారత ప్రభుత్వమేమో తనకు హైదరాబాద్ రాష్ట్రంపైన అధికారం సంక్రమించిందని భావించింది. తదనుగుణంగానే రజాకార్లను నియంత్రించాలని కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలని, ప్రాతినిధ్య ప్రభుత్వ ఏర్పాటుకు రాజ్యాంగాన్ని రూపొందించాలని నిజాం ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిజాం ప్రభుత్వం డిమాండ్లను తిరస్కరించింది. అయినా ఫ్యూడల్ ప్రభువుల మద్దతుతోను, రజాకార్ల మద్దతుతోను పాలించే నిజాం ప్రభువు భారత ప్రభుత్వ డిమాండ్లను ఆమోదించడం ఎలా సాధ్యమవుతుంది? నిజాం ప్రజా ఉద్యమాలు తీవ్రతం కావడంతో పూర్తిగా మద్దతును కోల్పోయి రజాకార్లపైన ఆధారపడవలసిన

స్థితికి వచ్చాడు. ఈ పరిస్థితిలోనే ప్రజాస్వామిక డిమాండ్లను ఆమోదించడమంటే తన కాళ్ళను తాను నరుక్కోవడమే. అందుకే భారత ప్రభుత్వం పెట్టిన డిమాండ్లను తిరస్కరించాడు.


పేకమేడలా మారిన నిజాం ప్రభుత్వాన్ని తొలగించి భారత ప్రభుత్వం పోలీసు చర్య ద్వారా హైదరాబాదును అవలీలగా విలీనం చేసుకున్నది. నాలుగు రోజులలోనే పోలీసు చర్య పూర్తయింది. ఆనాడు ప్రవేశించిన భారత సైనికులకు విశేషమైన ఆదరణ లభించింది. ప్రజలు విలీనాన్ని స్వాగతించారు. ప్రజా పోరాటం లేకుండా విలీనం ఇంత సులభసాధ్యం కాకపోవునని గమనించాలి.

అయితే భారతప్రభుత్వం హైదరాబాద్‌పైన తన అధికారాన్ని నిలబెట్టుకోవడంలో చూపిన శ్రద్ధను ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను పరిపూర్తి చేసే విషయంలో కనబర్చలేదు. ప్రజలకు ఎంతగానో ఆశించిన భాగస్వామ్యం లభించలేదు. కాకపోతే జాగీర్దారీ వ్యవస్థ రద్దయింది. కౌల్దారీ చట్టం అమలైంది అందువలన వెట్టి రద్దయి ప్రజలకు కొంత ఊరట కలిగినా ప్రధానంగా చిన్న భూస్వాములు, ధనికులైతే సంస్కరణల వలన ఎక్కువగా లబ్ధి పొందారు. ఈ సంస్కరణల కొరకు పోరాటం చేసిన ప్రజలకు వాటి రూపకల్పన లోనూ, అమలులోనూ ఆశించిన భాగస్వామ్యం లభించలేదు. రజాకార్ల చేతుల్లో దౌర్జన్యాన్ని చవిచూసిన ప్రజలు, అధికారం లభిస్తే ప్రతీకారేచ్ఛతో, ముస్లిం మతస్తులపై దాడి చేయవచ్చునన్న కారణంగా కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకు కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యాన్ని తిరస్కరించింది. నిజానికి తెలంగాణాలో రజాకార్ల చర్యలకు వ్యతిరేకత, మతతత్వం ప్రాతిపదికన వ్యక్తం కాలేదు. రాజకీయ నాయకులకు భాగస్వామ్యం కల్పించకపోగా ఇక్కడి అధికారులను కూడా ఇంగ్లీషు, తెలుగు రాదని తొలగించారు. బయటినుంచి కోస్తాంధ్ర నుండి సుమారు 3000 మందిని తీసుకొచ్చారు. వారంతా స్థానికులతో దురహంకార పూరిత ధోరణితో వ్యవహరించారు. అందుకే ఏ ప్రాంతంలో కలిసినా అన్యాయం జరుగుతుందన్న అభిప్రాయం తెలంగాణాలో ఏర్పడింది. అప్పటికే ముల్కీ ఉద్యమ అనుభవం ఉన్నందున బయటి అధికారులకు వ్యతిరేకంగా నిరసన తీవ్రంగానే వ్యక్తమైంది.

అది అట్లుండగా గ్రామాల్లో సమానత్వం కొరకు సాగిన పోరాటాలను అణచివేయడానికి కూడా ప్రభుత్వం పూనుకున్నది. ఆ ఉద్యమాలను దేశ భద్రతకు, జాతీయ సమైక్యతకు ఆటంకంగా చూశారు. ఆవిధంగా సెప్టెంబర్ 17 విమోచన దినం. రెండు విరుద్ధమైన అనుభవాలకు గుర్తుగా మిగిలిపోయింది. అది తెలంగాణా ప్రజల ఆకాంక్షలకు ప్రతీక. రజాకార్ల దౌర్జన్యాల నుండి, జాగీర్దార్ల ఆగడాల నుండి విముక్తి పొందిన రోజు. అయితే వారు ఆశించినట్లుగా సామాజిక జీవితంలో సమానత్వం గాని , రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం కాని సిద్ధించలేదు. ఆ లక్ష్యాలను పరిపూర్తి చేసుకోవడానికి ఇక్కడి ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగానూ బయట ప్రాంతాల వారి ఆధిపత్యానికి వ్యతిరేకంగానూ తెలంగాణాలో పోరాటాలు ఇంకా సాగుతూనే వున్నాయి. తెలంగాణాకు పోరాట ప్రతిపత్తి తప్ప మరే ఇతర గుర్తింపు లేదన్న అభిప్రాయం ఈ పరిస్థితుల నుండే వచ్చింది. ఇప్పటికీ ఈ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రయత్నం జరగడం లేదు. అణచివేత ప్రభుత్వాలిస్తున్న జవాబులు. సెప్టెంబర్ 17 నాడు విమోచన దినం జరుపుకున్నట్లయితే కనీసంగా ఈ ప్రాంతం చరిత్ర పైన చర్చ జరిగేది. ఆ చర్చ భవిష్యత్తుకు మార్గనిర్దేశన చేసేది. అయితే విమోచన దినం జరిపితే గదా ఆ చర్చలకు ఆస్కారం వచ్చేది. కనుకనే విమోచన దినాన్ని జరపకపోవడం అంటే తెలంగాణా చరిత్రను చెరిపివేయడమే. తెలంగాణా అస్తిత్వాన్ని కూల్చివేయడమే.

సంస్మరణ

కనకాచారి లేరు



ఆయన వీక్షణం పాఠకుడు...

ఆయన రాష్ట్రానికంతా తెలియక పోవచ్చు...

కాని పాలమూరులో సుప్రసిద్ధుడే.

కనీసం ఇరవై సంవత్సరాలుగా పాలమూరు వలస కార్మికుల, రైతుకూలీల, ఉపాధ్యాయుల, విద్యార్థుల, తెలంగాణ ఆకాంక్షల ఉద్యమాలకు కార్యకర్తగా, స్నేహితుడిగా, నాయకుడిగా, పెద్ద దిక్కుగా ఉన్నాడు.

హంతక కోబ్రాల కాటుకు ఆయన బలి అయిపోయిన వారం రోజులకు ఆయనకు అందవలసిన 'వీక్షణం' - చిరునామాదారు ఎవరో తెలియదు అని తిరిగి వచ్చింది.

కనకాచారికి 'వీక్షణం' సాశ్రు నివాళి.

తెలంగాణ 'అభివృద్ధి సమస్య' మాత్రమేనా?

- నాగోబా

ఇటీవలే ఢిల్లీలో జరిగిన జాతీయ సమగ్రతా మండలి సమావేశంలో ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మిస్తున్న సాగునీటి పథకాల వలన తెలంగాణా ఉద్యమం కనుమరుగయిపోయిందని, సరైన పద్ధతులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే ప్రత్యేక రాష్ట్రాల నిర్మాణం అవసరం లేదని, మేధావులూరా! చిన్న రాష్ట్రాల ఏర్పాటు సమంజసమా? చర్చించండి అంటూ పిలుపునిచ్చినట్లు పత్రికలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి ఇదే వైఖరితో అనేక సందర్భాలలో గతంలో కూడా మాట్లాడినట్లు పత్రికలు వెల్లడించాయి. సి.పి.ఐ., సి.పి.ఎం. పార్టీలు దాదాపు ఇట్లాంటి అభివృద్ధివాదాన్ని ప్రచారం చేయడమే కాదు, తెలంగాణాకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ డిమాండ్ చేస్తున్నాయి. సి.పి.ఎం. ఏకంగా ఉద్యమాలే చేపట్టింది. హైదరాబాద్‌లో సి.పి.ఎం. సెక్రటరీ రాఘవులు అరెస్ట్ కూడా అయ్యారు.

ఎన్నికలకు ముందున్న పరిస్థితి ప్రస్తుతం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష తగ్గిపోయిందన్నది ముఖ్యమంత్రి అభిప్రాయం. ఏభై ఏళ్ళుగా నిరంతరాయంగా ఒక్కోసారి ఉధృత రూపంలో మరోసారి నివురు గప్పిన నిప్పులా ఆరిపోకుండా కొనసాగుతూ తరం నుంచి తరానికి వ్యాప్తి చెందుతూ వస్తున్న ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఒకటిన్నర సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వల్ల కనుమరుగయి పోయిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం దుస్సాహం కాగా మరేమి? ముఖ్యమంత్రి, సిపిఐ, సిపిఎం పార్టీలు, ఇతర అభివృద్ధివాదులు భావిస్తున్నట్లు తెలంగాణా కేవలం అభివృద్ధి సమస్య మాత్రమేనా? ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు మరే ప్రాతిపదికలు లేవా? వర్తమాన తెలంగాణ ఉద్యమం ఈ ప్రశ్నలకు గతంలోనే సమాధానాలు చెప్పింది. అయినా అభివృద్ధివాదులు మళ్ళీ మళ్ళీ అభివృద్ధి మంత్రాన్ని జపిస్తూ తెలంగాణా ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల పట్ల చిన్నచూపును ప్రదర్శిస్తున్నారు. ఆకాంక్షల ప్రాధాన్యతను అభివృద్ధి సమస్యకు మాత్రమే కుదించి చర్చించబూనుకుంటున్నారు.

వర్తమాన తెలంగాణా ఉద్యమం తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ప్రధానంగా మూడు ప్రాతిపదికలను ముందుంచి చర్చిస్తుంది.

1. తెలంగాణాకు ఒక సహస్రాబ్ది కాలం పాటు ప్రత్యేక, స్వతంత్ర రాజకీయ ప్రతిపత్తి ఉన్నది.
2. తెలంగాణాకు ప్రత్యేక భాషా సంస్కృతుల అస్తిత్వం ఉన్నది.
3. తెలంగాణాలో గత 50 ఏళ్ళుగా వలస దోపిడీ ఉన్నది. సాంస్కృతిక వలసీకరణ అమలవుతున్నది. ప్రజలు వలస దోపిడీ నుంచి విముక్తి కోరుతున్నాం.

గత వేయి, వదిహేనువందల ఏళ్ళ చరిత్రను గనుక పరిశీలించినట్లయితే తెలంగాణా నేలకు ప్రత్యేక రాజకీయ ప్రతిపత్తి ఉన్నదని తెలుస్తుంది. తెలుగుజాతి నాగరికతకు, భాషా సంస్కృతుల వికాసానికి బాటలు వేసిన శాతవాహనులు మొదలుకొని కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీ రాజవంశాలు అన్నీ తెలంగాణా నేలనే కేంద్రంగా చేసుకొని, దక్కను పీఠభూమిదే గాక తూర్పు తీరం వరకు తమ రాజ్యాల్ని విస్తరించి పరిపాలన సాగించాయి. శాతవాహనులు తెలంగాణాలోని కొండాపురాన్ని రాజధానిగా చేసుకొని క్రీ.పూ. 221 నుండి క్రీ.శ.218 వరకు సుమారు 439 సంవత్సరాలు పరిపాలించారు. శాతవాహనుల ఆధిపత్యంలోకి రాకముందే గోదావరీ పరీవాహక ప్రాంతమైన తెలంగాణాలో నేటకి 4000 సంవత్సరాల నాడే తెలుగు ప్రజల నాగరికత విలసిల్లిందని, కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాల గోదావరీ తీరాన వెలసిన నగరమని పరిశోధకులు వెల్లడించారు. కాకతీయులు ఓరుగల్లును (ఇప్పటి వరంగల్) రాజధానిగా చేసుకొని క్రీ.శ. 1158 నుంచి 1322 వరకు పరిపాలించారు. కుతుబ్‌షాహీలు గోల్కొండ రాజధానిగా క్రీ.శ. 1512 నుండి 1687 వరకు దక్కన్ ప్రాంతాన్ని పాలించారు. వీరికాలంలోనే హైదరాబాద్ నగరం నిర్మాణమైంది. కుతుబ్‌షాహీల తర్వాత అసఫ్‌జాహీ రాజులు హైదరాబాద్ కేంద్రంగా క్రీ.శ. 1724 నుంచి 1949వరకు పాలించారు. వీరి కాలంలోనే 1766లో ఆంధ్రప్రాంతాన్ని ఈస్టిండియా కంపెనీకి అప్పగించారు. ఈ చరిత్ర

నంతా పరిశీలిస్తే తెలంగాణా నేల అత్యధిక కాలం స్వతంత్రంగా తనదైన రాజకీయ ప్రతిపత్తితో కొనసాగిందని అర్థమైంది. అందుకనే తెలంగాణా ప్రాంతంలో అవిర్భవించి పరిఢవిల్లిన రాజవంశాల పాలనలో అభివృద్ధి చెందిన రాజ్య పరిభాష (రెవెన్యూ కోర్టులు భూ సంబంధ, శాస్త్ర సంబంధ) తమ పాలిత ప్రాంతాలలోకి చొచ్చుకుపోయింది. ఒక సహస్రాబ్దికాలం పాటు 1956 వరకు ప్రత్యేక రాజకీయ ప్రతిపత్తిని అనుభవించిన తెలంగాణా ప్రాంతం ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తరువాత ఆంధ్రకు వలసగా మారిపోయింది. అందుకే తెలంగాణా పూర్వపు స్వతంత్ర రాజకీయ ప్రతిపత్తిని కోరుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాట్లాడే ప్రజలను మూడు ప్రాంతాలుగా విభజించి (తెలంగాణా, కోస్తా ఆంధ్ర, రాయలసీమ) చెప్పటం మనకలవాటే. ఈమూడు ప్రాంతాలలోను మాట్లాడే భాష తెలుగే. లిపి ఒకటే. అయినా తెలంగాణా ప్రజలు మాట్లాడే తెలుగు కోస్తాంధ్రలో, రాయలసీమలో మాట్లాడే తెలుగు కంటే భిన్నమైనదన్న భావన తెలంగాణా ప్రజలలో వున్నది. వాక్య నిర్మాణానికి, క్రియా పదాల ఉపయోగానికి సంబంధించిన తేడాలు, పలుకుబడులు, వ్యవసాయమే ప్రధానంగా వుండే తెలంగాణాలో భాషా సంస్కృతులు, పండుగలు, ఇతర సామూహిక ఉత్సవాలు, మైదాన ప్రాంతాలలో వుండే జాతులకు భిన్నంగా వుంటాయి. జొన్నలు, మొక్కజొన్నలు, పత్తి, ఆముదం, పప్పు ధాన్యాలు ప్రధాన పంటలు. చెరువుల క్రింద వరి కూడా పండిస్తారు. ఇదే భౌగోళికంగానూ, సాంస్కృతికంగానూ తెలంగాణాకు మైదాన ప్రాంతమైన ఆంధ్రతో విడదీసే అంశం. భారతదేశ రాజకీయ చింతన, రాజకీయ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు ప్రాంతీయత మొదలగు అంశాలపై పరిశోధనలు చేసిన జర్మన్ రచయిత దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్ తెలంగాణా అస్థిత్వంపై ఈవిధమైన అభిప్రాయాలు వెల్లడించారు.

"తమ తోటి ఆంధ్రులతో పోల్చినపుడు తెలంగాణీయులు తాము విస్పష్టమైనవారిగా భావిస్తారు. తెలంగాణా ఉద్యమ సమర్ధకుల దృష్టినసురించి 'తెలంగాణా వ్యక్తిత్వం' ఉన్నతమైన సంస్కారం, సాంస్కృతిక పరిణామంపై ఆధారపడిన సర్వ సమభావవాదం. తెలంగాణా వాసుల విశిష్ట లక్షణాలలో ముఖ్యమైనవి మనోహరమైన మర్యాదలు, చతురతతో కూడిన ఉపాయశీలత - దానశీల ఆతిథ్యం. ఈ విశిష్ట లక్షణాలు శిష్టజనం, కులీనుల్లోనే కాదు సామాన్యరైతు కుటుంబాల్లో కూడా స్పష్టంగా గోచరిస్తాయి. కాని విలువల క్రమానుగత శ్రేణిలో తెలంగాణీయుల్లో వ్యవహారిక విజయం కన్నా మానవసంబంధాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. తెలంగాణ వాసులు ఏదో సాదాసీదాగా జీవితం గడపాలనే కోరుకున్నవాళ్ళు తప్ప వ్యాపారదృష్టి ఉన్న అత్యాశపరులు కారు. (ఆంధ్రప్రదేశ్ రాజకీయ వ్యవస్థ - తెలంగాణ రాజకీయాలు : పే. 140)

"తమ తోటి ఆంధ్రులతో పోల్చినపుడు తెలంగాణీయులు తాము విస్పష్టమైనవారిగా భావిస్తారు. తెలంగాణా ఉద్యమ సమర్ధకుల దృష్టినసురించి 'తెలంగాణా వ్యక్తిత్వం' ఉన్నతమైన సంస్కారం, సాంస్కృతిక పరిణామంపై ఆధారపడిన సర్వ సమభావవాదం. తెలంగాణా వాసుల విశిష్ట లక్షణాలలో ముఖ్యమైనవి మనోహరమైన మర్యాదలు, చతురతతో కూడిన ఉపాయశీలత - దానశీల ఆతిథ్యం. ఈ విశిష్ట లక్షణాలు శిష్టజనం, కులీనుల్లోనే కాదు సామాన్యరైతు కుటుంబాల్లో కూడా స్పష్టంగా గోచరిస్తాయి.

జాతీయాలు, సామెతలు మొదలైన వాటిలో ప్రత్యేకతలు గుర్తించదగిన స్థాయిలో ఉన్నాయని భాషా పరిశోధకులు చెబుతున్నారు. తెలంగాణా దక్కన్ పీఠభూమిలో వున్నది. ఎత్తయిన ప్రాంతం, గట్టినేల, దట్టమైన వర్షాధార అడవులతో కూడిన ప్రాంతమైనందున ఇక్కడి వ్యవసాయం ప్రధానంగా వర్షాధారమే. పంట భూములు ఎత్తు ప్రదేశంలో ఉండటం, నదులేమో తక్కువ ఎత్తులో ప్రవహించడం ఈ ప్రాంత భౌగోళిక ప్రత్యేకత. ఇప్పటి పాలకులకు ఇదొక భౌగోళిక అనుకూలతగా కనిపించకపోవచ్చు. కాని ఇదే భౌగోళిక ప్రత్యేకతని అనుకూలంగా మార్చుకొని వేలాది చెరువులను నిర్మించి, వేలాది ఎకరాలను కొత్తగా సాగులోకి తీసుకువచ్చిన ఘనమైన చరిత్ర కాకతీయులకు, కుతుబ్‌షాహీలకు, అసఫ్‌జాహీలకు ఉన్నది. దక్కను పీఠభూమిలో వ్యవసాయం ప్రధానంగా మెట్ట వ్యవసాయం వర్షాధారమైనదే. మానవజాతి నాగరికతా వికాసంలో భాషా సంస్కృతుల విస్తరణలో వ్యవసాయాభివృద్ధే ప్రధాన చోదక పాత్ర వహిస్తుంది. వ్యవసాయ ప్రధానమైన మానవజాతికి, వ్యవసాయ సంబంధ శ్రమలు భౌగోళికంగా మారే రుతువులూ, కాలాలు వారి నాగరికతలను, భాషా సంస్కృతులని విశేషంగా ప్రభావితం చేస్తాయి. అందుకే మెట్ట

దాగ్మార్ ఇంకా ఇలా అంటారు : "తెలంగాణ అస్తిత్వం స్పష్టంగా భాషమీద గాని, మతం మీద గాని ఆధారపడ్డ విషయం కాదు. అది చరిత్రపై ఆధారపడిన అంశం. చరిత్రలో భాగంగా తెలంగాణ సమాజ నిర్మితి, సంస్కృతీ లక్షణాలు ఎదిగినవి. ఇవి తెలుగుదేశంలోని ఇతర ప్రాంతాల లక్షణాల కన్నా, నిర్మాణాల కన్నా భిన్నమైనవి". (పేజీ. 143)

దాగ్మార్ అభిప్రాయాలు విశ్లేషించినపుడు తెలంగాణ విషయంలో ఆమె చేసిన వ్యాఖ్యానాలు అక్షర సత్యాలుగా తోస్తాయి. ఇంతకుముందే చెప్పుకున్నట్లు తెలంగాణ అస్తిత్వం సహస్రాబ్ది

తెలంగాణా వెనుకబాటుకు కారణం తెలంగాణాలో కొనసాగుతున్న వనరుల దోపిడీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు కూడా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలే. తెలంగాణాకు ఇతర వెనుకబడిన ప్రాంతాలకు తేడా ఏమిటంటే వనరుల దోపిడీ. తెలంగాణాకున్న వనరుల దోపిడీ సమస్య రాయలసీమ, ఉత్తరాంధ్రకు లేవు.

స్వతంత్ర రాజకీయ ప్రతిపత్తి పునాదిగా (ముఖ్యంగా ఇటీవలి చరిత్ర అయిన కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీ పరిపాలన) భాషా, సాంస్కృతిక అస్తిత్వాలుగా అభివృద్ధి చెందింది. కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీ రాజవంశాల కాలంలో రాజభాష ఉర్దూ అవడంతో గత 500 సంవత్సరాలుగా తెలుగు భాషలో ఉర్దూ, పార్శీ, అరబిక్ పదాలు అనివార్యంగా వచ్చి చేరాయి. దాంతో తెలంగాణ ప్రాంతంతో సరిహద్దుల్ని కల్గి ఉన్న కన్నడ, మరాఠి పదాల్ని కూడా కలుపుకొని తెలంగాణ భాష పరిపుష్టమైంది. తెలంగాణ తెలుగు అచ్చమైన వెలుగు. తన మూలాల్ని కాపాడుకుంటూనే అన్ని భాషా పదాలని తనలో కలుపుకున్నది. అవన్నీ తెలుగు పదాలే అన్నంతగా తెలంగాణ తెలుగులో కల్సిపోయి తెలంగాణ భాషగా ప్రత్యేక అస్తిత్వాన్ని పొందింది. తెలంగాణ భాషని తౌరక్యాంధ్రమని ఎద్దేవా చేసింది ఆంధ్రులే. బ్రిటిష్‌వారి అధీనంలో వున్న కోస్తా, రాయలసీమ ప్రాంతాలు ఇంగ్లీషు ప్రభావానికి లోనై ఇంగ్లీషు ఆధిపత్య ధోరణిని, స్వభావాన్ని సంతరించుకుంది. దాగ్మార్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ఇలా అన్నారు. "ఆంధ్రులు కూడా తెలంగాణీయులు భిన్నమనే ఒక సామూహిక భావనను కలిగి వున్నారు. ఆంధ్రుల దృష్టిలో తెలంగాణీయులు సోమరిపోతులు, సౌఖ్యప్రియులు, భూస్వామ్యపోకడలున్న అనమర్థులు, తమకు తావే చురుకైనవారమని, ఆధునికులమని, ప్రగతిశీలురమని భావిస్తారు. నిజానికి ఆంధ్రులకు తెలంగాణా వట్ల ఒకరకమైన ఆధిక్యతాభావముంటుంది. అంతేగాక దాన్ని ప్రదర్శించడానికి కూడా వెనుకాడరు''. (పే. 144). ఈ అభిప్రాయాల్లోని సత్యాన్ని తెలంగాణాది తౌరక్యాంధ్రమని, తెలంగాణాలో కవులే లేరని చేసిన వ్యాఖ్యానాలే వెల్లడిస్తాయి. మొన్నటికి మొన్న సీతారాం ఏచూరి కూడా తెలంగాణా భాషకు, సంస్కృతికి, చరిత్రకు ఉనికి, గుర్తింపు లేదన్న దుస్సాహస, దుర్మార్గ వ్యాఖ్యానాలు ఈ ఆధిపత్య స్వభావాన్ని వెల్లడిస్తాయి.

ఇక అభివృద్ధి విషయంలో తెలంగాణా వెనుకబాటుకు గురి అయిందన్న విషయాన్ని అందరూ ఒప్పుకుంటున్నారు. 50 సంవత్సరాలుగా అన్ని ప్రభుత్వాలు తెలంగాణాపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయని వారి అభిప్రాయం. తెలంగాణా ఉద్యమం స్పష్టంగా చెప్తున్నది ఏంటంటే తెలంగాణా వెనుకబాటుకు కారణం తెలంగాణాలో కొనసాగుతున్న వనరుల దోపిడీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు కూడా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలే. తెలంగాణాకు ఇతర వెనుకబడిన ప్రాంతాలకు తేడా ఏమిటంటే వనరుల దోపిడీ. తెలంగాణాకున్న వనరుల దోపిడీ సమస్య రాయలసీమ, ఉత్తరాంధ్రకు లేవు. అపారమైన జలవనరులు, బొగ్గు, ఖనిజాలు, అటవీసంపద, ఉద్యోగాలు, తెలంగాణాలో వసూలవుతున్న రెవెన్యూ అన్నీ కూడా గత 50 ఏళ్ళుగా దోపిడీకి గురి అయినాయన్న విషయం తెలంగాణా ఉద్యమం గణాంకాలతో దేశప్రజల ముందుంచింది. వలస పాలన కారణంగా తెలంగాణ అంతటా సాంస్కృతిక వలసీకరణ కూడా ఉధృతంగా కొనసాగుతూ వస్తున్నది. తెలంగాణ చరిత్ర సంస్కృతి, భాష ఆనవాళ్ళు లేకుండా కనుమరుగయి పోయే పరిస్థితి దాపురించింది. సాంస్కృతిక వలసీకరణ కూడా ఉధృతంగా కొనసాగుతూ వస్తున్నది. తెలంగాణా చరిత్ర, సంస్కృతి, భాష ఆనవాళ్ళు లేకుండా కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. సాంస్కృతిక వలసీకరణకు సంబంధించి ఇటీవల ఉదాహరణ ఒకటి ప్రస్తావించడం అప్రస్తుతం కాబోలు. నగర కేంద్ర గ్రంథాలయలో విశ్వనాథ విగ్రహాన్ని ప్రతిష్టించారు. తెలంగాణాలో గ్రంథాలయోద్యమానికి, భాషా సాంస్కృతిక వికాసానికి విశేషంగా దోహదం చేసిన మాడపాటి హనుమంతరావు, కొమర్రాజు లక్ష్మణరావు, కోదాట నారాయణరావు, వట్టికోట ఆళ్వారు స్వామి తదితర మహానుభావులు ఎవరూ ఈ సందర్భంగా ప్రభుత్వానికి గుర్తుకు రాలేదు. హైదరాబాద్‌లో గ్రంథాలయ ఉద్యమానికి గాని, ఇక్కడి భాషా సాంస్కృతిక వికాసానికి గాని ఏ సంబంధమూ లేని విశ్వనాథ ఇవాళ నగర కేంద్ర గ్రంథాలయంలో చోటు సంపాదించడం సాంస్కృతిక వలసీకరణలో భాగమేనని చెప్పక తప్పదు. ఇట్లా ఎన్నయినా ఉదంతాలను ఉటంకిస్తూ పోవచ్చు.

ఇవాల్టి తెలంగాణా ఉద్యమానికి తన లక్ష్యాల పట్ల, తన మూలాల పట్ల, తన ఆకాంక్షల పట్ల స్ఫటిక సదృశ్యమైన స్పష్టత వున్నది. తెలంగాణా ఇవాళ తన పూర్వపు స్వతంత్ర రాజకీయ ప్రతిపత్తిని కోరుకుంటున్నది. రాజ్యాధికారం వల్ల మాత్రమే తెలంగాణా అస్థిత్వాన్ని, భాషా సంస్కృతుల పరిరక్షణ వనరుల దోపిడీని అడ్డుకోవడం సాధ్యమవుతుందన్న స్పృహ ఉద్యమానికుంది. అభివృద్ధివాదులు ఎంతగా అభివృద్ధి మంత్రాన్ని జపిస్తున్నా విముక్తి ఆకాంక్షకు ప్రత్యామ్నాయం ఏమీ లేదు - విముక్తి తప్ప - ఆంధ్ర వలస పాలన నుండి విముక్తి మాత్రమే తెలంగాణాని అభివృద్ధి పథంలోకి తీసుకుపోగలదని ఉద్యమం నమ్ముతున్నది. అందుకే అభివృద్ధివాదుల మాటల్లోని బూటకత్వాన్ని ఎండగడుతూనే వున్నారు. అయితే అణగారిన వర్గాల, జాతుల పోరాటాలను, ఆకాంక్షలను సమర్థించవలసిన కమ్యూనిస్టులు కూడా అభివృద్ధివాదుల జాబితాలోకి చేరిపోవడం శోచనీయం. ❑

హైటెక్ యుగంలో టీచర్ ఫ్యూచర్

- ఎ. పున్నయ్య



కుక్క పనిని గాడిద చేస్తే యజమానిచే తన్నులు తిన్న కథను చెప్పే ఉపాధ్యాయుడు ప్రాథమిక పాఠశాలలో తను (ఆ) గాడిద పాత్రని పోషించాల్సిన పరిస్థితులు రోజురోజుకూ అధికమవుతున్నాయి. "ఉపాధ్యాయుడంటే సాధారణంగా బోధకుడు అని, తరగతి గదిలో పాఠ్యాంశాలను, విద్యార్థులను నైపుణ్యంతో విశదీకరించే ఓ విశ్లేషకుడని, విద్యార్థులలో నిద్రాణమైన నైపుణ్యతను వెలికితీసి సృజనాత్మకత పెంచి, అటు విద్యార్థికి, ఇటు సమాజానికి ఉపయోగపడే సాధనంగా మలిచే తాత్వికుడుగా, సమాజానానికి దశను, దిశను నిర్దేశించే దార్శనికుడని నిన్నటివరకున్న భావన. కానీ ఈ భావన రోజురోజుకూ ప్రాథమికస్థాయిలో కనుమరుగవుతూ ఉపాధ్యాయుడంటే ఓ పశువుల కాపరిగా, రేషన్ డీలర్‌గా, వంటవాడిగా, జన్మభూమి సభల్లో ప్రజలముందు దోషిగా నిలుచునే ముద్దాయిలా, గ్రామాన్ని, పాఠశాలను సందర్శించే అధికార, అనధికారులకు, రాజకీయనాయకులకు ఎల్లవేళలా సమాచారాన్ని అందించే సమాచార కేంద్రంగా, ప్రస్తుతం గ్రామ సమాచారాన్ని సేకరించే గణాంకుడిగా, ఇంకా చెప్పాలంటే ఎయిడ్స్, పల్స్‌పోలియో, మరెన్నో ప్రభుత్వం చేపట్టే అన్ని పథకాలకు కార్యక్రమాలకు పిల్లలచే కలసి ప్రచారం చేసే ప్రచార సాధనంగా ప్రభుత్వాలు, ప్రభుత్వ ఉపాధ్యాయునికి నిర్వచనమిస్తున్నారు.

బోధన కన్నా బోధనేతర పనులు దినదినానికీ అధికం కావడంతో ప్రాథమిక విద్య ప్రభుత్వ అంతరంగిక కుట్ర ప్రకారంగా కుంటుపడి ప్రజలకు, ప్రభుత్వ పాఠశాలలంటే, ఉపాధ్యాయులంటే సహజంగా వ్యతిరేకతాభావన పెరిగింది. ప్రభుత్వ విధానాలపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ నంఘాలు పెద్ద పెట్టున నిరసనలు, ధర్నాలు చేయగా వాటి ఫలితంగా ఎట్టకేలకు ప్రభుత్వ ఉత్తర్వు 456ను విడుదల చేసింది. దీని ప్రకారం ఎన్నికల విధులు, విద్యా నంబంధ కార్యక్రమాలు మాత్రమే ఉపాధ్యాయులచే వినియోగించుకోవాలి అని నంక్షిప్తంగా వుంటుంది. కాని ఏ ఉత్తర్వు అయినా, ఎంత పకడ్బందీ హామీలున్నా ఆచరణలో శూన్యం. దానికి తాజా ఉదాహరణ ఆర్థిక గణాంక నర్వేను ఉపాధ్యాయులకు అప్పగించుట. ప్రభుత్వ విధానాలు ఉపాధ్యాయునిపై రుద్దే నేపథ్యంలో ఉపాధ్యాయుని పరిస్థితి పాఠశాలల పరిస్థితిని గురించి సంక్షిప్త రూపమే ఈ వాస్తవ కథారూపము.

అనగనగా ఒక ఊరు. ఊళ్ళో ప్రభుత్వ పాఠశాల, దానిలో ఐదు తరగతులున్నాయి. 80మంది విద్యార్థులు, ఒక్కడే ఉపాధ్యాయుడు. (విద్యా వాలంటీర్ పోస్ట్ వుంది కాని చదువుకున్న వాళ్ళెవరూ లేనందున వాలంటీర్ పోస్ట్ ఖాళీగా వుంది). ఆ ఊరు అన్ని ఊళ్ళలాంటిదే. కనుక ప్రత్యేకంగా పేరు చెప్పనక్కరలేదు. ఆ ఉపాధ్యాయుడు అందరి ఉపాధ్యాయులలాంటి వాడే. కనుక పరిచయం కూడా అక్కర్లేదు.

ఉపాధ్యాయుడు పొద్దున్నుంచీ గ్రామంలో ఆర్థిక, గణాంక సర్వే చేసి సరిగ్గా నమయానికి అరసెకను ముందు పాఠశాలలో అడుగుపెట్టాడు. పిల్లలచే మొదటి గంట కొట్టించి, సర్వే కాగితాలలోకి తలదూర్చి చాంతాడంత పొడవుగా ముప్పైకి పైగా (కాలమ్స్) గడులలోని నంబర్లన్నింటినీ పరిశీలించినాడు. సెకండ్ బెల్ అయింది. అష్టకష్టాలు పడి వంకర టింకరగా వున్న పిల్లల్ని వరసలో నిలబెట్టించి ప్రార్థన చేయించాడు. 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' మర్చిపోకుండా పాడించాడు. హమ్మయ్య ఈరోజు ముఖ్యమంత్రి నుంచి ఇబ్బందేమీ లేదనుకుని వెళ్ళి నిబ్బరంగా కుర్చీలో కూర్చున్నాడు. హాజరు రిజిస్టర్‌లో సంతకం చేసి పిల్లల వంక కలయజూసేసరికి, నిన్నటిరోజు స్కూలుకు రాని పిల్లలు అరడజను మంది కనిపించారు. వాళ్ళను ఒక్కొక్కరిని పాఠశాలకు నిన్న రాకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకుంటున్నారు. అకారణంగా పాఠశాలకు ఎగ్గొట్టినవారిని దండిస్తున్నాడు.

ఇంతలో హఠాత్తుగా డి.ఇ.ఓ.గారు వచ్చినారు. ఉపాధ్యాయుడు

వినమ్రంగా లేచి, నమస్కరించి తన కుర్చీలో అతనిని కూర్చోబెట్టినాడు. తాను మాత్రం చేతులు కట్టుకొని నిలబడ్డాడు. డి.ఇ.ఓ. గారు అటెండెన్స్ రిజిస్టర్ చూపించమన్నాడు. ఒక సంతకం కెలికేసి "పిల్లల అటెండెన్స్ రిజిస్టర్స్ ఎక్కడ"న్నాడు. వాటిని చూపిస్తూ భయపడుతూనే 'ఈరోజు ఇంకా హాజరు.... హాజరు తీసుకోలేదు సార్" అన్నాడు. 'వాట్ ?' అంటూ ఎగిరిపడ్డాడు డి.ఇ.ఓ. "ఇంకా అటెండెన్స్ తీసుకోలేదా? నీకు బుద్ధుందా? స్కూలు తెరిచి 20 నిమిషాలయింది. ఇంకా అటెండెన్స్ తీసుకోలేదంటే ఎంత నిర్లక్ష్యం? నిన్ను సస్పెండ్ చేసి పారేస్తా" అంటూ ఊగిపోయాడు. 'అదీ...అదీ...' అని ఏదో చెప్పబోయాడు ఉపాధ్యాయుడు. 'అదీ లేదు ఇదీలేదు. సస్పెండ్ చేస్తే కానీ బుద్ధి రాదు" గుడ్లురిమాడు డి.ఇ.ఓ. "లేదు సార్! రోజూ మామూలు టైము కంటే 15 నిమిషాలు ఆలస్యంగా అటెండెన్స్ తీసుకుంటా. ఆలస్యంగా వచ్చేవారెవరైనా వుంటే ఆలోపల వచ్చేస్తారు. అందరికీ ఒకేసారి అటెండెన్స్ తీసుకొని ఎంతమంది వస్తే అంతమందికి ఒకేసారి సరిపడా అన్నం వండించవచ్చు. ముందుగా అటెండెన్స్ తీసుకుంటే లేటుగా వచ్చే వారికి ఇబ్బంది కదా..." అని ఏదో చెప్పబోతుండగా ఉపాధ్యాయుని మీదకు డి.ఇ.ఓ. పిడుగులాంటి ఇంకో ప్రశ్న సంధించాడు. "టీచింగ్ డైరీ ఎక్కడ?" అని అడిగాడు. హాజరు విషయంలో కాస్త ఊపిరి తీసుకున్న ఉపాధ్యాయుడు టీచింగ్ డైరీ అనగానే తడబడ్డాడు. తత్తరపాటుగా టీచింగ్ డైరీ అంటే క్యూ.ఐ.పి. ఆధారంగా రాయాలి. క్యూ.ఐ.పి. అంటే ప్రపంచ బ్యాంక్ చెప్పుచేతలలో నడుస్తున్న, ఘనత వహించిన ప్రభుత్వాలు పాఠశాలల్లో క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం అని ప్రోగ్రాం పెట్టినారు. దాని సంక్షిప్తరూపమే క్యూ.ఐ.పి. ఈ పథకంలో భాగంగా మొదట పిల్లలందరికీ ప్రీ టెస్ట్ అని పరీక్ష పెడతారు. ప్రశ్నలు చదవడం, రాయడం, భావావగాహన, పదజాలాభివృద్ధి, వ్యాకరణం, సృజనాత్మకత ఇత్యాది కౌశలాల క్రింద విడగొట్టుకొని వాటికి వ్రాసిన జవాబులను విశ్లేషించే ఒక పద్ధతి. దీని ప్రకారంగా టీచింగ్ డైరీ రాయడం అనేది మామూలు మాట కాదు. ఇప్పుడివ్వమన్న డైరీ అలాంటి తాలూకుది.

కానీ మన కథానాయకుడు క్లర్కు కాదు కదా! ఉపాధ్యాయుడు. అందులో ఏకోపాధ్యాయుడు. 80 మంది పిల్లల్ని అల్లరి చేయకుండా కూర్చోబెట్టుట అతనికి పెద్ద సవాల్. పిల్లలకు చదువు చెప్పుట, అదీ రికార్డుల ప్రకారంగా చదువు చెప్పుట అతని వల్ల అయ్యే పనేనా? పాపం ఉపాధ్యాయుడు ఎలాగోలాగు క్యూ.ఐ.పి. ప్రకారంగా చదువు చెప్పుచున్నాడు కానీ డైరీ మాత్రం వ్రాయడం లేదు. 'ఎవడిస్థాయి బట్టి వాడికి చదువు చెబితే సరి. రికార్డు వ్రాసుకుంటూ కూర్చుంటే నాకున్న టైమంతా వ్రాతకే సరిపోతుంది. కాబట్టి నా చేతనైనంతవరకు వాళ్ళకు చదువు చెప్తా. డైరీ వ్రాయనంతమాత్రాన చదువు చెప్పనట్లు కాదు గదా!' అని పిల్లలకు సీరియస్‌గా పాఠాలు చెబుతూ పోయాడు. అదంతా గుర్తొచ్చి ఉపాధ్యాయుడు మౌనంగా వున్నాడు. "టీచింగ్ డైరీ ఇవ్వమంటే బెల్లం కొట్టిన రాయిలా మెదలకుండా వున్నావేంటి?" పళ్ళు పటాపటా కొరికాడు డి.ఇ.ఓ. "అది కాదా్సర్" అంటూ తన అవస్థ చెప్పబోయాడు ఉపాధ్యాయుడు.

ఇంతలో డి.ఇ.ఓ.గారు వచ్చినట్లు తెలియగానే ఎం.ఇ.ఓ. గారు విచ్చేసారు. "నమస్కారం సార్!" అంటూ వినయంగా అతనికి ఒక నమస్కారం సమర్పించుకొని ఆదరాబాదరాగా ప్రక్క క్లాసు నుంచి కుర్చీ పట్టుకొచ్చి అతన్ని కూర్చోమన్నాడు. డి.ఇ.ఓ.గారు వెంటనే "ఏమయ్యా! ఎం.ఇ.ఓ! మీ టీచర్లు ఇలా వున్నారు చూడండి. ఇప్పటివరకు అటెండెన్స్ తీసుకోలేదు. టీచింగ్ డైరీ అంటే ఉలకడు, పలకడు" అంటూ ఎం.ఇ.ఓ. వైపు చూసుకుంటూ మాట్లాడాడు డి.ఇ.ఓ.

"అంతేసార్! వీళ్ళ నెగ్లిజన్సీ. పని చేసినా, చేయకపోయినా మన జీతం వస్తుందని ధీమా. టీచర్ల తప్పులకు బాధ్యుడను కాదం"టూ ఒక స్టేట్‌మెంట్ వదిలేసి, టీచర్‌వైపు తిరిగి "ఏమయ్యా! నిన్న పంపిన సర్క్యులర్‌లోని పర్టిక్యులర్స్ అన్నీ రడీ చేసి పెట్టావా? జీరో టూ ఫిఫ్టీన్‌ఇయర్, క్లాస్ వైజ్, కాస్ట్ వైజ్, జెండర్ వైజ్, డ్రాపవుట్, నెవర్ ఎన్‌రోల్డ్, హాండీకాప్డ్, మెంటల్లీ రిటార్డెడ్, చైల్డ్ లేబర్, ఇన్‌ఫర్మేషన్ అంతా రడీ చేసి పెట్టావా?" అని గుక్కతిప్పుకోకుండా, దీర్ఘమైన ప్రశ్నలను వదిలాడు. పాపం! ఉపాధ్యాయుడు అన్నింటికీ ఓపిగ్గా చెప్పాడు. 'డ్రాపవుట్స్, నెవర్ ఎన్‌రోల్డ్ ఎవరూ లేరు సార్' అని భయభక్తులతో జవాబిచ్చాడు. అతని జవాబు విని ఎం.ఇ.ఓ. కు కాలింది. "ఏందయ్యా! ఊరన్నాక డ్రాపవుట్, నెవర్ ఎన్‌రోల్డ్ ఎవరూ లేకుండా వుంటారా? నీవు అందర్నీ ముందే బళ్ళో చేర్పించుకుంటే ఎట్లా? రేపు 'బడిబాట' వారోత్సవాల్లో ఎవర్ని చేర్పించు కుంటావు? కాస్తన్నా తెలివుండాలయ్యా! కొంతమందిని బడిలో చేర్పించకుండా వాళ్ళనే డ్రాపవుట్ అని, చైల్డ్ లేబర్ అని 'బడిబాట' వారోత్సవాల్లో చూపించాల్సి వుంటుంది. ప్రభుత్వం ఎంతో ఖర్చు పెట్టి 'బడిబాట' కార్యక్రమం ఇంత అట్టహాసంగా నిర్వహిస్తుంటే, నీవు ముందే బళ్ళో చేర్పించుకుని దాన్ని ఫ్లాప్ చేయాలని చూస్తున్నావా? మన మండలంలో ఎంతమందిని చేర్పించాము? మన జిల్లా ఏ స్థానంలో వుంటుంది? అవి ముఖ్యమయ్యా! " అంటూ క్లాస్ పీకాడు.

ఇంతలో ఎం.ఆర్.ఓ. గారు దర్జాగా వచ్చి కూర్చున్నారు. వెంటనే టీచరు నమస్కారం యదావిధిగా చేసాడు కానీ పట్టించుకోకుండా "పోయిన్నెల మీ డే మీల్స్ రిపోర్టు ఇంకా పంపించలేదు" అన్నాడు. "పంపించాను" అన్నాడు టీచర్. "పంపించావా? ఎక్కడ మిస్ అయిందో! సరేలే! ఇంకొకటి రాసివ్వు" అన్నాడు. రిపోర్టులో స్టాక్ చూపించినన్ని బియ్యం తన దగ్గర లేవంటుంది వంట మనిషి"

అంటూ ఇంకో ప్రశ్న వదిలాడు. "నాకేం తెలుసు! బియ్యం ఆమె కస్టడీలో ఉన్నవి ఎక్కువ తక్కువలకి ఆమెదే బాధ్యత" అని కాస్త ధైర్యంతో చెప్పాడు. "ఏమయ్యా! తెలివుందా లేదా నీకు? వంట మనిషి ఇవ్వాళ వుంటుంది. రేపు పోతుంది. నువ్వు పర్మినెంట్‌గా ఉండే ఉద్యోగివి, దేనికైనా జవాబుదారీగా ఉండాలి" అని ఎం.ఆర్.ఓ.గా గర్జించాడు. తన అధీనంలో లేని బియ్యం నిల్వలో హెచ్చు తగ్గులకు తానెట్లా బాధ్యుడవుతాడో తెలియక జుట్టు పీక్కున్నాడు టీచర్. "నువ్వేం చెప్తావో నాకు తెలియదు. రిపోర్టులో చూపినంత స్టాకు తేలకపోతే నీమీదే చర్య తీసుకుంటా! అని, ఆర్థిక గణాంక సర్వే ఎంతవరకు వచ్చింది ? ఆర్.డి.ఓ.గారు మెసేజీ పంపివ్వమన్నారు" అన్నాడు. "ఒకటా రెండా! ముప్పైఆరు కాలమ్స్ 385 ఇండ్లను సర్వే చేయాలంటే ఉదయం, సాయంత్రం సమయం సరిపోవట్లేదు సార్!" అని గొణుక్కున్నాడు. 'త్వరగా పూర్తి చేస్తాన్ సార్' అన్నాడు. "సమయం సరిపోవట్లేదంటే ఇదేమన్నా నా సొంత పనా? కలెక్టర్ గారి ఆర్డర్" అని విసుగ్గా వెళ్ళిపోయాడు.

సర్వే ఎలా పూర్తి చేయాలా అని ఆలోచించేలోగా ఎం.డి.ఓ.గారు హఠాత్తుగా పాఠశాల లోపలకి వచ్చారు. వస్తూనే ఉపాధ్యాయుడిపై దాడికి దిగాడు. "ఏమయ్యా ! మీ టీచర్లకు కళ్ళు నెత్తికెక్కినయ్. ఎం.ఇ.ఓ. ఒక్కడేనా మీకు ఆఫీసర్! ఎం.డి.ఓ. కాదా? ఎంత లెక్కలేనితనం" అంటూ ప్రారంభించాడు. "లేదుసార్! అలాంటిదేమి లేదు" అంటూ ఎం.ఆర్.ఓ. దెబ్బకు పుట్టిన వణుకు ఇంకా ఎక్కువ అవుతుంటే అణచుకుంటూ అన్నాడు టీచర్. "ఏమయ్యా టీచర్ ! ఎం.డి.ఓ. కోసం సపరేట్ విజిటింగ్ బుక్ పెట్టమంటే ఒక్కరన్నా పెట్టింర్డా. ఇప్పటికి నాలుగు స్కూల్స్ చూసిన. ఒక్కరు పెట్టలేదు. ఇంతకూ నువ్వన్నా పెట్టినావా ! పెట్టలేదా?" ఎం.డి.ఓ. గారు స్పీడ్‌గా అడిగిండు. "పెట్టినా సార్! ఇదిగో విజిటింగ్ బుక్" అని వణుకుతూ అందించాడు. దాంట్లో ఒక సంతకం కెలికేసరికి ఎం.డి.ఓ. గారి స్పీడ్ తగ్గింది. "నిన్ను విలేజ్ రిసోర్స్ పర్సన్‌గా అపాయింట్ చేస్తున్నా! సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు వారం రోజులు శిక్షణ ఇవ్వాలి. ఇదిగో ఆర్డర్ కాపీ" అని కాగితం చేతుల్లో పెట్టాడు. 'సార్!' అంటూ టీచర్ నోరు తెరిచాడు. 'ఏంటి'? అన్నట్లు చిరాగ్గా చూసాడు ఎం.డి.ఓ. "నేను సింగిల్ టీచర్‌ను. నేను ట్రెయినింగ్‌కు పోతే స్కూల్ మూతపడుతుంది. ఆర్థిక గణాంక సర్వే వెనుక పడుతుంది. ఎట్లా సార్!" అన్నాడు టీచర్. "మూతపడితే మూతపడనియ్యావయ్యా! ఆ సంగతి నేను చూసుకుంటాను. ఎం.డి.ఓ. గారు ఆర్డర్ ఇచ్చిండని ఎం.ఇ.ఓ.కు చెప్పు" అని ఉపాధ్యాయుని జవాబు కోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు.

డి.ఇ.ఓ. గారు మరల టీచింగ్ డైరీ గురించి మాట్లాడవేంటి? హైస్కూల్ టీచర్లు కనీసం చూచి చదవటం, వ్రాయటం రావటం లేదంటున్నారు. ఈమధ్యనే భాషాభివృద్ధిపై రెండు రోజుల శిక్షణ ఇచ్చినాము. దాని ఫలితాలు ఎట్లా ఉన్నాయి" అంటూండగానే....

ఇంతలో విద్యాకమిటీ ఛైర్మన్‌కు స్కూల్‌కు 'ఎవరో పెద్ద సార్' వచ్చినట్లు చెప్పారు. ఛైర్మన్ పాఠశాలకు వచ్చాడు. ఎవరూ కూర్చో అనకముందే కుర్చీ లాక్కొని కూర్చున్నాడు డి.ఇ.ఓ. వైపు చూచి "ఈయన ఎవరు" అని అమిత నిర్లక్ష్యంగా ప్రశ్నించాడు. "వారు డి.ఇ.ఓ.గారు" అని చెప్పి "మా స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్" అని పరిచయం చేశారు టీచర్.

డి.ఇ.ఓ.గారు అనగానే విద్యాకమిటీ ఛైర్మన్‌కు హుషారొచ్చింది. డి.ఇ.ఓ. వైపు చూచి "నువ్వన్నా చెప్పు సార్! నేను పదివేలు ఖర్చు పెట్టి ఛైర్మన్‌గా గెల్చినా. ఇప్పుడేదో గ్రాంటు వచ్చిందంట. దాన్ని డ్రా చేసి నాకీయమంటే ఈ సార్ ఇవ్వనంటడు. రెండురోజులైతే నా పదవి పోద్దట. ప్రభుత్వం ఛైర్మన్‌లను రద్దు చేస్తదట. గెల్చిన దగ్గర్నుంచి ఒక్క 10 వేల టాయిలెట్ పనులు చేపిస్తే, ఎవడి వాటా వాళ్ళకు పోను నాకో 2500 మిగిలాయి. అబద్ధం చెప్పడం లేదు. ఇప్పుడొచ్చిన చెక్కు నాకివ్వమంటే పిల్లలకు నోట్సు ఇస్తనంటడు. అవతల 10వేలు ఖర్చు పెట్టి గెల్చినోడు ఎక్కడన్నా పోనీ గానీ, పైసలు వాళ్ళ దగ్గర లేవని సార్ నోట్సులిస్తనంటుండు. ఇంత మాత్రానికి మేము దేనికి గెలిచినట్లు సార్" అంటూ డి.ఇ.ఓ. గారితో పంచాయతీకి దిగాడు.

టీచర్ తన బాధను తానే అణచుకుంటూ విద్యాకమిటీ ఛైర్మన్‌తో "ఆ విషయాలు తర్వాత మాట్లాడుకుందాము కాని డి.ఇ.ఓ. సార్ వచ్చింది వేరే పని వారిని పని చూసుకోనివ్వండి" అని ప్రాధేయ పడ్డాడు. కాని ఛైర్మన్ 'ఇప్పుడే తేలాలి' అంటూ పట్టుబట్టాడు.

నానా రకాల సర్వేలు చేయించుట, రిపోర్టులు ఇవ్వమనడం, కుష్టురోగుల్ని గుర్తించడం, ఎయిడ్స్ రోగులను సర్వే చేయించుట, మెదడువాపు పల్స్ పోలియో చుక్కలు వేయమనడం, క్లీన్ అండ్ గ్రీన్, జనాభా లెక్కలు, ఓటరు లిస్టులు తయారుచేయించుట, ఎన్నికలు విధులు నిర్వహించుట, ఆర్థిక గణాంక సర్వేలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు పేదలను గుర్తించమనుట. అన్ని కార్యక్రమాలకు ప్రచారసాధనాలుగా వాడుకుంటూ ఇట్లానన్నా దారికి రాలేదు కాబట్టి ఆచరణ అమలు సాధ్యం కాని క్యూ.ఐ.పి.లాంటి ప్రోగ్రామ్‌లు నెత్తిన రుద్దడం, ఇదంతా టీచర్లు పిల్లలకు చదువు చెప్పకుండా అడ్డుకోవడానికి చేసే ప్రయత్నాలు

అంతలో హెల్త్ అసిస్టెంట్ వచ్చి "సార్! మెదడువాపు పిల్స్ అందరికీ వేసారా? పాఠశాల పిల్లలకి ఎంతమందికి వేశారు? బడి బయటి పిల్లలకెంతమందికి వేశారు? తండ్రి పేరుతో సహా రాసి అర్జెంట్‌గా ఇవ్వు. నేను మా డి.హెచ్.ఎం.ఓ. గారికి పంపించా" లంటూ తొందర పెట్టసాగింది.

పాపం! టీచర్ పరిస్థితి పిచ్చి పట్టేందుకు సిద్ధంగా వుంది. మధ్యలో ఈవిడేంటి అంటూ ఆమె వైపు చూశాడు. హెల్త్ అసిస్టెంట్ అదేమీ పట్టించుకోకుండా 'రేపు ఆదివారం. పల్స్ పోలియో గుర్తుందా! పిల్లలందరితో ఊరేగింపు నిర్వహించి, దద్దరిలేలా నినాదాలు ఇవ్వు. డోర్ టు డోర్ కాన్వాస్ చేయండి. పొద్దున్నే ప్రోగ్రామ్‌కు హాజరై పిల్లలందరికి డ్రాప్స్ వెయ్యండి. వేలుకు చుక్క పెట్టడం మరవవద్దు" అంటూ తొందరగా చెప్పి వెళ్ళిపోయింది.

డీ లిమిటేషన్ ప్రకారంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. ఓటరు లిస్టు అప్‌టూడేట్ చెయ్యాలని ఆర్.డి.ఓ.గారు ఆదేశించినట్లు గ్రామ కార్యదర్శి అర్డరు కాపీ పాత ఓటరు లిస్టు చేతికి అందించాడు. అందరి గోల విన్న ఉపాధ్యాయునికి చెవులు దిమ్మెక్కి తల మొద్దుబారిపోయింది. తాను డి.ఇ.ఓ. గారితో ఎలా ప్రవర్తించాలో అని అర్థంగాక తల గోక్కున్నాడు. "టీచింగ్ డైరీ వ్రాయలేదు. పిల్లలకు పాఠాలు చెప్పాను అంటున్నావు గదా! అయితే పిల్లల్ని ప్రశ్నలడుగుతాను" అంటూ పిల్లల దగ్గరకి పోయాడు. టీచర్ వాళ్ళవైపు చూస్తూ "వాళ్ళు 'డి' గ్రేడ్ పిల్లలు. అయితే వాళ్ళని ప్రశ్నలడుగుతానుండు అని డి.ఇ.ఓ. గారు మనసులో 'డి' గ్రేడ్ పిల్లల్ని ప్రశ్నలడుగుతున్నందుకు మండిపోయి - పిల్లల మీద ప్రశ్నల వర్షం కురిపించాడు. "మన ముఖ్యమంత్రి పేరు ఏమిటి?" వెంటనే పిల్లవాడు 'వై.ఎస్. రాజశేఖర రెడ్డిగారు' అన్నాడు. "అయితే మన గవర్నరు పేరేమిటి?" అన్నాడు. 'సుశీల్‌కుమార్ షిండే' అన్నాడు. డి.ఇ.ఓ.గారు స్టన్నయి, "మనది ఏ ఖండం" అన్నాడు. 'ఆసియా ఖండం' అన్నాడు. అయితే 'డి' గ్రేడ్ వాడికి ఇంత తెలివితేటలుంటే ఎట్లా అని చెప్పిన జవాబులు బోర్డు మీద వ్రాయమన్నాడు. వెంటనే బెదరకుండా వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని, సుశీల్‌కుమార్ షిండే అని, ఆసియా ఖండమని పిల్లలు వ్రాశారు. డి.ఇ.ఓ.గారికి పట్టరానంత కోపం వచ్చింది. ఇంకో పిల్లవాడ్ని లేపి 'నీ పేరు ఏంటి' అని అడిగాడు. 'శ్రీను' అన్నాడు. "శ్రీను తెల్లచొక్కా వేసుకున్నాడు' అనే వాక్యంలో ఏఏ భాషా భాగాలున్నాయి. చెప్పు?" అని పక్కనున్న మమతను అడిగాడు. వెంటనే అమ్మాయి లేచి "శ్రీను, చొక్కా నామవాచకం తెలుపు విశేషణం, వేసుకున్నాడు క్రియ" అని వినమ్రంగా సమాధానం చెప్పింది. డి.ఇ.ఓ.కు కోపం పెరిగింది. మరొకర్ని లేపి 'అల్పుడెపుడు పలుకు ఆడంబరంగాను, సజ్జనుండు పలుకు చల్లగాను' పద్యం చదువు అన్నారు. పిల్లవాడు గడగడా చదివాడు. "దీని భావం చెప్పు"మన్నాడు డి.ఇ.ఓ. వెంటనే విద్యార్థి లేచి "నీచుడు గొప్పలు చెప్పుకుంటాడు. మంచివాడు మెత్తగా మాట్లాడతాడు" అని సుతి మెత్తగా మాట్లాడాడు.

"గవర్నమెంట్ స్కూళ్ళలో టీచర్లు చదువు చెప్పకూడదు. పిల్లలకు చదువు రాకూడదు. ప్రజలకు గవర్నమెంట్ స్కూల్స్ అన్నా, టీచర్లన్నా అసహ్యం పుట్టాలి. అందరూ తమ పిల్లల్ని ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించుకోవాలి. పిల్లలు లేరన్న సాకుతో ప్రభుత్వ పాఠశాలలు, అమాల్గమేషన్, రేషనలైజేషన్ (స్టాఫ్ రివ్యూ) పేర్లతో మూసివేసి ప్రాథమిక విద్యను కూడా ప్రయివేట్ పరం చేయాలి. ఇది ప్రభుత్వ పాలసీ. దీనికి విరుద్ధంగా నడుచుకుంటున్నావ్" అంటూ డి.ఇ.ఓ. గారు 'నిప్పులాంటి నిజాన్ని' బయటకు వెళ్ళగక్కినాడు.

ఉపాధ్యాయునికి నిలువుకండ్లు వడిపోయి అతడు బాహ్యప్రపంచాన్ని మరిచి డి.ఇ.ఓ. వైపుచూస్తూ శిలలా బిగుసుకుపోయాడు. ఈ పాలసీ తు.చ. తప్పకుండా అమలు కావాలంటే టీచర్లు చదువు చెప్పకుండా, అడ్డుపడాలని అన్ని డిపార్ట్‌మెంట్‌ల వారిని ప్రభుత్వం ఉసిగొల్పి అన్ని రకాల పనులు టీచర్లకు అప్పగించుకుంటూ వస్తుంది.

నానా రకాల సర్వేలు చేయించుట, రిపోర్టులు ఇవ్వమనడం, కుష్టురోగుల్ని గుర్తించడం, ఎయిడ్స్ రోగులను సర్వే చేయించుట, మెదడువాపు పల్స్ పోలియో చుక్కలు వేయమనడం, క్లీన్ అండ్ గ్రీన్, జనాభా లెక్కలు, ఓటరు లిస్టులు తయారుచేయించుట, ఎన్నికలు విధులు నిర్వహించుట, ఆర్థిక గణాంక సర్వేలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు పేదలను గుర్తించమనుట. అన్ని కార్యక్రమాలకు ప్రచారసాధనాలుగా వాడుకుంటూ ఇట్లానన్నా దారికి రాలేదు కాబట్టి ఆచరణ అమలు సాధ్యం కాని క్యూ.ఐ.పి.లాంటి ప్రోగ్రామ్‌లు నెత్తిన రుద్దడం, ఇదంతా టీచర్లు పిల్లలకు చదువు చెప్పకుండాఅడ్డుకోవడానికి చేసే ప్రయత్నాలు అయినా.... నీవు ఈ అడ్డంకుల్ని లెక్క చేయకుండా, తట్టుకొని, 'వృత్తి నిబద్ధత సామాజిక బాధ్యత'ను గుర్తించి , పిల్లలకు చదువు కూడా బాగా చెప్తున్నావ్. ఇది ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ విధానాలకు తూట్లు పొడవడమే. ఇట్లా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న నిన్ను డిస్‌మిస్ చేస్తున్నా. ఇదిగో ఆర్డర్" అంటూ టీచర్ చేతిలో ఆర్డర్ కాపీ ఉంచాడు డి.ఇ.ఓ.

పాపం! టీచర్ మొదలు నరికిన చెట్టులా నేలకూలిపోయాడు. అతన్ని పొడుచుకొని తినడానికి ప్రపంచ బ్యాంకు రాబందులు బడిమీద చక్కర్లు కొడుతున్నాయి. ఇదండీ! ఇప్పుడు టీచర్ ఫ్యూచర్. ❑

హక్కుల నేతల హత్యల్లో ప్రభుత్వం పాత్రేమిటి?

- ఇప్పు వీరారెడ్డి

ప్రతిఘటనో, ప్రతీకారమో లేదా అవినీతికి వ్యతిరేకంగానో ఏదో గాని తమకు టార్గెట్ అయి తాము జరిపిన కాల్పుల్లో ఎం.ఎల్.ఎ. చిట్టెం నరిసిరెడ్డి, ఆయన కుమారుడు వెంకటేశ్వరరెడ్డిలే కాకుండా టార్గెట్ కాని మరో ఏడుగురు మరణానికి కారణమైన మావోయిస్టుల చర్యపై పెల్లుబికిన సానుభూతిని రాజశేఖరెడ్డి ప్రభుత్వం పట్టుమని పదిరోజులు కూడా నిలబెట్టుకోలేకపోయింది. నిజానికి ఈ సంఘటనకు ముందు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలలో పోలీసులకు చిక్కాడని ప్రసారమై, ప్రచారమైన జనశక్తి పార్టీ చర్చల ప్రతినిధి రియాజ్‌ను ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం ద్వారా అప్రజాస్వామిక పాలనను అమలు పరుస్తుందనే తీవ్ర నిరసనలను ప్రజలు, మేధావులు, మిత్రపక్ష, ప్రతిపక్షాల నుండి ఎదుర్కొంది. ఆ సంఘటనపై ఎన్ని సమర్థింపులు చెప్పుకున్నా తనది చట్టబద్ధ ప్రజాస్వామిక పాలనేనన్న విషయంలో ప్రజలను కనీసంగా ఒప్పించలేకపోయినా, నరిసిరెడ్డి ఆయన కుమారుని హత్య సంఘటనలో మరో ఏడుగురి మరణానికి కారణమైన మావోయిస్టుల కాల్పుల చర్యలో అసందర్భం కొంతైనా మరుగున పడిపోయిందనే చెప్పాలి. కాని అంతలోనే శాంతిభద్రతల పరిస్థితి చేజారుతుందనే పాత కారణాన్నే ప్రస్తావించి ప్రతిపక్షాలు, మిత్రపక్షాలను కూడా సంప్రదించకుండా మావోయిస్టు పార్టీని, దాని ప్రజా సంఘాలను నిషేధించి శాంతి కాముకులను ఆందోళనకు గురి చేసింది. అంతటితో ఆగకుండా నిషేధిత సంఘాల జాబితాలో మావోయిస్టు పార్టీ విప్లవ కార్యాచరణతో ఎలాంటి సంబంధమే లేని విప్లవ సాహిత్య సంస్థ అయిన 'విప్లవ రచయితల సంఘాన్ని' కూడా నిషేధించి అన్ని సెక్షన్ల ప్రజానీకం నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటుంది. అది కొనసాగుతుండగానే అగ్నికి ఆజ్యం తోడయినట్లు ఎంఎల్ఏ హత్యకు ప్రతీకారంగా ఆగస్ట్ 15న ఉపాధ్యాయుడు, తెలంగాణా జనసభా నాయకుడు అయిన కనకాచారిని గుర్తు తెలియని వ్యక్తులు 'నర్సా కోబ్రాస్' పేరుతో హత్య కావింపబడడంతో మరింత తీవ్రంగా వెల్లువెత్తుతున్న నిరసనలు ప్రభుత్వాన్నే బాధ్యురాలుగా చూపెడుతున్నాయి.

నర్సిరెడ్డి హత్య జరిగిన మరుసటిరోజే నక్సలైట్ల విధానాలను సమర్థిస్తున్నారనో, వారి సానుభూతిపరులుగానో, కొందరు ప్రజా సంఘాల హక్కుల సంఘాల నాయకులను గుర్తించి, వారిని చంపి తీరుతామని గుర్తు తెలియని సంస్థ 'నర్సా కోబ్రాస్' పేర విడుదలైన ప్రకటనపై కనీస స్పందన లేని ప్రభుత్వం పదిరోజుల వ్యవధిలోనే అందులో ఒకరైన కనకాచారి హత్యకు గురైతే ఆ హత్యతో తనకేమీ సంబంధం లేదనే ధోరణిని ప్రదర్శిస్తుంది. తనను అప్రతిష్ట పరచడానికి మావోయిస్టులతో వైరాన్ని పెంచుకున్న ఎవరో కొందరు వ్యక్తులు చేస్తున్న సంఘటనలుగా పేర్కొంటూ వారిని పట్టుకోవడానికి ప్రజలు, విలేకరులు సహకరించాలని కోరటం ప్రజల భద్రతపై ప్రభుత్వానికున్న నిర్లక్ష్యాన్నే తెలియచేస్తుంది.

హక్కుల నేతలను హత్య చేస్తామని గుర్తు తెలియని సంస్థల ప్రకటనల నేపథ్యంలో స్పందించని ప్రభుత్వం విధానాన్ని సమర్థించే అవకాశం లేనేలేదు. ఎందుకంటే గుర్తు తెలియని హంతక సంస్థ పేరుతో కనకాచారి, మన్నెం ప్రసాద్ తరహా హత్యలు జరగడం ప్రభుత్వాలకు అనుభవంలోకి రాని కొత్త సంఘటనలేమీ కావు కాబట్టి. నిజానికి ఇంతకుముందెన్నడూ ఇలాంటి సందర్భాన్ని ఎదుర్కోలేదన్నప్పుడు ఇప్పటి ఈ సంఘటన విషయంలో కొంతలో కొంతైనా ప్రభుత్వానికి ఒక క్షమాపణ దొరికివుండేది. ఇప్పుడా అవకాశం కూడా లేదు. ఎంఎల్ఎ హత్య మరుసటి రోజే "ఫలానా ఫలానా వారిని చంపేస్తాం" అంటూ 'నర్సా కోబ్రాస్' డెత్‌వారంట్ జారీ చేసిన ప్రభుత్వం ఎందుకు రక్షించలేకపోతుందన్నది సాధారణంగా వచ్చే ప్రశ్న. అదీగాక పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను నిర్బంధానికి ప్రతీకారంగా మావోయిస్టు పార్టీ హత్య చేసిన సందర్భంలో పౌరహక్కుల నేతలను అన్యాయంగా గుర్తు తెలియని సంస్థలు హత్య చేయడం ఈ రాష్ట్రంలో 20 సంవత్సరాలుగా ఒక సంప్రదాయంగానే కొనసాగుతుంది. నాటి పౌర హక్కుల నేత, పిల్లల వైద్యుడు డా.రామనాథం మొదలు లక్ష్మారెడ్డి, ఆమెడ నారాయణ, నర్రా ప్రభాకరరెడ్డి, బెల్లి లలిత, పురుషోత్తం, అజాం అలీ తాజాగా, కనకాచారి, మన్నెం ప్రసాద్ వరకు జరిగిన హత్యలన్నీ గుర్తు తెలియని సంస్థల పేరుతో జరిగినవే. 'ఫియర్ వికాస్', 'గ్రీన్ టైగర్స్' , 'తిరుమల టైగర్స్', 'క్రాంతి సేన' తాజాగా 'నర్సా కోబ్రాస్' వరకు గుర్తు తెలియని హంతక ముఠాల పేరుతో కొనసాగుతున్న అమానుష హత్యాకాండ

ప్రారంభం కొనసాగింపులు నిన్నటి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నేటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి తెలియందేమీ కాదు.

ప్రభుత్వాలు మారుతున్నాయి. పార్టీలు మారుతున్నాయి. వాళ్ళు ఫలానా అని ఈరోజు వరకు ఏ ప్రభుత్వమూ ప్రకటించలేదు. ఎందుకు ? వాళ్ళెవరో ఆచూకీ తెలియదనుకున్నా, తెలుసుకునే ప్రయత్నమైనా జరగాలి. దర్యాప్తు జరపాలి. నేరస్తులను గుర్తించాలి. చట్ట ప్రకారంగా న్యాయస్థానం ముందు నిలబెట్టాలి. ప్రజాస్వామ్యంలో అందరూ చట్టానికి లోబడాల్సిందేనని, దోషులెవరైనా, ఎక్కడున్నా పట్టుకుంటామని వాళ్ళందరూ న్యాయస్థానంలో చట్టప్రకారమే విచారణను ఎదుర్కొని, శిక్షను అనుభవించాల్సిందేనని అలవాటైన రోకటి పాటనే పదేపదే ప్రవచిస్తున్న ప్రభుత్వాలు తన నిజాయితీని ఎన్ని సందర్భాలలో ప్రదర్శించాయి? హత్య చేసిన అనంతరం తామే ఈ హత్య చేశామని హంతక సంస్థలు ప్రకటించుకున్నా, మరికొంతమందిని చంపి తీరుతామన్నా, ప్రభుత్వ స్పందనలలో నిజాయితీ కన్పించడం లేదు. ఎంఎల్ఏ , ఎంపి, మంత్రులు మొదలు గ్రామస్థాయి సర్పంచ్ వరకు కానిస్టేబుల్ మొదలు ఎస్.పి. స్థాయి అధికారుల వరకు, నక్సలైట్‌లచే హత్య గావింపబడిన సందర్భాలలో స్పందిస్తున్న తీరుతో పోలిస్తే హక్కుల నేతల హత్యల సంఘటనలో స్పందిస్తున్న తీరు ప్రభుత్వ పక్షపాత వైఖరినే బయటపెడుతుంది. ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారుల హత్యల సందర్భంలో ప్రభుత్వ స్పందన తీరు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. ఆ హత్యా పథకం రూపకల్పన మొదలు అమలు పరిచేదాకా సహకరించిన వారందరినీ వాళ్ళు మార్చిన స్థలాలు, చేసిన బసలు, వాడిన ఆయుధాలు, ఉపయోగించని వాహనాలు, మాట్లాడిన సెల్‌ఫోన్‌ల దాకా శరవేగంగా కొనసాగిస్తున్న దర్యాప్తుల తీరు ప్రభుత్వ అమోఘమైన సామర్ధ్యానికి సూచికలే గాని హక్కుల నేతల ప్రజాసంఘాల నాయకుల హత్యల విషయంలో ఆ సామర్థ్యంలో ఓ పది శాతమైనా ప్రదర్శించడం లేదు. ఎందుకన్నదే ప్రశ్న.

నక్సలైట్ హత్యలు చేస్తున్న సందర్భాలలో ఆ సంఘటనలకు తామే బాధ్యులమంటూ నక్సలైట్ సంస్థ ఏరియా, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఏదో ఒక స్థాయి ప్రతినిధి పేర ప్రకటన విడుదల చేస్తుంది. మండలానికి ఒకటి చొప్పున పోలీస్ స్టేషన్లు కొనసాగుతున్న ఈ రోజుల్లో ఏ మండలం, ఏ గ్రామం నుంచి, ఏ వ్యక్తి ఎప్పుడు పార్టీలో చేరాడు ? ఏ స్థాయిలో ఏ పేరుతో , ఏ ప్రాంతంలో కొనసాగుతుండనే వివరాలను సేకరించడం ఎంతో సులభంగా సాధ్యపడుతున్న ప్రభుత్వాలకు అదే పద్ధతిలో హక్కుల నేతల హత్యలకు బాధ్యులమంటూ వెలువడుతున్న హంతక సంస్థల సభ్యులను గుర్తించడం మాత్రం ఎందుకు సాధ్యపడడం లేదు?

ప్రభుత్వం ప్రకటించకపోయినా ఈ హత్యా కాండకు పాల్పడిన గుర్తు తెలియని హంతకులెవరన్నది ప్రజలకు స్పష్టమైన అంచనాతో పాటు, వాళ్ళకు ప్రభుత్వం యొక్క ఆశీస్సులు దండిగానే ఉన్నాయన్నది బహిరంగ చర్చనీయాంశం. హక్కుల నేతలనే హత్యలు చేస్తున్న హంతక ముఠాలోని ఏ ఒక్కరూ ఎక్కడా, ఏ ప్రజలకూ కనిపించకపోవడంతో ఈ ముఠా కార్యక్రమంలో ప్రభుత్వమే ప్రత్యక్షంగా పాల్గొంటుండవచ్చుననే అనుమానాలు ప్రజలలో బలపడుతున్నాయి. ఈవిషయాన్ని గుర్తించినా గుర్తించ నట్లు ప్రవర్తిస్తున్న ధోరణి ప్రభుత్వ ప్రతిష్టను మరింతగా దిగజార్చ వచ్చు. ఒకవేళ నిజంగానే గుర్తిస్తున్నా, నక్సలైట్లతో వ్యక్తిగత ద్వేషాన్ని పెంచుకున్న కొందరు వ్యక్తులు చేస్తున్న హత్యోదంతాలుగా ప్రభుత్వం ప్రకటించదలచినట్లయితే భౌతికంగా వాళ్ళెవరో గుర్తించి, చట్టం ముందు నిలబెట్టే ప్రయత్నం చేయాలి. అలాకానంత కాలం ఈ అనాగకరిక చర్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వుంటుంది. "తనకిష్టం లేనిదంతా అసత్య ప్రచారమే" నన్న తీరుగా ప్రభుత్వం భావిస్తే చెప్పేదేం లేదు.

"కాగల కార్యం గంధర్వులే చేసినట్లు" తన రాజకీయ, ఆర్థిక విధానంతో విభేదించి, వ్యతిరేకించే ప్రజాసంఘాల నాయకత్వాన్ని గుర్తు తెలియని హంతక సంస్థలు హత్య చేయడం ప్రభుత్వాలకు తాత్కాలిక ప్రయోజనం కల్గించవచ్చునేమో కానీ, దీర్ఘకాలంలో ప్రజా రక్షణ విషయంలో ప్రభుత్వం పట్ల ప్రజల ఆలోచనా విధానాన్ని ఇది తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు. తమ పాలనా విధానాలను ప్రతిఘటిస్తున్న సాయుధ నక్సలైట్లను, బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా హత్య చేస్తుందన్న అప్రతిష్టను ఎంతైనా మోస్తూనే ఎన్‌కౌంటర్లు చేస్తున్న ప్రభుత్వం చట్టబద్ధ ప్రజా ఉద్యమ నేతల విషయంలో ఆ అవకాశం లేదు కనుకనే గుర్తు తెలియని హంతక సంస్థల పేరుతో జరిగే హత్యల పట్ల మౌనంగా వుంటుందన్న చర్చ ఒకటి వినబడుతున్నది. ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచికైనా, చెడుకైనా సమాన బాధ్యత వహించాల్సిన ప్రజా ప్రభుత్వాలు ఈరకమైన హక్కులనేతలపై జరుగుతున్న గుర్తు తెలియని హంతక ముఠాల హత్యాకాండకు కూడా బాధ్యత వహించాల్సి వుంటుందేమో! శాంతి పరిరక్షణలో ఎట్టి పరిస్థితులలోనూ రాజీ పడబోమని దాపరికానికి అవకాశం లేదని ప్రభుత్వాలు నిజాయితీగా ప్రకటించదలచినట్లయితే ఇకముందు ఈవిధమైన హత్యలకు అవకాశమే వుండదని ప్రకటించాల్సి వుంది. ఆ సమాధానం రానంతకాలం ప్రభుత్వాలు ఈరకమైన హత్యల విషయంలో తాము నిర్దోషులమని ప్రజలను సంతృప్తి పరచలేవు.

❑

గుడ్‌గాంవ్ దమనకాండ ప్రకటిస్తున్న హెచ్చరిక

- ఎన్. వేణుగోపాల్



పదమూడు సంవత్సరాలుగా దేశంలో సాగుతున్న ప్రపంచీకరణ క్రమం మన పారిశ్రామిక రంగాన్ని, సంఘటిత కార్మికోద్యమాన్ని ఏరకంగా మార్చేసిందో అర్థం చేసకోవడానికి గుడ్‌గాంవ్ దమనకాండ ఒక ప్రబలమైన చిహ్నం. గుడ్‌గాంవ్‌లోని హోండా ఉత్పత్తి యూనిట్‌లో కార్మికులు ఐక్యం కావడాన్ని దెబ్బతీయడానికి కొన్ని నెలలపాటు జరిగిన ప్రయత్నాలు చివరికి జులై 25న బహిరంగంగా దమనకాండగా మారాయి. టి.వి. ఛానళ్ళు, పత్రికల కెమెరాలు చూస్తుండగానే కార్మికుల మీద అమానుషంగా పోలీసుల దాడి సాగింది. గుడ్‌గాంవ్ దేశ రాజధానికి సమీపంలో ఉండడం వల్ల, ఈ దారుణ దమనకాండ సాగుతున్న సమయానికి పార్లమెంటు సమావేశాలు జరుగుతుండడం వల్ల, హోండా కార్మిక యూనియన్‌కు ప్రఖ్యాత పార్లమెంటేరియన్, సిపిఐ నాయకుడు గురుదాస్ దాస్‌గుప్తా నాయకత్వం వహిస్తుండడం వల్ల గుడ్‌గాంవ్ దారుణానికి ఎక్కువ ప్రాచుర్యమే లభించింది. దేశ వ్యాపితంగా ఈ దురంతంపై పెద్ద చర్చే జరిగింది. కాని రెండు నెలలుగా సాగుతున్న ఈ చర్చలో అత్యధిక భాగం జరిగిన ఘోరం గురించి మాట్లాడడానికే తప్ప, ఆ ఘోరం ఎందుకు జరిగిందో పూర్వాపరాలలోకి వెళ్ళే ప్రయత్నం జరగలేదు. గుడ్‌గాంవ్ ఘటన ప్రపంచీకరణ క్రమానికి తార్కిక ఫలితం. అందువల్ల ఈ దురంతం నుంచి సరైన పాఠాలు తీసుకుంటే, ఇప్పటికైనా ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఒక బలమైన ప్రజా ఉద్యమాన్ని, ముఖ్యంగా కార్మికోద్యమాన్ని నిర్మించడం సాధ్యమవుతుంది. కాని ప్రపంచీకరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పుకునే పార్టీలు, కార్మిక సంఘాలు కూడ ఆ దిశలో ప్రయత్నాలు ప్రారంభించలేదు. కనీసం సంఘటిత కార్మికవర్గం ఇప్పటివరకు పోరాడి సాధించుకున్న ప్రయోజనాలను నిలబెట్టుకోవడానికైనా, గుడ్‌గాంవ్ దురంతం హెచ్చరికగా, ఉద్యమం ప్రారంభించవలసి ఉండగా అటువంటి ప్రయత్నాలేమీ కనబడడం లేదు.

ఈ నేపథ్యంలో అసలు గుడ్‌గాంవ్‌లో ఏం జరిగింది, ఎందుకు జరిగింది, ఆ జరిగిన ఘటనను ఎట్లా అర్థం చేసుకోవలసి ఉంది, దానికి ప్రతిగా ఏమి చేయగల అవకాశాలున్నాయి వివరంగా చర్చించుకోవాలి.

నిజానికి గుడ్‌గాంవ్ లాఠీ చార్జిని అర్థం చేసుకోవాలంటే అంతకు ముందు కొన్ని నెలలుగా హోండా కర్మాగారంలో సాగుతున్న ఘర్షణలను, యాజమాన్యం అనుసరిస్తూ వచ్చిన కార్మిక వ్యతిరేక వైఖరిని అర్థం చేసుకోవలసి ఉంటుంది.

ప్రపంచీకరణ వెల్లువలో ఈ దేశంలో ప్రవేశించిన అనేక బహుళజాతి సంస్థలలో జపాన్‌కు చెందిన హోండా మోటర్స్ అండ్ స్కూటర్స్ ఒకటి. గుడ్‌గాంవ్ జిల్లాలోని మనెసర్‌లో, ఢిల్లీకి ముప్పై కిలోమీటర్ల దూరంలో హోండా తన ఉత్పత్తి కర్మాగారాన్ని తెరిచింది. ఈ కర్మాగారంలో దాదాపు మూడువేలమంది కార్మికులు, సిబ్బంది పనిచేస్తున్నారు. అందులో అత్యధికులు ఉద్యోగ భద్రత లేని స్థితిలో కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులుగానే పని చేస్తున్నారు. ఒకవైపు ఉద్యోగ భద్రత లేకపోవడం మాత్రమే కాక పని పరిస్థితులలో కూడా హోండా కార్మికులు, సిబ్బంది దారుణమైన స్థితిని అనుభవిస్తున్నారు. ఎక్కువ పని భారం ఉండడం, కార్మికులను మరింత ఎక్కువగా పిండి ఎక్కువ ఉత్పత్తి సాధించాలని అనుకోవడం యాజమాన్యాలకు మామూలే. కాని హోండా కర్మాగారంలో ఇటువంటి పని ఒత్తిడితో పాటుగా, కార్మికులకు విశ్రాంతి సౌకర్యాలు లేకపోవడం, కార్మికులను నిరంతరం అవమానించడం వంటి పనులతో కూడ ఒత్తిడి పెంచుతూ వచ్చారు. చివరికి కార్మికులు ఎక్కువసేపు మరుగుదొడ్లకు వెళ్ళడానికి వీలు లేదని కూడ యాజమాన్యం శాసించింది. మరుగుదొడ్లకు వెళ్ళే కార్మికుల మీద నిఘా కోసం మరుగుదొడ్లకు తలుపులు లేకుండా నిర్మింపజేసింది. మహిళా కార్మికుల మరుగుదొడ్లను కూడా ఇదేవిధంగా నిర్మింపజేసి వారు నిత్యం అవమానాలకు గురయ్యేలా చేసింది.

ఈ పని పరిస్థితుల నేపథ్యంలో కార్మికుల్లో చాల సహజంగా, అనివార్యంగా అసంతృప్తి పెరిగిపోయింది. ఈ అసంతృప్తి నుంచి బైటపడాలని, కార్ఖానాలో పని పరిస్థితులు మెరుగుపరచుకోవాలంటే సంఘటితం కాకతప్పదని కార్మికులు ఆలోచించడం ప్రారంభించారు. మరొక వైపు నుంచి గత ఆరు నెలలుగా యాజమాన్యానికీ, కార్మికులకూ మధ్య ఏదో ఒక విషయమై ఘర్షణలు పెరగడం మొదలయింది. హోండా వైస్ ప్రెసిడెంట్లలో ఒకరయిన హిరోషె అనే జపాన్‌కు చెందిన యాజమాన్య ప్రతినిధి కార్మికుల పట్ల ప్రవర్తిస్తూ వచ్చిన తీరు ఈ ఘర్షణలకు ఆజ్యం పోసింది. 2004 డిసెంబర్ 16న వెల్డ్‌షాప్‌లో పనిచేస్తున్న రాజేష్ అనే కార్మికుడిని హిరోషె తన్నాడు. తోటి కార్మికుడి పట్ల జరిగిన ఈ అవమానాన్ని కార్మికులందరూ నిరసించారు. యాజమాన్య ప్రతినిధులతో, ముఖ్యంగా జపనీయులతో కార్మికులే జాగ్రత్తగా మెలగాలని యాజమాన్యం కార్మికులను హెచ్చరించి ఈ సమస్యను పరిష్కరించాననుకుంది. మరికొద్ది రోజులకే హిరోషె ఒక సిక్కు కార్మికుడి తల మీద కొట్టి అతని పాగాను ఊడబెరికాడు.

ఈ అవమానాలతో కోపోద్రిక్తులైన కార్మికులు ఇక సంఘటితం కాక తప్పదని నిర్ణయించుకున్నారు. హోండా ఎంప్లాయీస్ యూనియన్ పేరుతో కార్మిక సంఘాన్ని ఏర్పరచుకుని, దాన్ని 2005 మే 30న రిజిస్టర్ చేయించారు. ఆ యూనియన్‌ను భారత కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో నడిచే ఎఐటియుసికి అనుబంధ సంస్థగా ప్రకటించారు.

తమ కంపెనీలో కార్మికులు సంఘటితమయి కార్మిక సంఘం స్థాపించడాన్ని సహించలేకపోయిన యాజమాన్యం ఏ విధంగానయినా కార్మికుల సంఘీభావాన్ని దెబ్బతీయాలని ప్రయత్నాలు ప్రారంభించింది. మొట్ట మొదట ఏర్పడిన యూనియన్‌ను చీల్చడానికి ప్రయత్నించింది. అది సాధ్యం కాకపోయేసరికి కంపెనీకి లాకౌట్ ప్రకటించింది. ఉన్న కార్మికులనందరినీ తొలగించి కొత్త రిక్రూట్‌మెంట్ కోసం ప్రయత్నించింది. ఈ క్రమాన్ని అర్థం చేసుకుంటేగాని జూలై 25 లాఠీచార్జ్ నేపథ్యం అర్థం కాదు.

మామూలుగా హోండా కార్మికులు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే కంపెనీకి చేరవలసి ఉంటుంది. అలా చేరడానికి జూన్ 27 ఉదయం బస్సులు రాలేదు. కార్మికులు తమంతట తామే కంపెనీకి చేరుకునే సరికి కంపెనీ గేటుకు లోపలా బయటా వందలాదిగా పోలీసులున్నారు. గేటు తాళం వేసి ఉంది. గేటు దగ్గర పెట్టిన నోటీసులో తమ సత్ప్రవర్తన గురించి హామీ ఇచ్చిన కార్మికులనే ఫ్యాక్టరీ లోపలికి అనుమతిస్తామని రాసిపెట్టారు. అంటే ఎంప్లాయీస్ యూనియన్‌లో సభ్యులుగా చేరని వాళ్ళనే అనుమతిస్తామని యాజమాన్యం ప్రకటించిందన్నమాట.

ఆరోజు ఎనిమిదిన్నర కల్లా కార్మికులందరూ అక్కడ చేరారు. అందరికందరూ సత్ప్రవర్తన కలిగి ఉంటామని, యూనియన్‌లో చేరబోమని రాసి ఇవ్వడానికి అంగీకరించారు. ఈ పరిణామాన్ని ఊహించని యాజమాన్యం పాత కార్మికులందరినీ ఉద్యోగాలనుంచి తొలగిస్తున్నామని కనుక వారికి కంపెనీకి వందగజాల పరిధి లోపలికి వచ్చే హక్కు లేదని ప్రకటించింది. మర్నాటినుంచీ కొత్త కార్మికులను నియమించడం ప్రారంభించింది. అప్పటి నుంచీ పాత కార్మికులు ప్రతిరోజూ కంపెనీకి వచ్చి ఎదురుగా పార్కులో కూర్చునేవారు. యాజ

గుడ్‌గావ్‌లో సంఘటన ఏదో హఠాత్తుగా ఆకాశం నుంచీ ఊడి పడ్డదికాదు. 1992 నుంచి ప్రభుత్వాలు ఉద్దేశ్య పూర్వకంగా అమలు చేస్తున్న రాజకీయార్థిక విధానాల సహజ ఫలితంగానే ఈ దారుణ దమనకాండ జరిగింది. అందువల్ల గుడ్‌గావ్‌లో లాఠీ చార్జ్‌ని ఒకానొక కార్ఖానాలో జరిగిన ఒక కార్మిక వివాదంగా మాత్రమే కాక ప్రపంచీకరణ విధానాలలో అనివార్యమైన క్రమంగా అర్థం చేసుకోవాలి.

మాన్యంతో చర్చలు జరపాలని ప్రయత్నించేవారు. యాజమాన్యం కార్మిక శాఖతో జరిపిన చర్చలలో రోజుకొక మాట మాట్లాడుతూ పోయింది. ఈ చర్చోపచర్చల తరువాత కార్మికులు జూలై 11న ఒక ఊరేగింపు జరిపి ప్రభుత్వానికీ, యాజమాన్యానికీ తమ డిమాండ్లను తెలియజేయదలిచారు. కానీ ప్రభుత్వం 144వ సెక్షన్ విధించి ఊరేగింపును భగ్నం చేసింది. కార్మికులు అక్కడే ఒక పార్కులో సమావేశం కాగా జిల్లా అధికారులు అక్కడికేవచ్చి కార్మికుల విజ్ఞాపన పత్రం తీసుకున్నారు. ఈ లోగా నలుగురు యూనియన్ నాయకులను ఉద్యోగాల నుంచి తొలగించడం, 40 మంది కార్మికులను సస్పెండ్ చెయ్యడం కార్మికులను మరింత ఆగ్రహానికి గురిచేశాయి. సి.పి.ఐ. నాయకుడు గురుదాస్ దాస్ గుప్తా ఈ సమస్యపై తాను రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతానని, ఆ తర్వాత జూలై 28న పార్లమెంటు ముందర ప్రదర్శన జరుపుదామని అన్నాడు.

పార్లమెంటు ప్రదర్శన కంటే ముందే మళ్ళీ ఒకసారి జిల్లా యంత్రాంగానికి తమ డిమాండ్లు వివరించాలని అనుకున్న కార్మికులు జూలై 25 ఉదయం ఊరేగింపు ప్రారంభించారు. ఆ ఊరేగింపు మీద రెండుసార్లు పోలీసులు లాఠి చార్జ్ చేసి కార్మికులను చితకబాదారు. ఆ లాఠీచార్జ్ దృశ్యాలన్నీ టి.వి. తెరలమీద, పత్రికలలోనూ దేశవ్యాప్తంగా ప్రచారమయ్యాయి.

ఇక్కడ గుర్తించవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి. మొట్ట మొదటిది ప్రపంచీకరణ వెల్లువలో ఈ దేశంలోకి ప్రవహిస్తున్న విదేశీ పెట్టుబడిని మన ప్రభుత్వాలు ఎంత నిరభ్యంతరంగా, ఎంత ఆంక్షలు లేకుండా, ఉన్న ఆంక్షలను ఎంతగా సరళీకరిస్తున్నాయో, ఆహ్వానిస్తున్నాయో చూడాలి. అంతకుముందే పారిశ్రామిక వివాదాల చట్టం అనేక కార్మిక సంక్షేమ చట్టాల లొసుగులతోనూ, యాజమాన్యలకు అనుకూలంగానూ ఉంటూ వచ్చాయి. ఇక 1992 తరువాత విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కొరకు విదేశీ పెట్టుబడులకు అనుకూలమైన చట్టాలు తీసుకరావడం, ప్రతికూల చట్టాలను రద్దు చేయడం, సవరణలు చేయడం జరుగుతూ వచ్చింది. ఒకవైపు దేశీయ పరిశ్రమలనూ, ప్రభుత్వ రంగ సంస్థలనూ చిన్నాభిన్నం చేస్తూ మరోవైపు విదేశీ పెట్టుబడులకొరకూ, సంస్థల కొరకు వెంపరలాడడం జరిగింది. ప్రభుత్వం వైపునుంచి సాగుతున్న ఈ వెంపరలాటను గమనించిన బహుళజాతి సంస్థలు మన ప్రభుత్వాల మీద అంతకంతకూ ఎక్కువ డిమాండ్లు పెడుతూ పోయాయి. హిరణ్యాక్ష వరాలు కోరాయి. తామ కార్మికులతో ఏవిధంగా ప్రవర్తించినా ఈ దేశ సంపదను ఎంతగా కొల్లగొట్టినా ఎవరూ ప్రశ్నించడానికి వీలు లేని ఒక స్థితిని కల్పించుకున్నాయి. అందువల్ల గుడ్‌గావ్‌లో సంఘటన ఏదో హఠాత్తుగా ఆకాశం నుంచీ ఊడి పడ్డదికాదు. 1992 నుంచి ప్రభుత్వాలు ఉద్దేశ్య పూర్వకంగా అమలు చేస్తున్న రాజకీయార్థిక విధానాల సహజ ఫలితంగానే ఈ దారుణ దమనకాండ జరిగింది. అందువల్ల గుడ్‌గావ్‌లో లాఠీ చార్జ్‌ని ఒకానొక కార్ఖానాలో జరిగిన ఒక కార్మిక వివాదంగా మాత్రమే కాక ప్రపంచీకరణ విధానాలలో అనివార్యమైన క్రమంగా అర్థం చేసుకోవాలి.

అలా అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే ఇటువంటి ఘటనలకు ప్రతిగా ఏమి చేయగలమో ఆలోచించడం సాధ్యమవుతుంది. లేకపోతే ప్రస్తుతం జరిగినట్లుగా వామ పక్ష ట్రేడ్ యూనియన్ కూడా దీనిని ఒకానొక కంపెనీలో సమస్యగా మాత్రమే చూసి దానిని పరిష్కరించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందం యజమానులకే అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా కుదిరింది. అందువల్లనే కార్మికుల తక్షణ సమస్యలపై పరిష్కారం కొరకు పోరాడుతూనే అదే సమయంలో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇమిడి ఉన్న రాజకీయార్థిక విధానాలు గురించి కూడా ఆలోచించవలసి వుంది. కార్మిక సంక్షేమ చట్టాలను, ఉద్యోగ భద్రత, పని పరిస్థితుల మెరుగుదల, పనిస్థలంలో సౌకర్యాలూ, యాజమాన్యాలు తప్పనిసరిగా అనుసరించవలసిన విధానాలూ మొదయిన చట్ట బద్ధ హామీల కొరకు పోరాడవలసి ఉంటుంది. కార్మికులకు ఉన్న సంఘటితమయ్యే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు ఎట్టి పరిస్థితుల్లోనూ భగ్నం కాకూడదని పోరాడవలసి వంది. కార్మికులకూ యాజమాన్యానికీ మధ్య వివాదాలు తలెత్తినప్పుడు కార్మిక శాఖ పౌర, అధికార యంత్రాంగం జోక్యం చేసుకుని పరిష్కరించాలి గానీ, పోలీసు యంత్రాంగం జోక్యం చేసుకుని కార్మికులకు వ్యతిరేకంగా, యాజమాన్యుల తరపున బలప్రయోగం ఎయ్యకూడదని డిమాండ్ చెయ్యవలసి వుంది. పదమూడు సంవత్సరాలుగా దిగజారుతూ వచ్చిన, బలహీనపడుతూ వచ్చిన భారత సంఘటిత కార్మికోద్యమం గుడ్‌గావ్ సంఘటనలతో నయినా మేలుకోవాలి. ప్రపంచీకరణ వ్యతిరేక పోరాట దీక్ష సంతరించుకోవాలి. ❑



మరో ప్రపంచం పిలుస్తోంది!

- కొణతం దిలీప్

సోవియట్ యూనియన్ పతనం తర్వాత ఏకధృవ ప్రపంచం, గ్లోబలైజేషన్ మార్గంలో శరవేగంగా అడుగులేస్తున్న దశలో ఒక కొత్త మెరుపు మెరిసింది. 'దేరీజ్ నో అదర్ ఆల్టర్నేటివ్' - ఇది వినా మార్గం లేదు అంటూ హుంకరిస్తున్న సామ్రాజ్యవాదులకు సరికొత్త సవాల్ విసిరిందో 'దక్షిణ' దేశం.

అభివృద్ధి అంటే అసలు అర్థం ఇదీ అంటూ ప్రపంచానికో కొత్త దిశానిర్దేశం చేస్తున్న ఆ దేశం వెనిజ్యులా. దేశాధ్యక్షులు హ్యూగో చావెజ్. పేదవాడి బాగు కొరకు ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తూ, అమెరికా ఆగ్రహించినా లక్ష్య పెట్టకుండా తనతో కలిసి వచ్చే దేశాలతో ఒక కూటమిని నిర్మించి, సమ సమాజాన్ని నిర్మించాలని కలలు కంటున్న ఆ స్వాప్నికుడి గురించి కొంచెం తెలుసుకుందాం.

1998 డిసెంబర్ 6న జరిగిన అధ్యక్ష ఎన్నికలలో హ్యూగో చావెజ్ రికార్డు మెజారిటీతో నెగ్గాడు. పేదరికం, అవినీతిని నిర్మూలిస్తానని ప్రచారం చేసిన చావెజ్ వెనిజ్యులా ప్రజల మననులను గెలుచుకున్నాడు. ఆ వెంటనే అనేక శాసన సంస్కరణలు చేపట్టాడు. కొత్త రాజ్యాంగం తయూరుచేయించాడు. తను ఎంతగానో అభిమానించే దక్షిణ అమెరికా స్వాతంత్ర్యయోధుడు సైమన్ బొలీవర్ స్ఫూర్తిగా వెనిజ్యులా పేరుని 'బొలివేరియన్ రిపబ్లిక్ అఫ్ వెనిజ్యులా'గా మార్చాడు.

సోషలిస్టు విధానాలు

చావెజ్ అధికారంలోకి వచ్చాక అనేక సోషలిస్టు విధానాలు చేపట్టాడు. అందులో హైడ్రో కార్బన్ చట్టం, భూమి చట్టం ముఖ్యమైనవి.

వెనిజ్యులా ఎగుమతులలో చమురుదే సింహభాగం. అక్కడి జాతీయ చమురు కంపెనీ పెట్రోలియోస్ డి వెనిజ్యులాను లాభాల బాట పట్టించడానికి అనేక సంస్కరణలు చేపట్టాడు చావెజ్. అయితే మన దేశంలోలాగాకాక అక్కడ కేవలం వైట్ కాలర్ ఉద్యోగులనే తొలగించడం జరిగింది. క్రింది స్థాయి ఉద్యోగులు ఎవరినీ ముట్టుకోలేదు. చమురు వెలికితీతలో అర్జెంటీనా, బ్రెజిల్, భారత్, చైనా వంటి దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి స్వీకారం చుట్టాడు చావెజ్. 'పెట్రోలియోస్ డి వెనిజ్యులా'ను పూర్తి ప్రభుత్వ నియంత్రణ క్రిందకు తెచ్చి దాన్ని కనీ వినీ ఎరుగని లాభాలబాట పట్టించాడు.

పేద ప్రజలకు ఉచితంగా వైద్య సదుపాయం అందించేందుకు బారియో అడెంట్రో అనే కొత్త పథకం రూపొందించబడింది. దేశంలో అక్షరాస్యత పెంచడానికి మిషన్ రాబిన్‌సన్, మిషన్ సుక్రే అనే కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ పథకాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ)తో సహా అనేక అంతర్జాతీయ సంస్థల ప్రశంసలందుకున్నాయి.

2004లో చమురు అమ్మకాల ద్వారా లభించిన 25 బిలియన్ డాలర్లను ప్రజా సంక్షేమానికి ఉపయోగించి 'నూతన సోషలిస్టు విప్లవం' తేవడానికి చావెజ్ ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగానే దేశమంతటా ఉచిత వైద్యశాలలు నిర్మించారు. పేదలకు ఆహార సబ్సిడీ ఇవ్వబడింది. అనేక సహకార కర్మాగారాలు నెలకొల్పారు.

భూ సంస్కరణలు

వెనిజ్యులాలో ఆహార ధాన్యాల ఉత్పత్తి చాలా తక్కువ. ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచడం, నిరుద్యోగం, పేదరికం తగ్గించడం అనే లక్ష్యాలతో హ్యూగో చావెజ్ భూ సంస్కరణలు మొదలుపెట్టాడు. వినియోగంలో లేని ప్రయివేట్ భూములపై పన్ను వేయడం, ప్రయివేటు మిగులు భూములను స్వాధీనం చేసుకొని భూమి లేని పేదలకు పట్టాలను ఇవ్వడం ఇందులో ముఖ్యాంశాలు.

సహకార దుకాణాలు

పేదలకు అందుబాటులో నిత్యావసర సరుకులు అందించేందుకు 'మెర్‌కాల్' అనే సహకార దుకాణాల చైన్ స్థాపించబడింది



వెనిజ్యులాలో. ఎక్కువగా పేద ప్రజలు నివసించే వాడలలో ఈ మెర్కాల్ స్టోర్స్ నెలకొల్పబడ్డాయి. ఈ స్టోర్స్‌లో దాదాపు 50% వరకు డిస్కౌంట్‌లో సరుకులు అమ్ముతారు. ఈ సరుకులలో అధికశాతం చిన్న రైతులు, చిన్న తరహా పరిశ్రమలు , సహకార సంస్థల ఉత్పత్తులు అమ్ముతారు.

లాటిన్ అమెరికా కొరకు టీవీ ఛానల్

ప్రస్తుతం వెనిజ్యులాలో వున్న టెలివిజన్ నెట్‌వర్క్‌లు అన్నీ పెట్టుబడిదారీ దృక్పథంతో నడిచేవే. ఈ మెయిన్‌స్ట్రీమ్ మీడియా సహజంగానే చావెజ్ 'సోషలిస్టు విధానాల'ను తీవ్రంగా తూర్పారపడుతుంది. అయితే ఈ దుష్ప్రచారాన్ని ఎదుర్కోవడానికి ఒక స్వంత టెలివిజన్ నెట్‌వర్క్ అవసరమని తెలుసుకున్న చావెజ్ 'టెలిసుర్' అనే కొత్త టీవీ ఛానెల్‌కు అంకురార్పణ చేశాడు. లాటిన్ అమెరికా దేశాలన్నింటికీ ప్రసారాలనందించే 'టెలిసుర్' అప్పుడే పెద్ద చర్చనీయాంశమైంది.

అమెరికా గుండెల్లో అగ్నిపర్వతం

తన ముక్కు క్రింద వున్న దక్షిణ (లాటిన్) అమెరికా దేశాల అంతర్గత వ్యవహారంలో జోక్యం అమెరికాకు ఎన్నో దశాబ్దాలుగా వున్న దురలవాటు. తన ప్రపంచాధిపత్యం కాపాడుకోవాలనే కాంక్షతో కమ్యూనిజాన్ని ఎక్కడా బ్రతికి బట్ట కట్టనీయొద్దు అన్న ద్వేష భావంతో అమెరికా, లాటిన్ అమెరికన్ దేశాల చరిత్రను రక్తసిక్తం చేసింది. చిలీ, పనామా, కొలంబియా, అర్జెంటీనా ఇలా ఒకటేమిటి సమస్త లాటిన్ అమెరికా దేశాలు అమెరికా బారిన పడి క్షోభను అనుభవించినవే. హ్యూగో చావెజ్ కూడా సహజంగానే అమెరికా ఆగ్రహానికి గురయ్యాడు. అనేకసార్లు సి.ఐ.ఎ. తన వేగుల సహాయంతో చావెజ్‌ని అంతం చేయాలని, గద్దె దించాలని విఫల ప్రయత్నం చేసింది. అమెరికా నుండి పొంచివున్న ఈ ముప్పును ఎదుర్కోవడానికి అనేక ప్రపంచ దేశాలతో వ్యూహాత్మక సంబంధాలు ఏర్పరచుకున్నాడు చావెజ్.

ఇందులో భాగంగానే లాటిన్ అమెరికా దేశాలన్నింటినీ ఒక త్రాటిపైకి తెచ్చే బృహత్ కార్యక్రమం చేపట్టాడు చావెజ్. పెట్రోసుర్, టెలిసుర్, మెర్కోసుర్ వంటి సంస్థలను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమంలో మొదటి మెట్టు. అనేక లాటిన్ అమెరికా దేశాలతో ద్వైపాక్షిక , వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది.

ఇక అమెరికాకు 50 ఏళ్ళుగా పక్కలో బల్లెంగా వున్న క్యూబా దేశాధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రోతో హ్యూగో చావెజ్‌కున్న మైత్రి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. నేడు క్యూబా, వెనిజ్యులా అనేక వాణిజ్య, వాణిజ్యేతర ఒప్పందాలను చేసుకొని పరస్పరం సహకరించుకుంటున్నాయి. కాస్ట్రో, చావెజ్ తరచూ పలు వేదికలపై కలసి సామ్రాజ్య వాద వ్యతిరేక పోరాటానికి పిలుపునిస్తున్నారు. వెనిజ్యులా, క్యూబాకు రోజుకు 53 వేల బ్యారెళ్ళ చమురు సబ్సిడీ ధరకు విక్రయిస్తుంది. ఇందుకు ప్రతిఫలంగా వేలమంది క్యూబన్ డాక్టర్లు, టీచర్లు వెనిజ్యులాలోని పేద ప్రజలకు విద్య, వైద్యం అందచేస్తున్నారు.

ప్రజాస్వామ్య సోషలిజం

2005 జనవరి 30 నాడు బ్రెజిల్‌లో వరల్డ్ సోషల్ ఫోరం సమావేశంలో చావెజ్ 'ప్రజాస్వామ్య సోషలిజా'నికి మద్దతు ప్రకటించాడు. "ఒక కొత్త తరహా సోషలిజం - మానవీయ కోణం నుండి ఉద్భవించింది - యంత్రాలను , రాజ్యాన్ని గాక మనిషిని ప్రాధాన్యంగా భావించేది - ప్రజాస్వామ్య సోషలిజం" అని పిలుపునిచ్చాడు.



స్వంత వనరులున్నప్పుడు ఏ దేశమూ ఇంకొక దేశం అదుపాజ్ఞలలో ఉండాల్సిన అగత్యం లేదనీ, పెట్టుబడిదారీ విధానాలే గత్యంతరం కాదనీ, అంకిత భావం ఉంటే సమసమాజ స్థాపన సాధ్యమేనని నిరూపిస్తున్న ఈ సోషలిస్టు దేశాధ్యక్షుడిని చూసి మన పాలకులు కొంతైనా నేర్చుకుంటే సంతోషం.

❑

అసంపూర్ణ ఎజెండాగా స్త్రీ విద్య

(గత సంచిక తరువాయి)

- కాత్యాయనీ విద్మహే,
తోట జ్యోతీరాణి

4

వ్యక్తి స్వేచ్ఛకు విద్య ఒక విలువైన సాధనం. ఈ విలువ వివిధ మార్గాలలో, మానవ జీవితాలలో అభివ్యక్తమై అభివృద్ధి కారకంగా వుంటుందని అమర్త్యసేన్, జీన్‌డ్రెజ్ అభిప్రాయపడ్డారు. విద్య వ్యక్తికి ఆత్మవిశ్వాసాన్ని కలిగించే శక్తి. ఆ శక్తి కారణంగా స్వేచ్ఛాసాధనా మార్గం సులభం అవుతుంది. వ్యక్తి విద్యను పొందడం వలన మరెన్నో పనులు చేయడానికి అది సహాయకారి అవుతుంది. ఆర్థిక అవకాశాలు అందిపుచ్చుకొనడానికి ఆదాయమార్గాలను విస్తృతం చేసుకొనడానికి, తద్వారా స్వేచ్ఛను పొందడానికి వీలవుతుంది. సామాజిక సమస్యల చర్చకు విద్య వేదికను సిద్ధం చేస్తుంది. సామాజిక అవసరాల కోసం సమష్టి కృషికి మనుషులను ప్రేరేపిస్తుంది. సమాజంలో విద్య అందరికీ అందుబాటులోకి వచ్చే క్రమంలో బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు మొదలైన సామాజిక రుగ్మతలు అంతరించి పోతాయి. విద్య వల్ల సామాజిక జీవితం ఏర్పడి ఆలోచనా పరిధి విస్తరిస్తుంది. మరీ ముఖ్యంగా విద్య పీడిత వర్గాలలో పీడన నెదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. రాజకీయంగా సమీకృతం కావటానికి తోడ్పడుతుంది. ఇంటా బయటా తమకు రావలసిన వాటిని హక్కుగా పొందే అవకాశాలను మెరుగుపరుస్తుంది.

విద్య వల్ల లభించే ఈ ప్రయోజనాలు ప్రజలందరూ పొందగలిగినపుడు ఆ సమాజం నిజమైన పౌర సమాజం అవుతుందనేది నిర్వివాదాంశం. అయితే ఈ ప్రయోజనాలు అందరూ పొందడానికి అవరోధంగా వుండే అవలక్షణాలు సమాజం పునాదులలో వున్నాయని మనకు తెలుసు. అవసరాలు, అవకాశాలు, విద్య స్వభావం, వ్యక్తి చైతన్యస్థాయి, ప్రయోజనాల దృష్టి వీటన్నింటి సాపేక్షతలోనే విద్య వల్ల లభించే ప్రయోజనాలను ప్రజలు అందుకోగలుగుతారు. స్త్రీలకు ఇది మరీ వర్తిస్తుంది. స్త్రీలందరూ ఇంత సరళంగా విద్యా ప్రయోజనాలు పొందారని చెప్పలేము కానీ మొత్తంగా స్త్రీల చైతన్యంలో, సామాజిక కార్యాచరణలో విద్య వల్ల లభించిన ఈ ప్రయోజనాలు కీలకమైన పాత్ర నిర్వహించాయని మాత్రం చెప్పవచ్చు.

సంస్కరణోద్యమ కాలం నుండీ కొన్ని పరిమితులలోనైనా విద్యావంతులైన స్త్రీలు స్వేచ్ఛాకాంక్షను వ్యక్తం చేయటం, స్వేచ్ఛాసాధనకు కృషి చేయడం కనిపిస్తుంది. వితంతువుల వరకైనా విద్య ఆర్థిక అవకాశాలను అంది పుచ్చుకొనడానికి పుట్టింటికో, అత్తింటికో భారంగా ఆర్థిక పరాధీనతతో ఆత్మగౌరవరాహిత్యంతో బ్రతకాల్సిన అవసరం లేకుండా చేసింది. 20వ శతాబ్ది ప్రారంభానికే స్త్రీలు, స్త్రీల అభివృద్ధికి ఆటంకంగా వున్న సామాజిక సమస్యలను చర్చించే వేదికలుగా చేసుకొని పత్రికలను నడపటానికి, సంఘాలు ఏర్పరచుకొనటానికి కారణం విద్యేనన్న విషయాన్ని కాదనలేం. స్త్రీ విద్య కొరకు, బాల్య వివాహాల నిర్మూలనకొరకు, మెరుగైన సమాజం కొరకు జరిగిన వివిధ ఉద్యమాలలో పని చేసింది విద్య వల్ల లభించిన వివేకం కారణంగానే. మానవ వ్యక్తులుగా తమకూ పౌరహక్కులన్నీ సంక్రమిస్తాయని వాదించి సంఘర్షించే చైతన్యస్థాయిని స్త్రీలకు విద్య ఇచ్చింది. రాజకీయాలలో భాగస్వామ్యం కొరకు జాతీయోద్యమకాలంలో స్త్రీలు డిమాండ్ చేయగలిగారు.

స్వాతంత్ర్యానికి పూర్వం సాధించిన ఈ ప్రగతి స్వాతంత్ర్యానంతరం కూడా ప్రధాన స్రవంతిలో ఒక పాయగా కొనసాగి వస్తున్నది. చదువుకొన్న స్త్రీలు స్వీయ గుర్తింపుకై ఆరాటపడడం అరవైల నాటికే ప్రారంభమైంది. వ్యక్తులుగా, పౌరులుగా గుర్తింపు కోసం ఇంటా బయటా స్త్రీలు పడుతున్న సంఘర్షణ, ఆందోళన ఈనాడు స్త్రీవాద ఉద్యమంగా ఒక గుణాత్మక రూపాన్ని తీసుకొన్నది. అందుకు స్త్రీలు విద్యావంతులు కావడమే కారణమన్నది నిస్సందేహం. విద్య వల్ల లభించిన అవకాశాలను అంది పుచ్చుకొని స్త్రీలు అన్ని రంగాలలో ప్రవేశిస్తున్నారు. ప్రతిభ చూపుతున్నారు. ఆకాశమే హద్దుగా విస్తరిస్తున్నారు. అయితే ఇది అర్ధ సత్యం మాత్రమే. ఈ పరిణామాల ప్రభావం ఏ మాత్రం సోకనంత - అసమ సంస్కృతి వల్ల కలిగిన - జడత్వంలో భారతీయ సమాజం వున్నదనేది మిగిలిన చీకటి కోణం. మానవాభివృద్ధి సూచిక ప్రమాణంగా దీనిని నిరూపించవచ్చు.

5

అభివృద్ధి అంటే కేవలం ఆర్థికపరమైన అభివృద్ధి కాదని, మానవ జీవన విధానంలో గుణాత్మకమైన మార్పు అనీ, అది మానవుల ఎంపిక చేసుకొనే అవకాశాలను విస్తృతం చేసేదిగా వుండాలనీ గుర్తించి 1990 నుండే యు.ఎన్.డి.పి. మానవాభివృద్ధి సూచికను తయారుచేయటం ప్రారంభించింది. ఇందులో ఇమిడివున్న ప్రధానమైన అంశాలు మూడు. 1) ఆరోగ్యంతో దీర్ఘకాలం జీవించడం 2)విద్యావంతులు కావటం 3) గౌరవకరమైన ఆర్థిక జీవన ప్రమాణాలను కలిగి వుండటం. వీటికి అదనంగా రాజకీయ స్వాతంత్ర్యాన్ని అనుభవించటం, ఆత్మగౌరవంతో జీవించగలగడం కూడా మానవాభివృద్ధిలో భాగాలే. ఈ దృష్ట్యా మానవాభివృద్ధిలో స్త్రీల అభివృద్ధికి వున్న స్థానం ఎంత అనేది తేల్చి చూడాలి.

మానవాభివృద్ధి సూచికలోని రెండవ అంశం విద్య. అదే ఈ వ్యాసంలో ప్రధాన ప్రమేయం. అక్షరాస్యత ఆయు: ప్రమాణాన్ని పెంచేదే అయినా స్త్రీల అక్షరాస్యతా శాతాన్ని నలభైకి మించి పెంచలేకపోతున్నాం. విద్యను పొందటం దానంతట అదే అభివృద్ధికి సూచిక అయినా ప్రాథమిక, మాధ్యమిక విద్య యాభైశాతం మందికి కూడా అందడం లేదు. ఇక ఉన్నత సాంకేతిక విద్య సంగతి చెప్పనే అక్కరలేదు. 35 శాతం కన్నా స్త్రీలు అటువంటి అవకాశాన్ని పొందలేకపోతున్నారు. మొత్తం మీద దాదాపు యాభై శాతం పైగా స్త్రీలు మానవాభివృద్ధి సూచిక నిర్వచించిన అభివృద్ధి పరిధిలోకే రాకుండా అంచులకు నెట్టివేయబడ్డారు. కాగా పరిమాణాత్మకంగానే మానవాభివృద్ధి స్త్రీల అభివృద్ధి కాదని స్పష్టమవుతున్నది.

విద్య ద్వారా మానవాభివృద్ధి సూచిక నిర్వచించిన అభివృద్ధి పరిధిలోకి వచ్చిన ఆ నలభై శాతం స్త్రీల జీవితాలలో గుణాత్మకమైన మార్పులు ఏమైనా వచ్చాయా అని తరచి చూస్తే కలిగేది నిరాశే. ఆరోగ్యం, ఆయు:ప్రమాణం - స్త్రీలకు అందేవి, పెరిగేవి కావు. చదువుకొన్న స్త్రీలకు సైతం తమ ఆరోగ్యం గురించి ఆలోచించే తీరుబాటు వెసులుబాటు లేకుండా చేస్తుంది పితృస్వామిక సంస్కృతి. పితృస్వామిక కుటుంబంలోని అవసరాలు, అవకాశాలు, ప్రాధాన్యతల సంబంధంలో స్త్రీల ఆరోగ్యం తరచూ నిర్లక్ష్యానికి గురి అవుతుంది. అందువల్ల స్త్రీలు ఆరోగ్య పరిరక్షణకు తీసుకునే చర్యలు అంతంతమాత్రమే. ప్రపంచీకరణ క్రమంలో వైద్య సదుపాయాలు ప్రైవేటీకరించబడిన నేపథ్యంలో వైద్యం ఖరీదైన సరుకై సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నది. సామాన్యులలో కెల్ల సామాన్యురాలైన స్త్రీకి ఆరోగ్యం ఎక్కడిది ?

ఆరోగ్యం సరే, పెండ్లి డబ్బు ప్రాధాన్యత కలిగిన వ్యవస్థ అయి కట్నం కోసం హింస కుటుంబ సంబంధాలలో భాగమై హత్యలకు ఆత్మహత్యలకు స్త్రీ జీవితాలు అర్థాంతరంగా ముగుస్తున్న సందర్భంలో దీర్ఘకాలం జీవించే హక్కు అవకాశం స్త్రీలు కోల్పోతున్నారు. సామాజిక నేరాలు, హింస పెరిగిపోతూ ప్రేమ పేరు మీదనో, స్త్రీ మీద తన అధికారం నిరూపించుకొనాలనే మగ దురహంకారం వల్లనో, స్త్రీ లైంగికానుభవానికే వున్నదన్న అల్పత్వంతో చేసే అరాచకాలు, అత్యాచారాల వల్లనో హైస్కూలు విద్యార్థుల నుండి కాలేజీ విద్యార్థుల వరకూ అర్థాంతరంగా బ్రతుకులు చాలిస్తున్న వర్తమాన విషాదం ఆరోగ్యంతో దీర్ఘకాలం జీవించటం అనే హక్కు స్త్రీకి నిరాకరించబడటాన్నే సూచిస్తున్నది.

సాధారణంగా స్త్రీల కంటూ ఒక ప్రత్యేక ఆర్థిక జీవన ప్రమాణం వుంటుందని వూహించటమే కష్టం. పురుషుని ఆర్థిక జీవన ప్రమాణ స్థాయిని బట్టి స్త్రీల ఆర్థిక జీవన ప్రమాణం వుంటుంది. విద్యతో నిమిత్తం వున్నా లేకపోయినా దేశం మొత్తం మీద 1991 జనాభా లెక్కల ప్రకారం ఆర్థిక ప్రతిఫలం పొందగలిగిన పనులు చేసే ప్రజలలో స్త్రీలు కేవలం 28.58 శాతం మాత్రమే. అందులో వ్యవస్థీకృత రంగాలలో పని చేసే స్త్రీలు 4.21 శాతం. వీళ్ళకు కూడా తమ స్వంత సంపాదనపై వున్న నియంత్రణ ప్రశ్నార్థకమే. ఇటువంటి పరిస్థితులలో గౌరవకరమైన ఆర్థిక జీవన ప్రమాణాలు స్త్రీలు ఎప్పటికి అందుకోగలుగుతారు?

మానవాభివృద్ధిని నిర్ణయించే మరొక అంశం రాజకీయ స్వాతంత్ర్యాన్ని అనుభవించటం. అయితే రాజకీయాలలో స్త్రీల క్రియాశీలక భాగస్వామ్యం చాలా స్వల్పం. దీనిని గుర్తించటం వల్లనే 1992లో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్ సంస్థలలో, స్థానిక స్వయం పరిపాలనా వ్యవస్థలలో స్త్రీలకు 33.3 శాతం సీట్లను కేటాయించడం జరిగింది. ఆనాటి నుండి ఈనాటివరకు చట్టసభలలో స్త్రీలకు రిజర్వేషన్‌కు సంబంధించిన అంశం వివాదాస్పదంగానే వుంది. రాజకీయాలలోకి ప్రవేశించగలిగిన అతికొద్దిమంది స్త్రీలకు కూడా రాజకీయ స్వయం నిర్ణయాధికారం లేదు. వాళ్ళకు సంబంధించిన పురుషులు అసలు సూత్రధారులై ఆ పదవి వల్ల వచ్చిన సమస్త హక్కులను, అధికారాలను తాము చెలాయించడం ఈనాడు మన అనుభవంలో వున్న విషయమే.

పురుషుల జీవితాలలోనే మానవహక్కులకు పూర్తి హామీ లభించడం లేదు. సామాజిక ఆర్థిక రాజకీయ కోణాల నుండి హక్కుల నిరాకరణకు గురవుతున్న వాళ్ళు ఎంతోమంది. అటువంటప్పుడు మనిషిగా ఒక ప్రత్యేక అస్తిత్వమే అభావం చేయబడిన స్థితిలో వున్న స్త్రీకి మానవహక్కులు ఇంట్లోనైనా, బయట అయినా అనుభవంలోకి రావటం కల్ల. ఇక ఆత్మగౌరవడంతో జీవించే పరిస్థితి ఎక్కడిది? విద్య వల్ల అభివృద్ధి అనేది స్త్రీ ల విషయంలో పితృస్వామిక సామ్రాజ్యవాద సంస్కృతితోటి సాపేక్ష సంబంధంలో చేరలేని గమ్యమే అవుతున్నది.

స్త్రీ విద్య కోసం అంతర్జాతీయ వత్తిడులు, జాతీయ విధానాలు సవాలక్ష కార్యక్రమాలు వున్నప్పటికీ స్త్రీ విద్య ఇంకా అపరిష్కృత అంశంగానే మిగిలిపోవడానికి ఆర్థిక వనరులను సమకూర్చటంతో అంతా సాధ్యమవుతుందనే దృక్పథం కారణం. వసతులు, ప్రత్యేక రాయితీలు వున్నప్పటికీ స్త్రీలు చదువుకొనడానికి ముందుకు రాలేకపోవటానికి వున్న సామాజిక సాంస్కృతిక కారణాలను సంబోధించకపోవడం ప్రధాన లోపం.

సంస్కరణోద్యమ కాలంలోనే స్త్రీ విద్యకు అవరోధంగా వున్న కౌటుంబిక సామాజిక కారణాలను కొంతవరకు గుర్తించారు. అంతకంటే గుణాత్మకంగా స్త్రీ వాద ఉద్యమం పితృస్వామ్య అణచివేత నిర్మాణాలను రూపాలనూ, భావజాలాన్ని నిరూపించి స్త్రీ విద్యకు అవరోధంగా వున్న లైంగిక రాజకీయాలను స్పష్టం చేసింది. అయితే స్త్రీ విద్య కోసం రూపొందించిన కార్యాచరణ

పథకాలలో ఈ అవగాహన భాగం కాలేదు.


విద్యావిభాగం వారు 1986లో విడుదల చేసిన జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) స్త్రీ సమానతా సాధనకు విద్య ఉపయోగపడాలని, స్త్రీల సాధికారతా సాధనలో విద్య ప్రధాన పాత్ర వహించాలని నిర్దేశిస్తూ అందుకు ప్రభుత్వ బాధ్యత ఎంతయినా వున్నదని పేర్కొన్నది. ముఖ్యంగా పాఠ్యాంశాలను పునర్నిర్మించాలని, అధ్యాపకులకు, నిర్ణయాధికారులకు, పాలనా విధులు నిర్వహించే ఉద్యోగులకు స్త్రీ విద్యకు, సమానతకు సంబంధించిన నూతన ప్రజాస్వామిక చైతన్యం కలిగించే శిక్షణ ఇవ్వాలని కూడా చెప్పింది. మహిళా జన జీవన అధ్యయనం పాఠ్యాంశాలలో భాగం కావాలని అది స్త్రీల అభివృద్ధికి తోడ్పడాలని నొక్కి చెప్పింది. అయితే ఈ అంశాలేవీ కూడా విద్యా వ్యవస్థలో వాస్తవీకరించబడక పోవటం ఒక విషాదం.

సార్క్ 1991-2000 కాలాన్ని బాలికా దశాబ్దిగా ప్రకటించింది. అందుకొరకు రూపొందించబడిన జాతీయ ప్రణాళిక

"Rights can be declared and policies can be formulated to express our collective liberal and humanistic concern, but unless the real life of the girl child in her family and community is touched by tangible efforts and actions, nothing can be achieved. Therefore a climate has to be created in which she can exercise her rights freely and fearlessly. One has to work for the transformation of those social and cultural values that shackle and constrict the girl child and mould her into stereotypical roles. For this every forum and every platform should be used to create awareness and stimulate positive action. Alongwith this effective implementation of the laws for protecting her and provision of opportunity for her to benefit from them has to be ensured" అని ప్రకటించింది. ఈ దిశగా చిత్తశుద్ధితో కృషి జరిగినప్పుడు విద్య ఎక్కువమంది స్త్రీలకు అందుబాటులోకి వస్తుంది. నిజమైన అర్థంలో స్త్రీల హోదా పెరుగుదలకు అది దారి తీస్తుంది. ❑

కొత్త పుస్తకాలు


'వీక్షణం' లో ఇకనుంచి ప్రతి సంచికలోనూ పుస్తక సమీక్ష, పుస్తక పరిచయం, పుస్తక స్వీకారం ఉంటాయి. అయితే సామాజిక, ఆర్థిక పత్రికగా 'వీక్షణం' ఈ శీర్షికల కింద సృజనాత్మక సాహిత్య ప్రక్రియల (కవిత్వం, కథ, నవల, నాటకం, సాహిత్య, విమర్శ, దృశ్య కళారూపాలు) పుస్తకాలను పరిచయం చేయాలనుకోవడం లేదు. ఇవాళ తెలుగులో సామాజిక, ఆర్థిక, రాజకీయ, తాత్విక, చారిత్రక అంశాలకు సంబంధించిన ఎన్నో విశ్లేషణాత్మక పుస్తకాలు వెలువడుతున్నాయి. వ్యాసం, వాదం, విశ్లేషణ, చర్చ రూపంలో ఉంటున్న ఈ పుస్తకాల సమీక్ష, పరిచయం, స్వీకారంలకు ఈ శీర్షిక పరిమితమవుతుంది. ప్రచురణకర్తలు తమ పుస్తకాలను రెండు కాపీల చొప్పున వీక్షణం కార్యాలయానికి పంపాలి.



ఫ్రెంచి విప్లవం: పారిస్ కమ్యూన్ (ప్రజా విప్లవం నుంచి ప్రజా పాలన వరకూ)- డా. మానేపల్లి, స్ట్రగుల్ కమిటీ అగెనెస్ట్ ప్రైవేటైజేషన్ ప్రచురణ. 30 పేజీలు, వెల రు.6. ప్రతులకు: ఎ.ఎర్నెస్ట్, 65-4-15, శాంతినగర్, కోరమండల్ గేటు వద్ద, విశాఖపట్నం.



మేధావి నిబద్ధత - పాల్ ఎ బారన్, అనువాదం: యస్. సప్దర్ అహ్మద్, ప్రచురణ: లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, 16 పేజీలు, వెల రు. 3, ప్రతులకు: డి. రాధాకృష్ణమూర్తి, 5-85-4/బి, 1వ లైను, పండరిపురం, గుంటూరు-522 002.



బ్యాంకు బాబుల పాటకే మన్మోహన్ రాగం! వై.ఎస్. తాళం!! -ఎస్. వీరయ్య, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురణ, 30 పేజీలు. వెల రు.2, ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌజ్, హైదరాబాద్.

(16వ పేజీ తరువాయి)

ప్రభుత్వ శాఖలు, పబ్లిక్ సంస్థలు విధిగా వెల్లడించాల్సిన సమాచారం

ఈ చట్టం ప్రకటన జరిగిన 2005 జూన్ 15 నుండి 120 రోజులలోగా ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థ ఈ క్రింది సమాచారాన్ని విధిగా ప్రకటించాలి.

1. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థ తన సంస్థకు సంబంధించిన వివరాలు, విధులు, బాధ్యతలు
2. ఆయా శాఖల, సంస్థల ఆఫీసర్లు, ఉద్యోగుల అధికారాలు, విధులు.
3. నిర్ణయాలు చేసే ప్రక్రియలో అనుసరించే పద్ధతులు, పర్యవేక్షణకు, జవాబుదారీతనానికి ఉన్న మార్గాలు
4. ఆయా శాఖలు, సంస్థలు తమ బాధ్యతల నిర్వహణ కోసం రూపొందించుకున్న నియమావళి.
5. ఆయా శాఖల, సంస్థల ఉద్యోగులు బాధ్యతలను నిర్వహించడానికి వినియోగిస్తున్న నియమావళి, రెగ్యులేషన్లు, ఆదేశాలు, మాన్యువల్స్, రికార్డులు.
6. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థ తనవద్దనున్న లేదా తన ఆధీనంలో వున్న వివిధ రకాల డాక్యుమెంట్ల పట్టిక.
7. అవి తమ విధాన రూపకల్పనలో లేదా వాటిని అమలు చేసే ప్రక్రియలో ప్రజల ప్రతినిధులతో సంప్రదింపులకు లేదా ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించడానికి ఏదైనా ఏర్పాటు వుండి వుంటే దాని వివరాలు.
8. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థలకు గల బోర్డులు, కౌన్సిళ్ళు, కమిటీలు అలాగే సంస్థలో భాగంగా ఏర్పాటు చేసుకొన్న విభాగాల పట్టిక. ఈ బోర్డులు, కౌన్సిళ్ళు, కమిటీలు ఇతర విభాగాల సమావేశాలు బహిరంగమైనవేనా కాదా, అలాగే ఆయా సమావేశాల మినిట్స్ ప్రజలకు వెల్లడించేవేనా కాదా అన్న వివరాల ప్రకటన.
9. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థ అధికారుల, ఉద్యోగుల వివరాలతో కూడిన డైరక్టరీ.
10. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థలోని అధికారులు, ఉద్యోగులు వ్యక్తిగతంగా నెలవారీ పొందే జీతభత్యాలు, ఇతర రాయితీల వివరాలు.
11. ప్రతి ప్రభుత్వ శాఖ పబ్లిక్ సంస్థలు తమ ఏజెన్సీలకు కేటాయించిన బడ్జెట్లు, వాటి ప్రణాళికలు, వివరాలు, ప్రతిపాదించిన వ్యయాలు, వాటికి పంపిణీ చేసిన నిధుల నివేదికలు.
12. సబ్సిడీ కార్యక్రమాలు అమలు చేసే పద్ధతి , కేటాయించిన సొమ్ము, లబ్ధిదారుల వివరాలు.
13. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థల నుండి రాయితీలు, పర్మిట్లు, పొందిన లేదా ఆథరైజేషన్లు పొందిన వారి వివరాలు.
14. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థల వద్ద అందుబాటులో వున్న లేదా వాటి ఆధీనంలో వున్న సమాచారం, ఎలక్ట్రానిక్ రూపంలో నిక్షిప్తమై వున్న సమాచారం వివరాలు.
15. సమాచారం పొందడానికి పౌరులకు కల్పించబడిన సదుపాయాల వివరాలు, ప్రజల వినియోగం కోసం నిర్వహిస్తున్న లైబ్రరీలు లేదా రీడింగ్ రూములు వుంటే వాటి పని వేళల వివరాలు.
16. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థలు తమ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ అధికారుల పేర్లు, హోదాలు ఇతర వివరాల ప్రకటన.
17. ప్రతి ప్రభుత్వ శాఖ, పబ్లిక్ సంస్థ ప్రతి సంవత్సరం పై అంశాలపై సవరించిన తాజా సమాచారాన్ని రూపొందించి ప్రకటించాలి.

తీసుకోవలసిన ఇతర చర్యలు:

- అన్ని ప్రభుత్వ శాఖలు, పబ్లిక్ సంస్థలు ముఖ్యమైన విధానాలను రూపొందించే ముందు లేదా ప్రజలకు వర్తించే నిర్ణయాలను ప్రకటించే ముందు దానికి సంబంధించిన వాస్తవ అంశాలను వెల్లడించాలి
- అన్ని ప్రభుత్వ శాఖలు, పబ్లిక్ సంస్థలు ఇవ్వగలిగినంత సమాచారాన్ని స్వచ్ఛందంగా అందించడం ఒక నిరంతర ప్రక్రియ కావాలి. వివిధ సమాచార మాధ్యమాల ద్వారా, ఇంటర్నెట్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని వెల్లడించడం ద్వారా ప్రజలు ఈ చట్టాన్ని పదే పదే వినియోగించుకోవలసిన అవసరం లేకుండా చెయ్యాలి.
- ఈ సమాచారాన్ని స్థానిక భాషలో తక్కువ ఖర్చుతో, తేలికగా అందుబాటు అయ్యేలా వెల్లడించడానికి చర్యలు తీసుకోవాలి. ఈ సమాచారం అంతా ఎలక్ట్రానిక్ రూపంలో ఆయా సంస్థల పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్లకు అందుబాటులో వుంచాలి. ఆ సమాచారాన్ని ఉచితంగా గాని, ప్రింటు ఖర్చు ఇతర సాధనాలకయ్యే ఖర్చుతో గాని అందించాలి.

సమాచారం పొందడం ఎలా ?

దరఖాస్తు:

- ఇంగ్లీషు, హిందీ లేదా స్థానిక అధికార భాషలో వ్రాతపూర్వకంగా లేదా ఎలక్ట్రానిక్ రూపంలో. వ్రాయలేని వారికి దరఖాస్తు రాసి పెట్టడానికి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారుల తోడ్పాటు తీసుకోవచ్చును.
- దరఖాస్తుతో పాటు నిర్ణయించిన రుసుం చెల్లించాలి. దారిద్ర్యరేఖకు దిగువన వున్నవారు ఎలాంటి రుసుము చెల్లించనక్కరలేదు.
- దరఖాస్తులో ఏ సమాచారాన్ని కోరుతున్నదీ నిర్దిష్టంగా వుండాలి.
- సమాచారం అడగడానికి కారణాలు, వ్యక్తిగత వివరాలు చెప్పనక్కరలేదు. చిరునామా ఇస్తే సరిపోతుంది.

❑

వీక్షణం చందాదారులుగా చేరండి!
వీక్షణం ను మిత్రులకు పరిచయం చేయండి!

తెలుగు నాట విలక్షణమైన ఆర్థిక, సామాజిక పత్రిక 'వీక్షణం' ను రెండు సంవత్సరాలకు పైగా ఆదరించి పోషిస్తున్న మిత్రులందరికీ 'వీక్షణం' సంపాదకవర్గం వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుతోంది. అయితే తెలుగుసీమలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల విశ్లేషణ కోసం ప్రజలలో, పాఠకులలో, ఆలోచనా పరులలో వ్యక్తమవుతున్న తహతహకూ, ఆ ఆసక్తిని తీర్చడంలో 'వీక్షణం' చేస్తున్న కృషికీ మధ్య చాల అంతరం ఉంది. ఆ అంతరం పూడాలంటే 'వీక్షణం' కు పాఠకుల నుంచే ఇతోధిక సహకారం అందాలి. 'వీక్షణం' చందాదారుల సంఖ్య కనీసం మూడురెట్లు పెరిగితే గాని, 'వీక్షణం' తన ముందు పెట్టుకున్న కర్తవ్యాలను తీర్చడం సాధ్యం కాదు. అంటే 'వీక్షణం' పాఠకులలో ప్రతి ఒక్కరూ తమ చందాలను క్రమం తప్పకుండా పునరుద్ధరించుకోవడంతో పాటు, కనీస మరొక ముగ్గురు మిత్రులకు 'వీక్షణం' ను పరిచయం చేసి చందాలు కట్టించాలి.

'వీక్షణం' చందాదారులుగా చేరండి!
మీ మిత్రులను 'వీక్షణం' చందాదారులుగా చేర్చండి!
ఇది వీక్షణం కు సాయం కాదు, తెలుగు సమాజం తన గురించి తాను
తెలుసుకోవడానికి చేసే అన్వేషణకు సాయం!

వీక్షణం విడిప్రతి రు. 10, సంవత్సర చందా రు. 120, దశాబ్ది చందా రు. 1,000
చందాలు కింది చిరునామాకు ఎం.ఓ./డి.డి. ద్వారా పంపవచ్చు.

వీక్షణం, సిడిఆర్‌సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం.3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

మీలోని రచయితను వెలికి తీయండి!
వీక్షణం మీ రచన కోసం వేచి చూస్తోంది!

మీ చుట్టూ, మీ గ్రామంలో, మీ బస్తీలో, మీ పని స్థలంలో, మీరు పనిచేసే సంఘంలో ఏదో ఒక ఘటన మిమ్మల్ని కదిలిస్తుంది. మీలో ఆలోచనలు రగిలిస్తుంది. ఆ ఘటన వెనుక ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మూలాల గురించి మీరు అన్వేషిస్తుంటారు. మీ ఆలోచనలను రాయండి. సరిగ్గా 'వీక్షణం' ఎదురు చూస్తున్నది అటువంటి క్షేత్ర నివేదికల కోసమే. 'వీక్షణం' ఆర్థిక, సామాజిక పత్రిక తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే ఆలోచనలకు, అన్వేషణలకు ఒక వేదిక. మీరు అట్టడుగు నుంచి, మీ అనుభవాల నుంచి పంపే నివేదికలు ఆ ఆలోచనల్లో, అన్వేషణల్లో భాగమే.

'వీక్షణం' ను ఇటు క్షేత్ర నివేదికల, అటు నిపుణుల విశ్లేషణల మేలు కలయికగా తీర్చిదిద్దాలని సంపాదకవర్గం ప్రయత్నిస్తోంది. మన జీవితాల మీద ప్రగాఢ ప్రభావం వేయగల అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పరిణామాల మీద నిపుణుల విశ్లేషణలు ఎంత అవసరమో, ఆ పరిణామాలు అట్టడుగు మనుషుల జీవన సరళిని ఎట్లా మారుస్తున్నాయో కింది నుంచి నివేదించడమూ అంతే అవసరం.

వీక్షణం మీ పత్రిక వీక్షణం మన పత్రిక
వీక్షణం తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే అన్వేషణ. ఆ అన్వేషణలో భాగం పంచుకోండి.
రచనలు పంపవలసిన చిరునామా:

సంపాదకుడు, వీక్షణం, సి.డి.ఆర్.సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం.3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

PRINTED BOOK
RNI Regn. No. APTEL/2003/11482
Postal Regn. No. LII/RNP/H-HD-1029/2004-06

వీళ్ళు మా రచయితలయితే...

కె.జి. కన్నబిరాన్, ఎన్. ఇన్నయ్య, మల్లాది సుబ్బమ్మ, చుక్కా రామయ్య, సారంపల్లి మల్లారెడ్డి, కాలువ మల్లయ్య, పశ్య పద్మ, బి.వి. రాఘవులు, ఎస్.వి. శేషగిరిరావు, పొత్తూరి వెంకటేశ్వర రావు, మాడభూషి శ్రీధర్, డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, ఆర్.ఎస్. రావు, ప్రొ. జి. హరగోపాల్, ప్రొ.కె.ఆర్. చౌదరి, కొల్లి నాగేశ్వర రావు, బొజ్జా తారకం, ఎ.బి.కె. ప్రసాద్, కె.ఎల్. మహేంద్ర, కె. బాలగోపాల్, ప్రొ. కె. చక్రధరరావు, ప్రొ. ఆర్.వి.ఆర్. చంద్రశేఖర్‌రావు, జ్వాలాముఖి, తెలకపల్లి రవి, డి. పాపారావు, ప్రొ. వకుళాభరణం రామకృష్ణ, సురవరం సుధాకర రెడ్డి, గుడిపూడి విజయరావు, డా. పి.వి.ఆర్. భాస్కరరావు, బి. ఎర్రంరాజు, ఎం. కోదండరాం, చూపు కాత్యాయని, డా. సి. రామచంద్రయ్య, రేవతి, కాత్యాయనీ విద్మహే, వి. శ్రీహరి, పుణ్యవతి, ఎన్. శ్రీదేవి

మీరు

వీక్షణం

సామాజిక ఆర్థిక పత్రిక

చదవకుండా ఉండగలరా?

విడిప్రతి రూ 10/-
సంవత్సర చందా రూ 120/-

ప్రచురణ

సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసర్చ్ అండ్ కమ్యూనికేషన్

మైత్రి రెసిడెన్సి, స్ట్రీట్ నెం.3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-29 ఫోన్ నెం. 040- 55843495

Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No.3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 55843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency,
3-6-394, Road No.3, Himayatnagar, Hyderabad - 500 029.